22-2Pg1FB.qxd:22-2Pg1FB.qxd 01/01/01 10:33 AM Page 1


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు, : fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-2-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 21 పేజీలు: 12 వెల: 6.50


మహాయుతిలో తారస్థాయికి చేరిన లుకలుకలు

ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్‌గా కాశ్‌పటేల్ 9లో

ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యమా? 9లో

## రాష్ట్రంలో ఇక ప్రజలందరికి


# 25లక్షల ఆరోగ్యబీమా

### ఈ ఉచిత పథకం ఏప్రిల్ లేదా మే నుంచి అమలు

### 30 రకాల స్పెషాల్టీలతో కలిపి 3,257 రకాల చికిత్సలు

### కొత్త విధానంలో 6 గంటల్లోనే చికిత్స ఆరంభం

### ప్రతి కుటుంబం తరపున ప్రభుత్వం రూ.2,500 దాకా ప్రీమియం చెల్లింపు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య సేవల విషయంలో ప్రజలకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు.ఇందుకు వీలుగా ప్రభుత్వం రూ.25లక్షల ఆరోగ్యబీమాను అందుబాటులోకి తీసుకుని వస్తామని తెలిపారు.ఈ క్రమంలో సీఎం చంద్రబాబు ఆలోచనా విధానాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రజలందరికీ త్వరలోనే ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలోని ప్రజలందరికి బీమాకు వర్తింపచేసి,తద్వారా ఆరోగ్యబీమా(హెల్త్ ఇన్సురెన్స్)ను రూ.25లక్షల వరకు వైద్యసేవలు అందిస్తారు. ఈ విధానం అమలు కోసం పలు ప్రతిపాదనలను చేసారు.వీటిలో కీలక ప్రతిపాదనను అమలులోకి తీసుకుని వస్తారు. ఈ విధానం అమల్లోకి వస్తే చికిత్స కోసం ఎక్కువ సమయం ఇబ్బంది పడాల్సి ఉండదన్నారు.బీమా విధానంలో 6గంటల్లోనే చికిత్సప్రారంభ అనుమతి లభిస్తుంది. చికిత్సకు ఆమోదం తెలిపేందుకు బీమా సంస్థ నిరాకరిస్తేవెంటనే అప్పీలు చేసుకునే వెసులు బాటును కల్పిస్తారు. ఈ విధానంలో ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఉంటాయి. ఎంపిక చేసిన బీమా కంపెనీ మూడేళ్ల పాటు సర్వీసును అందించాలి. ప్రతిఏడాది పని తీరును సమీక్షిస్తారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవట్రస్టు అనుబంధ ఆసుపత్రులు బీమా విధానంలోనూ కొనసాగుతాయి. వైద్యమిత్రల సేవలనుకొనసాగిస్తారు. ఎంపిక చేసిన బీమా సంస్థలకు ప్రతి మూడునెలల కొకసారి ప్రభుత్వపరంగా ముందుగానే చెల్లింపులు చేస్తారు. దీనివల్ల బిల్లుల చెల్లింపుల సమస్యలు తలెత్తవు. రోగులకు చికిత్స వివరాలు అందిన తర్వాత బీమా సంస్థలు సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు చేసేలా నిర్దేశిత గడువును కూడా టెండరు డాక్యుమెంట్‌లో పొందుపరుస్తున్నారు. ప్రస్తుతం 30రకాల స్పెషాల్టీలతో కలిపి 3వేల 257రకాల చికిత్సలు అందు బాటులో ఉన్నాయి. వీటిని అలాగే కొనసాగిస్తారు. ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన కింద అందే 19వందల49రకాల చికిత్సలూ ఇందులో ఉన్నాయి. బీమా ప్రీమియం కింద ప్రభుత్వం చెల్లించే మొత్తం కంటే తక్కువగా ఖర్చు అయితే అందులో నిర్వహణ వ్యయ మొత్తాన్ని కంపెనీలు మినహాయించుకుని మిగిలిన దానిని వెనక్కి ఇచ్చేయాలి. ఎక్కువైతే మాత్రం బీమా కంపెనీ భరించాలన్న విధంగా ప్రతిపాదనలు సిద్ధమ >>2

# మిర్చిపై కేంద్రంతో చర్చలు

### గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు

### 15శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ప్రణాళికలు

### గత పాలకుల నిర్వాకంతో ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేస్తొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయి, వృద్ధి రేటు మొదలైందన్నారు. మిర్చిరైతులకు గిట్టుబాటు ధర కల్పించే దిశలో కేంద్రంతో చర్చలు జరుపుతున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు,అమరావతి రాజధాని నిర్మాణాలకు కేంద్రం నుంచి నిధులు విడుదల అంశంలో మంచి సహకారం లభిస్తుందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల24న జరుగుతున్నాయి.ఈ నెల28న అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు.ఈ క్రమంలో బడ్జెట్ అంశాలతో పాటు,వివిధ విషయాలపై సీఎం చంద్రబాబు వర్చువల్‌గాను,మౌఖికంగా చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నన్ను నమ్మారు. నేను వస్తే అభివృద్ధి జరుగుతుందనే విశ్వాసం వారిదన్నారు.వారికి ఎన్నికల సందర్భంలో ఇచ్చిన సందర్భంగా ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామన్నారు.బడ్జెట్‌లో ఇందుకు అనుగుణంగా కేటాయింపులు జరగాలన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసే రీతిలో నిధులు కేటాయింపు ఉంటుం దన్నారు.మంచి అభివృద్ధి కార్యక్రమాలు అమలుతోనే సంపద వస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఓట్లు వేసి గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని 15శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. 2047 నాటికి 42 వేల డాలర్ల తలసరి ఆదాయం లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సమాధి చేశారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. గత పాలనలో ఎవ్వరికీ స్వేచ్ఛ లేదు. ఇక్కడ పుట్టి పెరిగిన వారు కూడా రాష్ట్రానికి రావాలన్నా, పెట్టుబడులు పెట్టాలన్నా భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. విపత్కర పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లే బాధ్యత ప్రజలు మాకు అప్పగించారని ముఖ్యమంత్రి అన్నారు. అభివృద్ధివల్ల సంపద వస్తుంది. సంపద వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ ఆదాయం పెరిగితే దాన్ని సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించి పేదరికం రూపుమాపవచ్చు. ఇది నేను నమ్మిన ఆర్థిక సిద్ధాంతం. 1995లో నేను ఐటీ అంటే అందరూ నవ్వారు. ఐటీ తీసుకొస్తే తిండిపెడుతుందా అని చాలామంది ఎగతాళి చేశారు. నేడు ఐటీ మనిషిని ఎక్కడికో తీసుకెళుతోంది. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణలు, 1992లో వచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని నేను మనసావాచా నమ్మి ఆచరణలో పెట్టాను. నేను తెచ్చిన విజన్ 2020తో నేడు దేశంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణ ముందుంది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు ఎక్కువ తలసరి ఆదాయం సంపాదిస్తున్నారు. రెండోతరం ఆర్థిక సంస్కరణలకు నేను నాంది పలికాను. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి రాష్ట్రానికి వెలుగులు ఇచ్చినేను ఓడిపోయాను. ఆ విషయంలో నేను రాజీపడి ఉంటే ఓడిపోయేవాడిని కాదేమో.

## కెఆర్ఎంబి ప్రత్యేక సమావేశం వాయిదా

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకునీటి వాటాలు,ఇతర అం శాలపై చర్చించేందుకు ఇవాళ కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది. అయితే తనకు ముందు గానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఇవాళ్టి సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు.దీంతో ప్రత్యేక సమా వేశాన్ని కేఆర్ఎంబీ సోమవారానికి వాయి దా వేసింది.సోమవారం మధ్యాహ్నం మూ డున్నర గంటలకు హైదరాబాద్‌లో జల సౌధలో సమావేశం జరగనుంది.



శుక్రవారం విజయవాడలో ఏపీ,తమిళనాడు రాష్ట్రాల చేనేత, జౌళిశాఖల మంత్రులు ఎస్.సవిత, ఆర్.గాంధీ సమక్షంలో ఆప్కో, కో ఆప్టెక్స్ మధ్య చేనేత వస్త్రాల అమ్మకాలపై ఒప్పందం దృశ్యం

# కో ఆప్టెక్స్‌తో ఆప్కో కీలక ఒప్పందం

### తమిళనాడు, ఎపి మంత్రుల సమక్షంలో ఎంఒయు

### రూ.9.20 కోట్ల వస్త్రాల విక్రయాలు లక్ష్యం

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని చేనేత కార్మికులకు 365 రోజులు పని కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం మరో కీలక ముందుకు వేసింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన ఆప్కో,కోఆప్టెక్స్ ఏజెన్సీలు తమషోరూమ్‌ల్లో రెండురాష్ట్రాల చేనేత వస్త్రాలు విక్రయించుకునేలా >>2

## తెలంగాణ డిజి అంజనీకుమార్ ఎపికి మార్పు

### 24 గంటల్లోగా రిపోర్ట్ చేయాలని కేంద్రహోంశాఖ ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి21:** తెలంగాణలో ఉన్న ముగ్గురు ఐపిఎస్ అధికారులకు కేంద్రం షాక్ ఇచ్చింది. తెలంగాణలో రోడ్ సేఫ్టీ డీజీగా కొనసాగుతున్న అంజనీకుమార్‌ను వెంటనే రిలీవ్ చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఏపీ కేడర్ ఐపిఎస్ అధికారిగా ఉన్న అంజనీకుమార్‌తో పాటు అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి సైతం ఏపీకి కేటాయించబడిన అధికారులు. అయితే వారు ఏపికి వెళ్లకుండా తెలంగాణలోనే ఉండిపోయారు. ప్రస్తుతం కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా మహంతి విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా బిస్త్ పని చేస్తున్నారు. అయితే ఈ ముగ్గురిని ఏపీ కేడర్‌లో 24గంటల్లోగా రిపోర్ట్ చేయాలని కేంద్ర హోం శాఖ ఆదేశించింది.

# టమాటా కొనుగోళ్లు చేపట్టిన ప్రభుత్వం

### మంత్రి అచ్చెన్ననాయుడు



**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** టమాటాకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్న నాయుడు తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ మార్కెటింగ్ అధికారులతో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టమాటా రైతులకు సరైన గిట్టుబాటుధర వచ్చేలా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకం మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం (ఎంఐఎస్)లో ఎన్ఎఫ్ఇడి,ఎన్‌సిసిఎఫ్ ద్వారా రాష్ట్రంలో ఉన్న టమాటాలను అన్ని ఆపరేషన్‌ల ఖర్చులను వారే భరించే విధంగా, టమాటా కొరత ఉన్న ఇతర రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణా, మధ్య ప్రదేశ్, మహారాష్ట్రలలో విక్రయించడానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. దీంతో కిలో టమాటా ధర సుమారు 10 నుండి 15 రూపాయల వరకు రైతులకు అందుతుందన్నారు.రైతులను ఆదుకొనేందుకుగాను తీసుకునే చర్యలలో భాగంగా, టమాటాధర చాలా తక్కువగా పలుకుతున్న అనంతపురంజిల్లా నుండి ప్రభుత్వమే టమాటాను సుమారు కిలో 8 రూపా యలకు కొనుగోలు చేసి రాష్ట్రంలో ఉన్న అన్ని రైతు బజార్లకు సరఫరా చేస్తున్నారు. ఈరోజు 1000 క్వింటాళ్ల టమాటాను అనంతపురం, కర్నూలు, విజయనగరం, అనకాపల్లిజిల్లాల నుండి సేకరించారు. వీటిలో విజయనగరం, అనకాపల్లిజిల్లాల నుండి సేకరించిన టమాటాలను విశాఖపట్టణం, రాజమండ్రి జిల్లాల్లోని రైత బజార్లలోనూ అనంతపురం, కర్నూలుజిల్లాల్లో సేకరించిన టమాటాలను విజయవాడ,గుంటూరుజిల్లాల రైతుబజార్లలో అమ్మకం చేపట్టినట్లు మంత్రి తెలిపారు.




ఆక్రమిత భూముల్లో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఎస్టేట్

# భూమి ఆక్రమించిన ఎమ్మెల్యేకు నోటీసులు

### నేడు జాయింట్ కలెక్టర్ కోర్టులో విచారణ

**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఉమ్మడి కడప జిల్లాలో 100 ఎకరాలు ఆక్రమించిన అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డికి జాయింట్ కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. శనివారం జాయింట్ కలెక్టర్ కోర్టులో హాజరు కావాలని తాఖీదులు పంపారు. ఈ వ్యవహారం సంచలనంగా మారింది. ఈ అక్రమ వ్యవహారంలో ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ కూడా చేసినట్లు బయటపడింది. వివరాలలోకి వెళితే రాజంపేట మండలం మందపల్లె, ఆకేపాడు గ్రామ రెవెన్యూ పొలంలో ఈ ఆక్రమణ జరిగినట్లు రాజంపేట టీడీపీ గ్రామీణ అధ్యక్షుడు గన్నే సుబ్బనర్సయ్యనాయుడు జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మందపల్లె సర్వే నెంబర్ 815/1లో 3.79ఎకరాలు, సర్వే నెంబర్ 814/4లో 4ఎకరాలు, ఆకేపాడు సర్వే నెంబర్ 56/8లో 5.68ఎకరాలు, 56-1లో 5ఎకరాలు, 56-9లో 2.35ఎకరాలు, 56-1లో ఒకటిన్నర ఎకరా, మందపల్లె సర్వే నెంబర్ 816-2లో 4.31ఎకరాలు, 814-3లో 4ఎకరాలు, 815-2లో 5ఎకరాలు, 814-1లో ఎకరా భూమి ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పైన పేర్కొన్న భూముల విస్తీర్ణం 39.58 ఎకరాలుగా పేర్కొన్నారు. అంతేకాకుండా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో జిరాయితీ పట్టా, అనువంశికంగా వచ్చినట్లు ఆన్‌లైన్ చేశారు. అంతేకాకుండా తిరుమలతిరుపతి దేవస్థానానికి ఆకేపాడు సర్వేనెంబర్ 56-1లో 1.50ఎకరాలు రిజిష్టర్ కూడ చేసి ఉన్నారు. ఇకపోతే పైన పేర్కొన్న సర్వే నెంబర్‌లలో అమర్‌నాథ్ రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి జ్యోతమ్మ, సోదరుడు అనిల్‌కుమార్ రెడ్డి, ఆయన భార్య సుజన పేర్లతో రాజంపేట సబ్ రిజిస్ట్రార్ 1761-2023, 1768, 1769, 1770, 1771, 1772, 1773, 1774, 1775, 2346 డాక్యుమెంట్లుగా >>2




VIJAYAWADA: MITHRA AUTO AGENCY: 8886063544 | VARUN MOTORS: 9885701729 | ENIKEPADU: VARUN MOTORS: 9885104222 | KANURU: SANTOSH AUTO: 7799787944 | ELURU: NOVELTY REDDY & REDDY MOTORS: 9533290285 | BHIMAVARAM: NOVELTY REDDY & REDDY MOTORS: 9948828555 | GUNTUR: JAYALAKSHMI AUTOMOTIVES: 7396669031 | NELLORE: VISHNU CARS: 7995088876 | BHARGAVI AUTOMOBILES: 9848357778 | ONGOLE: JAYALAKSHMI AUTOMOTIVES: 9949033433 | ANDHRA PRABHA COLONY: MITHRA AUTO AGENCY: 7337540033.



ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలిలో శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ

# కో ఆప్టెక్స్‌తో ఆప్కో కీలక ఒప్పందం

>> ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది రూ.9.20 కోట్ల మేర వస్త్రాల విక్రయాలు చేయాలని ఆప్కో, కో ఆప్టెక్స్ నిర్ణయించాయి. ఈ మేరకు విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్ లో శుక్రవారం జరిగిన బయ్యర్, సెల్లర్ మీట్ లో రెండు రాష్ట్రాల చేనేత, జౌళి శాఖ మంత్రులు ఎస్.సవిత, ఆర్.గాంధీ సమక్షంలో ఆప్కో, కో ఆప్టెక్స్ మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధితో పాటు చేనేత ఉత్పత్తులకు విస్తృతమైన మార్కెట్ సదుపాయం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ నగరాల్లో ఆప్కో ఆధ్వర్యంలో చేనేత ఎక్స్ పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తూ వస్తోంది. చేనేత కార్మికుల నేటి తరం అభిరుచులకు అనుగుణంగా డిజైన్లు, దుస్తుల తయారీపై శిక్షణ ఇస్తూ, తయారైన చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ సదుపాయం కల్పించాలన్న ఆశయంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో చేనేత సంస్థలతో కూడా ఒప్పందాలు కుదుర్చుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని చేనేత వస్త్రాలకు మార్కెట్ విస్తరణలో భాగంగా తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తో ఆప్కో ఒప్పందం చేసుకుంది. ఏపీ, తమిళనాడుకు చెందిన చేనేత,జౌళిశాఖ మంత్రులు సవిత, గాంధీ సమక్షంలో ఆప్కో ఎండీ పావనమూర్తి, కో ఆప్టెక్స్ ఎండీ దీపక్ జాకబ్ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఇరు రాష్ట్రాలకు చెందిన చేనేత సంస్థలు రూ.9.20 కోట్ల మేర ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఒప్పందంతో తమిళనాడుకు చెందిన చేనేత వస్త్రాలను ఆప్కో సహా ఇతర వ్యాపార సంస్థల్లో విక్రయిస్తారు. ఏపీకి చెందిన చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్ లతో పాటు తమిళనాడు వ్యాప్తంగా ఉన్న పలు వస్త్ర దుకాణాల్లో విక్రయించనున్నారు. కో ఆప్టెక్స్, ఆప్కో మధ్య రూ.20 లక్షలు, టీవీ, మదురై, తిరుచెన్ గోడ్ సర్కిల్, అరబిందో టెక్స్ టైల్స్ మధ్య రూ.1.25కోట్లు, సాలెమ్ సర్కిల్, శ్రీ సుదర్శన్ సిల్క్ మధ్య రూ.కోటి, ఈరోడ్ సర్కిల్, బళ్లార్ల నర్సింహామూర్తి సంస్థ మధ్య రూ.50 లక్షల మేర ఒప్పందం కుదిరాయి.వాటితో మరిన్ని ఏపీ, తమిళనాడుకు చెందిన సంస్థల మధ్య ఒప్పందాలు కుదిరాయి. త్వరలో మిగిలిన రాష్ట్రాలకు చెందిన చేనేత సంస్థలతోనూ ఒప్పందం చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆప్కో, కో ఆప్టెక్స్ ఒప్పందంతో ఏపీకి చెందిన చేనేత కార్మికులకు ఎంతో లబ్ధి కలుగనుంది. నేతన్నల దగ్గర తయారవుతున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం లభిస్తోంది. కో ఆప్టెక్స్ కు చెందిన చేనేత వస్త్రాలు డబుల్ ఖ్వాలిటీ బెడ్‌షీట్‌లు (కింగ్ సైజు), టర్కీ టవల్స్ (ప్రింట్ మరియు డైడ్), డోర్‌మ్యాట్‌లు, ఆరని సిల్క్ చీరలు, పళని బ్లై, డై చీరలను ఆప్కో షో రూమ్ ల్లో విక్రయిస్తారు. ఏపీకి చెందిన మంగళగిరి కాటన్, జరీ చీరలు, రాజమండ్రి కాటన్ చీరలు, బందర్ కాటన్ చీరలు,వెంకటగిరి కాటన్ చీరలు, మాధవరం కాటన్ చీరలు, సిల్క్ చీరతో పాటు ఇతర చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్ ల్లో విక్రయిస్తారు. ఏపీతో పాటు తమిళనాడు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న కో ఆప్టెక్స్ షో రూమ్ లో రాష్ట్రానికి చెందిన చేనేత వస్త్రాలను విక్రయించుకునే సౌలభ్యం కలుగుతుంది. దీనివల్ల ఉత్పత్తులన్నాను సరకును ఎప్పటికప్పుడు అమ్ముకుం కావడం వల్ల నేతన్నలకు ఆర్థికంగా ఎంతో లబ్ధి కలుగుతుంది. చేనేతలకు 365 రోజుల పాటు పని కల్పించాలన్న ఉద్దేశం కూడా నెరవేరుతోంది.

**తమిళనాడు బయ్యర్‌సెల్లార్ మీట్ ను ప్రారంభించిన ఏపీ మంత్రి సవిత..**


విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్ లో తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన బయ్యర్, సెల్లార్ మీట్ ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ లో తమిళనాడు ప్రభుత్వం కో ఆప్టెక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆ రాష్ట్ర మంత్రి ఆర్.గాంధీతో కలిసి పరిశీలించారు. చీరలు, ఇతర చేనేత వస్త్రాలను నాణ్యతను, ధరలను మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన చేనేత, జౌళి శాఖ కార్యదర్శి వి.అమృతవల్లి, డైరెక్టర్ మేఘాశ్వేరి రవికుమార్, ఏపీ చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు, చేనేత సొసైటీలు, పలు వాణిజ్య సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 25లక్షల ఆరోగ్యబీమా

>> య్యాయి. ప్రతి కుటుంబానికి తరఫున ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియం 2,500 వరకు ఉండొచ్చని అంచనా. జాతీయ స్థాయిలో పిలిచే టెండర్ల ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ బీమా కం పెనీలు పోటీపడతాయి. తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ బీమా సంస్థల ద్వారా అర్హత వారికి వైద్య సేవలు అందుతున్నాయి. డబ్ల్యూహెచ్‌వో అధ్యయన ఫలితాలు, వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఉత్తమ పద్ధతులను ప్రభుత్వం సమీక్షించింది. రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపచేసేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వీటిపై త్వరలో ఉన్నత స్థాయిలో జరిగే సమీక్ష సమావేశంలో చర్చించి అధికారిక నిర్ణయాన్ని తీసుకోనున్నారుఆరోగ్యబీమాను. వరుసలతో నిమిత్తం లేకుండా: దీనికి అనుగుణంగా ఉమ్మడి శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు ఒక యూనిట్, గుంటూరు నుంచి రాయలసీమ జిల్లాల వరకు మరో యూనిట్‌గా గుర్తించి టెండరు పిలవబోతున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవట్రస్టు కింద ఏడాదికి 25 లక్షల విలువైన చికిత్సలను ఉచితంగా ప్రస్తుతం అందిస్తున్నారు. కొత్త బీమా విధానంలో వార్షిక పరిమితి, ఇతర వరుసలతో నిమిత్తం లేకుండా ప్రజలందరికీ ఉచితంగా బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు వీలుగా టెండరు డాక్యుమెంట్ సిద్ధమైంది. ప్రతి కుటుంబానికి ఇప్పుడున్న 25లక్షల వార్షిక పరిమితి వైద్య సేవలు అలాగే కొనసాగుతాయి. అయితే ఏడాదికి రెండున్నర లక్షల రూపాయల వైద్య సేవలు ఉచితంగా అందించేలా టెండరు పిలుస్తారు. ఆపైన చికిత్సలకు అయ్యే ఖర్చును ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు భరిస్తుంది. ప్రస్తుతం ఏడాదికి రెండున్నర లక్షల్లోపు వ్యయమయ్యే చికిత్సలు పొందేవారి సంఖ్య రాష్ట్రంలో 97 శాతం ఉంది. సీఎం చంద్రబాబు సమక్షంలో నిర్వహం జరిగిన అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ లేదా మే నుంచి బీమా విధానం అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పనకు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ప్రధానంగా చర్చ జరగనుంది. ఆ మేరకు ప్రతిపాదనల్లో కొన్ని మార్పులు చేర్పులు చేయనున్నారు. ప్రస్తుతం వార్షిక ఆదాయం 5 లక్షలలోపు ఉన్న వారికి ట్రస్టు ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. ఈ పరిధిలో కోటీ 43 లక్షల కుటుంబాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి ఎనిమిదిన్నర లక్షల మంది ఉన్నారు. బీమా పథకం కింద ఏడాదికి ఒక్కో ఉద్యోగి, పెన్షనర్ సుమారు 7వేల వరకు చెల్లిస్తున్నారు. జర్నలిస్టులు కూడా ప్రీమియం చెల్లిస్తున్నారు. ప్రీమియం చెల్లించే జాబితాలో ఉన్న వారికి మినహాయించి, మిగిలిన వారందరికీ బీమా విధానాన్ని వర్తింపచేసేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.నిర్వీకరించిన రెండు యూనిట్లకు కలిపి ఒక టెండరు పిలుస్తారు. తక్కువ మొత్తాన్ని కోట్‌చేసే, ఎల్1గా ప్రైవేట్ కంపెనీ వస్తే.. అదే ధరకు సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వ రంగ సంస్థను ఆహ్వానిస్తారు. దీనికి ప్రభుత్వ రంగ సంస్థ ఆమోదం తెలిపితే మరో యూనిట్ బాధ్యత అప్పగిస్తారు. ఒకవేళ ప్రభుత్వ రంగ సంస్థ ఎల్1గా వస్తే రెండు యూనిట్ల బాధ్యతను అప్పగిస్తారు. ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా సేవలు కొనసాగించేలా చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రస్తుతం ట్రస్టు ద్వారా రోగి చికిత్సకు ముందస్తు అనుమతి లభించేందుకు 24 గంటల వరకు సమయం పడుతోంది. ఆరోగ్య బీమా అమలులోకి వస్తే ఈ పరిస్థితి మారుతుంది.

# భూమి ఆక్రమించిన ఎమ్మెల్యేకు నోటీసులు

>> రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇవన్ని ప్రభుత్వ భూములు అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎలా రిజిష్టర్ చేశారని ఫిర్యాదులో ప్రస్తావించారు. ఇది కాకుండా ఆకేపాటి ఎస్టేట్‌లో మరో 60ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో మొత్తం డాక్యుమెంట్లను అందజేశారు. అమర్‌నాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల భూముల ఆక్రమణపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రాజంపేట సబ్‌కలెక్టర్ నైదియా దేవి, రాజంపేట తహసీల్దార్ పీర్ మున్నీ ప్రాథమిక సమాచారాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఈ ఫిర్యాదుపై అమర్‌నాథ్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులకు, ఫిర్యాదు దారులకు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ నెల 17న అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జేసీ కోర్టులో హాజరు కావాలని నోటీసులు పంపారు. అంతేకాకుండా నోటీసులో ఆక్రమణలకు సంబంధించి సమగ్ర సమాచారంతో రావాలని రాజంపేట తహసీల్దార్‌ను కూడ ఆదేశించారు. ఆక్రమిత భూములుగా ఫిర్యాదులో పేర్కొన్నందువల్ల అడంగల్, పాత ఫసలి 10(1) ఆర్ఓఆర్-1 రిజిష్టర్ 1బి రిజిష్టర్, ఎఫ్ఎంబీలు తీసుకురావాలని ఆదేశించారు. ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేర్లతో పరస్పరం ఒకరికి ఒకరు విక్రయం చేసుకున్నట్లు డాక్యుమెంట్లను చూస్తే తెలుస్తోంది. ఈ వ్యవహారం రాజంపేట నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూముల్లో ఎస్టేట్ కట్టడం అందులో ప్రభుత్వ నిధులు పెద్దఎత్తున ఖర్చు చేసి రోడ్ల నిర్మాణం చేపట్టడం కూడ వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ కోర్టులో ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.



శుక్రవారం రాష్ట్రపతి ముర్మును కలిసిన ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

# రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిలను కలిసిన ఢిల్లీ సీఎం


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** ఢిల్లీనూతన ముఖ్యమంత్రిగాప్రమాణస్వీకారం చేసిన రేఖాగుప్తా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మునుమర్యాదపూర్వకంగా కలిసారు. అదేవిధంగా ఆమె ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కూడా కలిసారు. ఇరువురు రాజ్యాంగ నేతలకు ఆమె పుష్పగుచ్ఛాలిచ్చి తనను తాను పరిచయం చేసుకన్నారు. ముందు రాష్ట్రపతిని కలిసిన రేఖాగుప్తా వైస్‌ప్రెసిడెంట్ ఎన్‌క్లేవ్‌లో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను కలిసారు. ఇద్దరితోను కొద్దిసేపు సీఎం ఇష్టాగోష్ఠి జరిపారు. ఈ ఫోటోలను రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి కార్యాలయాలు తమతమ సోషల్ మీడియాలో పోస్టు చేసాయి.

# మార్చి 5న గోదావరి బోర్డు సమావేశం

**విజయవాడ,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి నదీ యాజమాన్య బోర్డు 17వ సర్వసభ్య సమావేశం మార్చి 5న నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలోగోదావరి బోర్డు ఛైర్మన్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. రెండు రాష్ట్రాలకు చెందిన జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు దీనికి హాజరుకానున్నారు.

# చైనాలో మరో ప్రాణాంతకవైరస్

## హెచ్‌కెయు5-కోవ్-2గా గుర్తింపు



**బీజింగ్, ఫిబ్రవరి 21:** చైనాలో కొవిడ్ తరహాలోనే ఉన్న మరో కొత్తవైరస్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. జంతువులనుంచి మానవులకు సంక్రమించే ముప్పు ఉందని కూడా హెచ్చరిస్తున్నారు. గబ్బిలాల్లో గుర్తించిన ఈకొత్త వైరస్‌ను హెచ్‌కెయు5-కోవ్-2గా వెల్లడించారు. కొవిడ్19కి కారణమైన సార్స్‌కోవ్-2ను పోలి ఉన్నట్లు తమ పరిశీలనలో గుర్తించామని హాంకాంగ్‌కుచెందిన సౌత్‌చైనా మార్నింగ్‌పోస్టు తన కథనంలో ప్రస్తావించింది. గబ్బిలాల్లో కరోనా వైరస్‌లపై విస్తృతస్థాయిలో పరిశోధనలు చేసి బ్యాట్ ఉమన్‌గా పేరొందిన ప్రఖ్యాత వైరాలజిస్టు ఝుంగ్‌లీ ఈ పరిశోదన బృందానికి సారథ్యం వహించారు. ఇందులో గ్యాంగ్‌ఝౌ ప్రయోగశాల, గ్యాంగ్‌ఝౌ అకాడమీ ఆఫ్ సైన్సెస్,వుహాన్ యూనివర్సిటీతోపాటు వుహాన్ వైరాలజీ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు భాగస్వాములుగా ఉన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన పరిశోధనా పత్రి సెల్‌జర్నల్‌లోసమీక్షకు పోస్టుచేసారు. ఈ వైరస్ మెర్బెకోవైరస్‌తోపాటు ప్రాణాంతక మెర్స్‌కోవ్(మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సింద్రోమ్) ఉపరకానికి చెందినదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది హెచ్‌కెయు5 కరోనా వైరస్‌సంతతికి చెందినదేనని, ఈవైరస్ తొఉలత హాంకాంగ్‌లోనిజపనీస్ పిపస్ట్రెల రకం గబ్బిలాల్లో గుర్తించినట్లు చైనా పరిశోధకులు వెల్ల డించారు. ఇపుడు చేస్తున్న అధ్యయనాల ప్రకారం హెచ్‌కెయు5-కోవ్-2 నేరుగా లేదా మాధ్యమ జీవుల సాయంతోమనుషులకు వ్యాపించే అవకాశం ఎక్కువని అన్నారు. అయితే కొవిడ్‌తోపోలిస్తే ఈవైరస్ సామర్థ్యం తక్కువేనని చెప్పారు.

# పవార్‌కు గ్లాసులో నీళ్లుపోసి అందించిన ప్రధానిమోడీ!





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** దేశరాజధాని ఢిల్లీలో జరుగుతున్న 98వ అఖిలభారత మరాఠి సాహిత్య సమ్మేళనంలో ఆసక్తికర సంఘటనలు జరిగాయి. విజ్ఞాన్‌భవన్ వేదికగా జరుగుతున్న సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఎన్సీపీ ఎస్పీ అధినేత శరద్ పవార్‌నడుమ ఆసక్తికర సన్నివేశాలు జరిగాయి. పవార్‌కుర్చీలో కూర్చోడానికి మోడీసాయం చేయడంతోపాటు తన చేతితో స్వయంగా గ్లాసులో నీళ్లనింపి పవార్‌కు అందించారు. దీనితో అక్కడున్నవారంతా చప్పట్లతో హర్షం వ్యక్తంచేసారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌కూడా ఈకార్యక్రమంలోపాల్గొన్నారు. మరాఠి భాషకు కొన్నినెలలక్రితం కేంద్రం శాస్త్రీయభాషా హోదా కల్పించింది. ఈ క్రమంలోసుమారు 71 ఏళ్లతర్వాతఢిల్లీ వేదికగా రెండోసారి ఈ సదస్సునిర్వహించారు. తొలిసారి జవహర్‌లాల్ నెహ్రూ ఢిల్లీలో మరాఠా సదస్సును నిర్వ హించారు. పవార్ ఈ సందర్భంగా మోడీని ప్రశం సించారు. కార్యక్రమానికి ఆహ్వానిస్తే కాదనకుండా అంగీకరించారన్నారు. మరాఠికి ఉన్నతభాష హోదా ఇవ్వడంతో ప్రధానిమోడీ పాత్ర కీలకం అన్నారు. తనప్రసంగంముగించి వచ్చి కుర్చీలో కూర్చునే క్రమంలో ఈ అరుదైన సందర్భాలు కనిపించాయి.

## వారం - వర్జ్యం

తేది : 22-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
నవమి మ.1.20
జ్యేష్ఠ సా.5.39
వర్జ్యం : రా.2.00-3.40
దు.ఉ.6.39 - 8.14
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. వస్తులాభం.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఇతరుల విషయాలలో జోక్యం వద్దు.

**మిథునం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఖర్చులు అధికమవుతాయి.

**కర్కాటకం:** సన్నిహితుల ద్వారా విలువైన సమాచారం అందుకొంటారు. గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. అనుకోని విధంగా ధన, వస్తు లాభాలు పొందుతారు.

**కన్య :** కొత్త వస్తువులు, ఆభరణాలు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ఔషధ సేవనం. ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు చాలా అవసరం.

**తుల :** శ్రమాధికం. బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకొంటారు.

**వృశ్చికం:** సోదరుల నుండి కొన్ని విషయాలు తెలుసుకుంటారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కొంటారు. అనుకోని విధంగా ఖర్చులు ఎదురవుతాయి.

**మకరం:** ఉద్యోగాలలో ఆకస్మిక బదిలీలు ఆశ్చర్యపరుస్తాయి. సేవకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** రుణబాధలు తీరి ఊరట చెందుతారు. మిత్రులను కలిసి కష్ట సుఖాలను పంచుకొంటారు.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆనందం కలుగుతుంది. వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రభుత్వాన్నే కూల్చేసినోణ్ణి... నన్ను తేలిగ్గా తీసుకోవద్దు: షిండే హెచ్చరికలు

**ముంబయి, ఫిబ్రవరి 21:** మహారాష్ట్రలోని అధికార మహాయుతికూటమిలో విభేదాలు తీవ్రం అయ్యాయని ఊహాగానాలు వినిపిస్తున్న వేళ డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్‌షిండే కీలక వ్యాఖ్యలు మరోసారి దుమారంరేపాయి. తనను తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. సీఎం దేవేంద్రఫడ్నవిస్ సమావేశాలకు ఇటీవల దూరంగా ఉంటున్న షిండే 2022లో ప్రభుత్వాన్ని పడగొట్టిన విషయాన్ని తాజాగా ప్రస్తావించారు. షిండే హయాంలో ఆమోదించిన ఒకప్రాజెక్టునుప్రభుత్వం నిలిపివేసిన నేపథ్యంలో సేవసేన నేత పైవ్యాఖ్యలుచేసారు. నేను ఒక సాధారణ పార్టీ కార్యకర్తను. అంతేకాదు బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తిని. ప్రతిఒక్కరూ అర్థంచేసుకోవాలి.

2022లో అందరూ నన్ను తేలిగ్గా తీసుకున్నపుడు నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టా అని మీడియాతోనే ఏక్‌నాథ్‌షిండేఅన్నారు. తర్వాత విధానసభలోచేసిన మొదటిప్రసంగంలో ఫడ్నవిస్‌కు 200 కంటే ఎక్కువసీట్లు వస్తాయని చెప్పానని 232 సీట్లువచ్చాయన్నారు. అందుకే తనను తేలిగ్గా తీసుకోవద్దని ఇది ఎవరిని ఉద్దేశించి చెపుతున్నాననో వారు అర్థంచేసుకుంటారని భావిస్తున్నట్లు షిండే అన్నారు. సీఎం ఫడ్నవిస్ సమావేశాలకు షిండే హాజరుకాకపోవడం, షిండేవర్గం ఎమ్మెల్యేలకు భద్రతను తొలగించడం, సచివాలయంలో వైద్యసహాయ కేంద్రాలు ఇద్దరు వేరువేరుగా ఏర్పాటుచేసుకోవడం వంటి సంఘటనలు వీరిమధ్య దూరాన్ని పెంచాయని తెలుస్తోంది. అభివృద్ధిని అడ్డుకునేవారితో నాపోరాటం నిరంతరం కొనసాగుతుందన్నారు.

# మిర్చి రైతులను ఆదుకోవాలని కోరాం

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

### మిర్చికి రూ.11,600కు పైగా ధర ఇవ్వాలి, మిర్చి ఎగుమతులపైనా చర్చ



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలని కోరినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తితో ఏపీ మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతెలిపారు. శుక్రవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు. మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని, మిర్చి ఎగుమతులు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. మిర్చి రైతుల సమస్యలపై శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సుదీర్ఘ సమావేశం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశానికి హాజరైన రామ్మోహన్ నాయుడు అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిర్చికి రూ.11,600 కు పైగా ధర ఇవ్వాలని కోరామన్నారు. మిర్చి ఎగుమతులపైనా చర్చిం చామన్నారు. ఎగుమతి దారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర కల్పించి ద్వారా మిర్చి రైతులను ఆదుకోవాలని కోరగా, సమస్య చెప్పిన వెంటనే శివరాజ్‌సింగ్ స్పందించారని తెలిపారు. మార్కెట్ ధర, ఉత్పత్తి ఖర్చుల మధ్య వ్యత్యాసం ఇస్తామని చెప్పారన్నారు. మిర్చి రైతులు కష్టాల్లో ఉన్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.మిర్చి ఉత్పత్తి వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం లెక్కిస్తే రూ. 11,600 వచ్చిందని.. అంతకంటే ఎక్కువ మొత్తంలో రైతులకు అందేలా చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. గతంలో మాదిరిగా ఇప్పుడు మిర్చి ఎగుమతులు జరగడం లేదన్నారు. మిర్చి ఎగుమతులు పెంచడం గురించి కూడా ఇవాళ్టి సమావేశంలో చర్చించామన్నారు. రాష్ట్రంలో మిర్చి రైతులు, ఎగుమతిదారులతో సదస్సు పెట్టాలని నిర్ణయించామని తెలిపారు. సదస్సు ద్వారా వచ్చిన సలహాలు, సూచనల ఆధారంగా మిర్చి ఎగుమతులు పెంచడంపై దృష్టి పెడతామన్నారు. మిర్చి రైతుల ఆదాయం ఎలా పెంచాలన్నదే అందరం ఆలోచిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడు నేరుగా ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తెచ్చారన్నారు. రైతుల కష్టం తెలిసిన వ్యక్తి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అని నిన్న ఢిల్లీలో లేనప్పటికీ మధ్యప్రదేశ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ సీఎంతో మాట్లాడారని తెలిపారు. ఈరోజు ఢిల్లీ వచ్చిన వెంటనే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారన్నారు. మార్కెట్ రేటుకు, రైతుల పెట్టుబడి వ్యయానికి మధ్య ఉన్న గ్యాప్‌ను కేంద్రం నుంచి నిధులు తెచ్చి ఆదుకోవాలని చూస్తున్నామన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని రూ. 11,600 కంటే ఎక్కువగా నిర్ణయించాలని ఐసీఏఆర్‌ను కోరినట్లు చెప్పారు. మిర్చి ఎక్స్‌పోర్ట్స్ గతంలో జరిగినట్లు ఇప్పుడు జరగడం లేదని అన్నారు. మిర్చి పంట సేకరణను అత్యవసరంగా చేయిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్స్ స్కీం కింద 75 వరకు పొడిగిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఏపీలో మిర్చికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద క్వింటాల్‌కు రూ.11600 లేదా ఉత్పత్తి వ్యయం జోడించి రూ.12,000 పైచిలుకు ధరను అందించాలని అడిగామన్నారు. ధర విషయంలో ఐసీఏఆర్ అధికారులకు కేంద్రమంత్రి ఆదేశాలిచ్చారని.. ఎగుమతులను స్థిరీకరించే అంశంపైన సమావేశంలో చర్చకు వచ్చిందన్నారు. ఎగుమతుల సమస్యను పరిష్కరించడానికి ఎగుమతి దారులతో సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మిర్చి రైతుల విషయంలో వీలైనంత త్వరగా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# భారతీయ భాషలమధ్య శతృత్వం లేనేలేదు: మరాఠీ సాహిత్యసమ్మేళన్‌లో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** జాతీయ విద్యావిధానం కింద హిందీని బలవంతంగారుద్దేప్రయత్నం జరుగుతున్నదంటూ తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాల మధ్య మాటలయుద్ధంజరుగుతున్న క్రమంలోప్రధానమంత్రి నరేంద్రమోడీ కీలక వ్యాఖ్యలు చేసారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠి సాహిత్య సమ్మేళన్‌లోప్రధాని మాట్లాడుతూ భారత భాషలమధ్య ఎప్పుడూ శతృత్వంలేదని స్పష్టంచేసారు. భారతీయ భాషలన్నీ ఒకదానికకటి సుసంపన్నం చేసుకున్నాయి. భాషాప్రతిపదికగా విభజనలు తెచ్చేప్రయత్నాలు జరిగినా భారత దేశ ఉమ్మడిభాషా వారసత్వం తగిన సమాధానం ఇచ్చింది. ఇలాంటి అపోహలకు దూరంగా ఉంటూ అన్నిభాషల సమున్నతికి పాటుపడటం ఒక సామాజిక బాధ్యతగా మనం గుర్తించాలని ఆదిశగానే ఈరోజు మరాఠి భాషతోసహా దేశంలోని అన్నిప్రధానభాషల్లోను మనం విద్యను ప్రమోట్‌చేస్తున్నట్లు ప్రధాని చెప్పారు. మహారాష్ట్ర యువత మరాఠీలోనే ఉన్నతవిద్య, ఇంజనీరింగ్, వైద్య విద్యలు చదువుతున్నారరన్నారు లిటరేచర్ అనేది సమాజానికి అద్దంలాంటిదని సమాజానికి ఒక నిర్దేశకత్వంచూపుతుందని వివరించారు. లిటరరీ సదస్సులు సంస్థలు ఈదిశగా కీలకపాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. భారతదేశంప్రపంచంలోని అతిపెద్ద భాషా వైవిధ్యం కలిగి ఉందని భాషా వైవిధ్యం మన ఐక్యతకు ప్రాథ మిక ఆధారమని మోడీ అన్నారు. జాతీయ విద్యావిధానంతో త్రిభాషా సూత్రాన్ని విధించేప్ర యత్నంలో తమపై హిందీని రుద్దే ప్రయత్నం చేస్తున్నారంటూ తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్, డిప్యూటి సిఎం ఉదయనిధి విమర్శ లుచేస్తున్న క్రమంలో ప్రధాని వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

# పూర్తిస్థాయిలో ఖర్చుకాని ఎస్ఎస్ఏ నిధులు

### గత ఏడాది రూ. 1913 కోట్లకి పీఏబీ ఆమోదం

### ఈ ఏడాది రూ. 1600 కోట్లకే ప్రతిపాదనలు పంపాలని సూచన

### తెలంగాణలో పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడంతోనే ప్రతిపాదనల తగ్గింపు?

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పాఠశాల విద్య శాఖలో అమలవుతున్న సమగ్ర శిక్ష పథకం కింద కేంద్రం ఇస్తున్న నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టకపోవడంతో.. ఈ ఏడాది కేటాయించాల్సిన నిధుల్లో కోత పెట్టినట్టు తెలుస్తోంది. గత ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్ఏ కింద రాష్ట్రానికి రూ.2347.50 కోట్లు కావాలని పాఠశాల విద్య కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. ప్రతిపాదనలను పరిశీలించిన అందులో రూ. 1913 కోట్లకు ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు(పీఏబీ)లో కేంద్రం ఆమోదం తెలిపింది. అందులో రూ. 1148.34 కోట్లు కేంద్రం వాటా కాగా.. రాష్ట్ర వాటా రూ. 765.56 కోట్లుగా పేర్కొంది. అయితే పీఏబీలో కేంద్రం ఆమోదం తెలిపిన మొత్తాన్ని కూడా రాష్ట్రంలో ఖర్చు చేయకపోవడంతో.. ఈ ఏడాది రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులకి సంబంధించి రూ. 1600 కోట్ల వరకే ప్రతిపాదనలను సమర్పించాలని కేంద్రం సూచించినట్టు తెలుస్తోంది. అందుకే గతేడాది పీఏబీ ఆమోదించిన బడ్జెట్ కంటే ఈ ఏడాది ప్రతిపాదనల్లోనే కోత పెట్టినట్టు తెలుస్తోంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఎస్ఎస్ఏ పథకాన్ని నిర్వహిస్తున్నారు. నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లలో పథకానికి సంబంధించిన నిధులను కేంద్రం మంజూరు చేస్తూ ఉంటుంది. ఈ పథకంలో కేంద్రం 60 వాటా శాతం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా 40 శాతం ఉంటుంది. ఈ పథకంలో భాగంగా ప్రధానంగా పాఠశాల విద్యలో మౌలికవసతుల కల్పన, నాణ్యమైన బోధనకు వీలు కల్పించేందుకు ఈ పథకం ద్వారా నిధులను ఖర్చు చేస్తారు. కేజీబీవీలు, టీచర్ల ట్రైనింగ్స్, యూనిఫారాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు సహా మౌలిక వసతుల కోసం ఈ పథకం ద్వారా నిధులను ఖర్చుచేస్తారు. 2024-25 విద్యాసంవత్సరానికి రాష్ట్రానికి పీఏబీ రూ. 1,913కోట్లకు ఆమోదం లభించింది. అందులో కేంద్రం వాటా రూ. 1,148.34 కోట్లు కాగా.. రాష్ట్రవాటా రూ. 765.56కోట్లు. కేంద్రం ఇవ్వాల్సిన నిధులను నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లల్లో విడుదల చేస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం సైతం నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లల్లో నిధులను కలిపి విడుదల చేస్తుంది. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు కేంద్రం మూడు ఇన్‌స్టాల్‌మెంట్ల నిధులను విడుదల చేసింది. వాటిలో రెండు ఇన్‌స్టాల్‌మెంట్ నిధులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసింది. మూడో ఇన్‌స్టాట్‌మెంట్ కింద కేంద్రం రూ. 242 కోట్లను విడుదల చేయగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 161 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటికీ విడుదల చేయనట్టు తెలిసింది. మూడో ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు ఖర్చు కాకపోవడంతో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు రావడం ప్రశ్నార్థకంగా మారాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చి నెల మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్‌తోపాటు నాన్ రికరింగ్ నిధుల విడుదలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే ఇచ్చిన నిధులు ఖర్చుచేయకపోవడంతో నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ నిధుల విడుదలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 2025-26 విద్యాసంవత్సరంలో పీఏబీలో రూ. 300కోట్లకు కోతపడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పీఏబీ సమావేశాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

# పిఎంజెవికె కింద రాష్ట్రానికి రూ.600 కోట్లు కేటాయించండి

## కేంద్రానికి రాష్ట్ర మైనార్టీసంక్షేమశాఖ మంత్రి ఫరూక్ లేఖ

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** మైనారిటీల సామాజిక ఆర్థిక పరస్థితులను మెరుగుపరచడానికి ఉద్దేశించిన ప్రధానమంత్రి జన్‌వికాస్ కార్యక్రమ్ కు కేంద్రం వాటాగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.600 కోట్లు కేటాయించాలని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కోరారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు గురువారం లేఖ రాశారు. 2025-26 లో ఈ పథకం కింద రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్లతో ప్రతిపాదనలు నివేదించాం. ఈ పథకం కింద రాష్ట్రవాటా రూ.400 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేంద్రం వాటాగా రూ.600 కోట్లు కేటాయించాలి అని లేఖలో పేర్కొన్నారు . అన్యాక్రాంతమైన వక్ఫ్‌భూముల స్వాధీనానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నట్లు ఫరూక్ వెల్లడించారు. ఇక మైనారిటీ మంత్రిత్వ శాఖ పేషీ లో మంత్రి ఫరూక్ ను వక్ఫ్ బోర్డు సభ్యులు డాక్టర్ ఆఫీయా, షేక్ ఖాజా తో పాటు పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వక్ఫ్ బోర్డు కు సంబంధించిన పలు అంశాలు, వక్ఫ్ బోర్డు ద్వారా చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక అమలుకు సంబంధించి బోర్డు సభ్యులతో మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ మరియు పరిరక్షణ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవడం, ఉన్న భూములను పరిరక్షించుకోవడం పై ఒక ప్రణాళికబద్ధమైన కార్యాచరణ సిద్ధం చేసి మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో చర్యలు చేపట్టడం జరుగుతున్నదని మంత్రి అన్నారు. అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా ప్రభుత్వం బడ్జెట్లో మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధుల కేటాయింపు చేయడం జరిగిందన్నారు. 20252026 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో కూడా మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం నిధుల కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇవ్వబోతున్నదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. రంజాన్ మాసం లో ప్రత్యేక వసతులు కల్పించాలనికోరిన ఎంహెచ్ పిఎస్‌రంజాన్ మాసంలో మసీదులు, ఈద్గాలు, దర్గాల వద్ద ప్రత్యేక వసతులు కల్పించాలని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఎంహెచ్ పిఎస్ నాయకులు కోరారు మంత్రి పేషీ లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ తదితరులు మంత్రిని కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చెయ్యాలని, టిడిపి ప్రభుత్వ హయాంలో అన్ని మసీదులకు మరమ్మత్తుల కొరకు ప్రతి ఏటా ఇచ్చే రూ.25వేలు మంజూరు చెయ్యాలని, శిక్ష అనుభవిస్తున్న ముస్లిం ఖైదీలకు సహారీ, ఇఫ్తార్ ఏర్పాటు కొరకు జైళ్ల శాఖకు ఆదేశించాలని, ప్రభుత్వం తరపున రంజాన్ ఉత్సవాలు (జష్నే రంజాన్) నిర్వహించాలని కోరారు. వచ్చే బడ్జెట్ లో మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేకంగా రూ.3296 కోట్లు మంజూరు చెయ్యాలని మంత్రిని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ పిఎస్ ఉలేమా వింగ్ అధ్యక్షులు మోలానా అబ్దుల్ రషీద్, నాయకులు సగీర్, ఖాజా, అర్షద్, భాష తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సవిత సమక్షంలోఎస్పీఏవీతో ఏపీహెచ్డీసీ ఒప్పందం

# సాంస్కృతిక వారసత్వాలకు చిహ్నంగా లేపాక్షి : మంత్రి సవిత

> సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్మాణాలు
>
> రాష్ట్ర వ్యాప్తంగా అన్ని షోరూమ్‌ల్లోనూ మరమ్మతులు
>
> ఎస్పీఎవితో ఎపి హెచ్‌డిసి ఒప్పందం, మంత్రి సమక్షంలో ఎంవోయూపై సంతకాలు

**విజయవాడ.ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదనం, సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపట్టేలా లేపాక్షి నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్పీఏవీ)తో ఏపీ హ్యాండీ క్రాఫ్ట్స్ డవలప్ మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత సమక్షంలో ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ ఎండీ విశ్వ, ఎస్పీఏవీ డైరెక్టర్ ఎస్.రమేష్ శుక్రవారం ఎంవోయూపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలను ఉట్టిపట్టేలా ఆకర్షణీయంగా నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న లేపాక్షి షోరూమ్ లకు మరమ్మ తులు చే పట్టి, ఆక ర్షణీయ మైన ఆకృ తుల్లో నిర్మా ణాలు చేపట్టా ను న్నారు. షో రూమ్ ల బయట, లోపల కూడా మరమ్మతులు చేపట్టనున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేలా షోరూమ్ లను రూపొందించడం వల్ల వివిధ కళా రూపాల అమ్మకాలు పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో ఏపీలోని పలు ప్రాంతాల సాంస్క ృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించే వీలు కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కి టెక్చర్(ఎస్పీఏవీ)తో ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డవలప్ మెంట్ కార్పోరేషన్ (ఏపీహెచ్డీసీ) ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు అమరా వతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవిత సమ క్షంలో ఎంవో యూపై ఏపీ హ్యాండీ క్రాఫ్ట్స్ ఎండీ విశ్వ, ఎస్పీఏవీ డైరెక్టర్ ఎస్.రమేష్ ఎంవో యూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మూడేళ్లు అమలులో ఉంటుంది. ఈ కార్యక్ర మంలో ఏపీహెచ్డీసీ, ఎస్పీఏవీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాజ్‌భవన్‌లో అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం ఆవిర్భావ వేడుకలు



అరుణాచల్‌ప్రదేశ్ మిజోరాం ఆవిర్భావ వేడుకల సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షిస్తున్న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రాంతాలు వారిగా అభిరుచులు, సాధారణ జీవన విధానంలో భిన్నంగా ఉన్నట్లు కన్పించిన భారతీయ సాంస్కృతిక వికాసం ఏకత్వాన్ని ప్రబోధిస్తుందని ఏపీ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. కళలు, వివిధ సాంస్కృతిక జీవన ప్రక్రియలు పురాతన నాగరిక జీవన విధానాన్ని తెలియ జేస్తాయన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ మిజోరాం ఆవిర్భావ వేడుకలను విజయవాడలోని రాజ్‌భవన్‌లో నిర్వహించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొని ప్రసంగించారు. అరుణాచల్‌ప్రదేశ్ సూర్యుడు ఉదయించు భూమిగా పర్వతాలు సరస్సులు సంస్కృతికి ప్రసిద్ధి. బహుభాషా గిరిజన ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది. 1987 లో రాష్ట్ర హోదా పొందిన మిజోరాంలో ప్రజలు తమ సంస్కృతి, విలువలను కాపాడుకునేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తారు అని గవర్నర్ పేర్కొన్నారు. ఇవి మన భారతీయ సాంస్కృతిక, సహజీవన విధానాలకు నిర్వచనాలుగా నిలిచే ప్రదేశాలన్నారు. విజయవాడలో చదువుకుంటున్న ఆ రాష్ట్రాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

# మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు,పటిష్టమైన పాలనకు 30సూత్రాల అజెండా

### - సిఎం ఆలోచనల మేరకు రూపొందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**సచివాలయం,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యసేవలు, వైద్య, ఆరోగ్య శాఖ పర్యవేక్షణ, పరిపాలనను పటిష్టం చేసే లక్ష్యంతో మంత్రి సత్యకుమార్ యాదవ్ 30అంశాలతో కూడిన ఏజెండాను రూపొందించారు. ఆయా అంశాలపై నిర్ధిష్ట కాలపరిమితుల మేరకు నిరంతరం ప్రయాస, పనితీరు, ఫలితాల సమీక్షలుజరపాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును మంత్రి ఆదేశించారు. గత ఏడాది జూన్‌లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఆరోగ్యశాఖకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన వివిధ సమీక్షా సమావేశాల్లో ఇచ్చిన ఆదేశాలు, ఆలోచనలు, వైద్యసేవలు, మంత్రిత్వ శాఖ పనితీరుపై మంత్రి సత్యకుమార్ యాదవ్‌చేసిన సమీక్షల్లో వెల్లడైన అంశాల ఆధారంగా మంత్రి ఈ ఎజెండాను రూపొందించారు. ఆరోగ్యరంగానికి సంబంధించి స్వర్ణాంధ్రప్రదేశ్-2047 విజన్ పత్రంలోని లక్ష్యాల్ని, మార్గాల్ని ప్రజలకు తెలిపి లక్ష్య సాధన ప్రయత్నంలో సంబంధిత అందర్నీ భాగస్వాములను చేయడం. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు త్వరిత గతిన నిర్ణయాల్ని తీసుకునేందుకు అవసరమైన వికేంద్రీకరణ వైద్యసేవల్లో కృత్రియ మేధ పూర్తి వినియోగ అవకాశాల్ని గుర్తించి ఆ మేరకు చర్యల్ని చేపట్టడం డిజిటల వైద్యసేవల్ని విస్తృతం చేయడం. వైద్యులు, ఇతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వ సాయాన్ని రాబట్టడం. వివిధ విభాగాధిపతులు, వైద్యులు, అధికారుల పనితీరును నిష్పక్షపాతంగా ఫలితాల ప్రాతిపదికన మదింపుచేయడం వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం కోసం పటిష్టచర్యలు, పర్యవేక్షణ అవినీతిని అరికట్టడానికి పటిష్ట చర్యలు, విభాగాధిపతులు, వివిధ పథకాల నోడల్ అధికారులు పథకాల అమలు, పనితీరుపై నెలవారీ నివేదికల్ని అందించడం వాటిని సమీక్షించడం. ప్రజల్లో సరైన శుభ్రత, ఆరోగ్యపు అలవాట్లను పెంచడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం. రాష్ట్రం, దేశ విదేశాల్లో ఆరోగ్య సేవలు తీరును మదింపు చేసి సేవల నాణ్యత, తీరు పెంచడానికి మంత్రిత్వ శాఖకు సలహాలిచ్చేందుకు వైద్య, ఆరోగ్య రంగ నిష్ణాతులతో సలహా/సంప్రదింపుల కమిటీ ఏర్పాటు. ఆగష్టు నెలలో విడుదల చేసిన 30సూత్రాల ప్రణాళిక మేరకు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రగతిని నిరంతరం సమీక్షించడం అన్ని (175) అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్పెషాలిటి ఆస్పత్రుల ఏర్పాటు, హైబ్రిడ్ విధానంలో రూ.25లక్షల బీమాను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా త్వరలో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

# మినుము సాగుపై దృష్టి పెట్టాలి

### వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మినుము సాగు, ఉత్పత్తి పెంపుపై ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పనిచేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు సూచించారు. ఏడు జిల్లాలకు సంబంధించి గురువారం విజయవాడలో జరిగిన జాతీయ ఆహార పోషక భద్రత మిషన్ సదస్సులో మాట్లాడారు. అధిక దిగుబడినిచ్చే వంగడాల రూపకల్పనకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

# యువ శాస్త్రవేత్తల కోసం యువికా 2025కు ఆహ్వానం

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో యువ శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేందుకు ఈ ఏడాది కూడా యువికా కార్యక్రమం ప్రారంభిస్తోంది. యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం యువికా 2025 కోసం ఉత్సాహవంతులైన యువతీ యువకులను ఇస్రో దరఖాస్తులు చేసుకోవాలని ఆహ్వానించింది. ఈ నెల 24 నుంచి మార్చి 23 దాకా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇస్రో ప్రకటించింది. ఈ కార్యక్రమంలో అంతరిక్ష విజ్ఞానంపై యువతీ యువకులకు శిక్షణ ఇస్తారు. రెండురోజులు పాటు రెసిడెన్షియల్ ప్రోగ్రాం కూడా ఉంటుంది. దేశంలోని కొన్ని ఇస్రో ప్రధాన కార్యాలయాల్లో కూడా ఎంపిక చేయబడిన విద్యార్థుల పర్యటన ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన ఆన్‌లైన్ వివరాలు కూడా ఇస్రో పేర్కొంది. గతంలో కూడా యువికా కార్యక్రమం కింద అనేకమంది ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులు వెలుగులోకి వచ్చారు. ఈసారి ఈ అవకాశాన్ని ముఖ్యంగా స్టుడెంట్లు సద్వినియోగం చేసుకోవాలని ఇస్రో శాస్త్రవేత్తలు పిలుపు నిచ్చారు.

# మాజీ సిఎం వైఎస్ జగన్‌కు కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలి

### - ప్రధానికి వైఎస్సార్సీ లోక్ సభ పక్ష నేత మిథున్ రెడ్డి లేఖ

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వైయస్సార్సీపీ లోక్ సభ పక్ష నేత మిథున్ రెడ్డి లేఖ రాసారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని లేఖల్లో విజ్ఞప్తిచేసారు. రాష్ట్ర ప్రభుత్వం జగన్ పర్యటనలు సందర్భంలో ఎటువంటి భద్రత కల్పించడం లేదన్నారు. జగన్ పర్యటనలో తీవ్రమైన భద్రత వైఫల్యం తలెత్తింది. జెడ్ ప్లస్ సెక్యూరిటీ కేటగిరి లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు వెంటనే కేంద్ర బలగాలతో రక్షణ కల్పించండి, ఇటీవల వైఎస్ జగన్ నివాసం వద్ద కొన్ని ఘటనలు జరిగాయి .ఇవి భారీ ఎత్తున పన్నిన కుట్రలో భాగంగా జరుగుతున్న ఘటనలు. వైఎస్ జగన్ ప్రాణాలకు ముప్పు తెచ్చే విధంగా భద్రత వైఫల్యం కనిపిస్తోంది కూటమి ప్రభుత్వం విధానాల వల్ల మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. ప్రజాస్వామ్య విధానాలకు తూట్లు పొడిచేలా ప్రమాదకర ధోరణికి తెరలేపుతోందన్నారు. ప్రభుత్వం ఉద్దేశం పూర్వకంగా జగన్ విషయంలో సున్నిత పరిస్థితులను సృష్టించడం ద్వారా ఆయనకు ఇబ్బంది కలిగించాలని చూస్తోందని మిథున్‌రెడ్డి తన లేఖలో స్పష్టంచేసారు. జగన్‌కు భద్రతను పెంచాలని కోరారు.

# రైళ్లలో నేరాల నివారణకు సమన్వయంతో పనిచేద్దాం

### - క్రైమ్ సమీక్షా సమావేశంలో రైల్వే ఐజీ మోహన్‌రావు



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే ఐజీ మోహన్‌రావు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 21,ప్రభాతవార** రైళ్లలో ప్రయాణికుల రక్షణ, భద్రతాలకై ప్రతిఒక్కరు సమన్వయంతో కలిసి పనిచేయాలని రైల్వే ఐజీ మోహన్‌రావు అన్నారు. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ ప్రధాన కేంద్రంలో నిర్వహించిన రైల్వే అంతర్ రాష్ట్ర జిఆర్‌పి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన రైల్వే ఎస్‌పి రాహుల్ మీనా, డిఎస్‌ఆర్‌పి హర్షిత, మురళీధర్‌లతో కలిసి డివిజన్ పరిధిలో క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదికను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో పెరిగే రైళ్లు, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్‌పిఎఫ్, డివిజన్ పరిధిలోని కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలోని జిఆర్‌పి పోలీసు అధికారులతో ఆయా రాష్ట్రాలలో జరిగే నేరాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా రాష్ట్రాల జిఆర్‌పి, రైల్వే రక్షక దళంతో కలిసి నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు అజయ్‌కుమార్, రామాంజనేయులు, అశోక్ కుమార్, శ్రీనాథ్ రెడ్డి, మౌలా, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, రైల్వే ఎస్‌పి కార్యాలయ సిబ్బంది అధిక సంఖ్యలో జిఆర్‌పి పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై మ్యూజియంలోని అమరావతి బౌద్ధ శిల్ప సంపదను ఎపికి బదలీచేయండి

### - అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** చెన్నై ఎగ్మూర్ మ్యూజియంలోని అమరావతి బౌద్ధ శిల్ప సంపదను రాజధాని అమరావతికి బదిలీ చేయాలంటూ అఖిల భారత పంచాయతీ పరిషత్తు జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరారు. ఈ మేరకు విజ్ఞప్తి లేఖను ఈమెయిల్ ద్వారా తమిళనాడు సీఎంకు పంపారు. 1797లో బ్రిటిషు ప్రభుత్వ పురావస్తుశాఖ గుంటూరు జిల్లాలోని అమరావతి, దాని సమీప ప్రాంతాల నుంచి 400కు పైగా పురాతన చిహ్నాలు, రాజవంశాలకు చెందిన శిల్పాలను వెలికి తీసింది. వాటిని ఎగ్మూర్ మ్యూజియంలో భద్రపరిచింది. ఇప్పుడు అమరావతిలో సాంస్కృతిక వారసత్వాన్ని పునరుద్ధరించడానికి, పురాతన ప్రాంతీయ సంస్కృతిని భావితరాలకు అందించడానికి కృషి జరుగుతోంది. ఆ పురాతన సంపదను అమరావతికి బదిలీ చేయడానికి అనుమతించాలి అని ఆ లేఖలో కోరారు.

# ఎపి విజ్ఞప్తితో కేఆర్ఎంబి ప్రత్యేక సమావేశం వాయిదా

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకునీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించేందుకు ఇవాళ కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది. అయితే తనకు ముందుగానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఇవాళ్టి సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమావేశాన్ని కేఆర్ఎంబీ సోమవారానికి వాయిదా వేసింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్‌లో జలసౌధలో సమావేశం జరగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు సమాచారం పంపించింది.

# జోన్ల వారీగా మధ్యాహ్న భోజనం కొత్త మెనూ అమలు

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజనం కొత్త మెనూను ప్రయోగాత్మకంగా అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పథకం అమలు కోసంనాలుగు జోన్ల వారీగా దీన్ని రూపొందించారు. ఆయా ప్రాంతాల్లోని స్థానిక వంటలు విద్యార్థుల అభిరుచులు, పోషకాలను పరిగణనలోకి తీసుకొని కొత్త మెనూను విద్యాశాఖ రూపొందించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజనం మెనూ మార్చేందుకు వంట ఏజెన్సీలతో రాష్ట్ర స్థాయి కార్యాశాల నిర్వహించింది. విద్యార్థులు ఆసక్తిగా తినేలా, పోషకాలు ఉన్న మెనూ ఎంపిక చేసింది. దీన్ని ఈ విద్యా సంవత్సరం ముగింపు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేయాలని విద్యాశాఖ సూచించింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలు జోన్ 1 లో ఉండగా కాకినాడు తూర్పుగోదావరి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు పశ్చిమగోదావరి కృష్ణా , ఎన్టీఆర్ జిల్లాలు జోన్ 2 గా పేర్కొంది. గుంటూరు పల్నాడు బాపట్ల ప్రకాశం, నెల్లూరు జోన్ 3 లో ఉండగా రాయలసీమలోని జిల్లాలు నాలుగో జోన్‌లో ఉన్నాయి.

# ధ్వజారోహణంతో శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)**



పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగు బంగారంగా వరాలిస్తూ పూజలందుకున్న దివ్య క్షేత్రం శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తుడు కన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఏర్పాట్లకు సంబంధించి స్థానిక శాసనసభ్యుడు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గతంలో కన్నా భిన్నంగా భక్తుల మనోభావాలకు అనుగుణంగా విజయవంతంగా నిర్వహించుటకు విధి నిర్వహణకు కొత్త అయినా ఇఓ ఏర్పాట్లు సమీక్షించారు.. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను బడ్జెట్‌తో ముడిపెట్టక నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఏర్పాట్లును చేపట్టారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా మహాశివరాత్రి రోజు భక్తులకు సుదర్శనంతో సంతృప్తి పరచుటకు చర్యలు తీసుకుంటామని ఇఓ వివరించారు. సాధారణంగా ఏ ఆలయంలో అయినా బ్రహ్మోత్సవాలు అంటే పది రోజుల పాటు నిర్వహించటం జరుగుతోందని అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు నిర్వహించటం సంప్రదాయమని వివరించారు. మొదటి ఉత్సవాన్ని భక్తజన వల్లభుడు భోళాశంకరుడు వాయులింగేశ్వరుడు 'భక్తకన్నప్ప' ధ్వజారోహణానికి ఇవ్వటం గమనించదగ్గ విషయం అన్నారు. స్థానిక నాయకులు, భక్తుల సూచనల మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. గత ఏడాది లక్ష మంది భక్తులు వచ్చినట్లు అంచనా కట్టారని ఈ ఏడాది రెండులక్షలు పైగా వస్తారని అంచనా వేసి ఈ మేరకు ఏర్పాట్లు చేసామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు సాదాసీదాగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఐదు వేల మంది భక్తులకు అన్నదానంలో అవకాశం కల్పించుటకు చర్యలు తీసుకున్నామని శివరాత్రి జనజాగరణ రోజు పదివేల మందికి అన్నదానం నిర్వహించుటకు ఏర్పాట్లు చేసామన్నారు. వచ్చే యాత్రికులకు బస సదుపాయం కల్పించామన్నారు. వారికి కనీస సదుపాయాలు చేపట్టామన్నారు. తాత్కాలిక స్నానఘట్టాలను సువర్ణముఖి నదిలో ఏర్పాటు చేసామన్నారు. మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఏడాది ఉత్సవాల్ని ఎలాంటి వివాదాలు, విమర్శలకు అవకాశం లేకుండా నిర్వహించుటకు అందరు సహకరించాలన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఆదివారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పరణ జరిగింది. మొదటి పూజలు భోళాశంకరుడు తన భక్తుడు తిన్నడు అనే భక్తకన్నప్పకు ప్రసాదించారు. ఈ నేపథ్యంలో సాయంత్రం భక్తకన్నప్ప కొండపై శాస్త్రోక్తంగా పూజలుజరిపి ధ్వజారోహణ కార్యక్రమాల్ని జరిపారు. భక్తకన్నప్ప విగ్రహాన్ని కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ముస్తాబు చేసి కొండపైకి తీసుకెళ్ళారు. అక్కడి ఆలయం వద్ద ప్రతిష్టించి ఆలయప్రధానార్చకులు డాక్టర్ ఎస్ఎంకె స్వామినాధన్ గురుకుల్ కలశస్థాపన చేయగా వేదపండితులు వేదమంత్రాల్ని పఠిస్తుండగా శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం ధ్వజస్థంభంపై వస్త్రాన్ని అధిరోహించారు. ఈ కార్యక్రమాల్లో హర హర మహాదేవ శంభోశంకరా అంటూ నినాదాలు చేస్తూ ధ్వజారోహణ జరిపారు. ఈ పూజలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. అనంతరం భక్తకన్నప్పను పట్టణంలో ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమాల్లో శాసనసభ్యుని మాతృమూర్తి బొజ్జలబృందమ్మ, మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కోలా.ఆనంద్, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు, పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, మల్లీశ్వరమ్మ, సుమతి, ఆలయ ఇఓ బాపిరెడ్డి, డెప్యూటీ ఈఓ ఎన్ఆర్.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శనం, ఉత్సవాల ఇన్‌చార్జి లోకేష్, ప్రోటోకాల్ ఇన్‌చార్జి నాగభూషణం, ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్, అభిషేక గురుకుల్ వరదగురుకుల్, పౌరోహితులు అర్ధగిరిలు పర్యవేక్షించారు. తదితరులు హాజరయ్యారు. సోమవారం ఉదయం ఆలయంలో శ్రీకాళహస్తీశ్వరుని ధ్వజారోహణ జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

# వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై తీర్పు వాయిదా

**విజయవాడ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై తీర్పును విజయవాడ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు వాయిదా వేసింది, సోమవారం తీర్పు వెలువరించనున్న ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు. వంశీ బెయిల్ పిటిషన్‌పై ఇప్పటికే విచారణ వాయిదా పడింది. ఈ కేసుల్లో కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు గడువు కోరడంతో విచారణ మంగళవారానికి వాయిదా వేసిన ఎస్సీ, ఎస్టీ కోర్టు. గుడివాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయం కేసులో ఒక వ్యక్తిని వంశీ కిడ్నాప్ చేసిన బ్లాక్‌మెయిల్ చేసారన్నది ఆరోపణ. ఈ కేసులో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసారు. మరి కొన్ని సెక్షన్లు ఆపాదించారు. ఈ కేసులో అరెస్టయి విజయవాడ సబ్‌జైల్‌లో వంశీ ఉన్నారు. తన అనారోగ్య కారణంగా జైలులో మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోర్టులో ఫిర్యాదు చేసారు. వంశీని 10 రోజుల కస్టడీకి అప్పగించాలని పోలీసులు కోర్టులో ఫిటిషన్ దాఖలు చేసారు.

# లోకాయుక్త ఆదేశాలతో వైద్యులను తొలగించిన రాష్ట్రప్రభుత్వం

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 55 మంది ప్రభుత్వ వైద్యులనువిధుల నుంచి తొలగించింది అదేశాలతో విధులకు డుమ్మా కొట్టిన వైద్యులనుప్రభుత్వం టెర్మినేట్ చేసింది. లోకాయుక్తకు ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ నివేదిక పంపింది. తొలగింపునకు గురైన వైద్యుల్లో అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన మాజీ సర్పంచ్ జంపన శ్రీనివాస్ గౌడ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతి, సెలవు లేకుండా ఏడాదికి పైగా వైద్యులు గైర్హాజరవుతున్నారని, వైద్యులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. దాంతో లోకాయుత ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపై తక్షణం స్పందించాలని, సంబంధిత నివేదికను పంపించాలని ఆదేశించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్
టెండరు నోటీసు
పి.ఆర్.క్వాలి అండ్ క్వాసి డివిజన్, పర్చూరు వారి పరిధిలో (ఎలక్ట్రికల్ డిజిటల్) కాంప్రెసివ్ టెస్టింగ్ మెషీన్ 200 టన్స్ రెండింటిని సప్లై చేయుటకు సీల్డు టెండర్లు లైసెన్స్‌డ్ ఏజెన్సీ వారి నుండి కోరబడుచున్నవి. పై తెలిపిన మేషీన్‌లను మార్కాపురం, నర్సరావుపేట పిఆర్ క్వాలి అండ్ క్వాసి సబ్-డివిజన్‌లకు సప్లై చేసి అమర్చవలెను. అప్లికేషను ఆఖరు తేది: 03.03.2025 సా.5.00గం.ల వరకు. సీల్డు టెండర్లు స్వీకరించు తేది: 04.03.2025 మ.3.00గం.ల వరకు.
సం/-. కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.క్వాలి అండ్ క్వాసి డివిజన్, పర్చూరు.
DIPR.NO.15361/CL/ADVT/1/1/2022-23 తేదీ: 21.02.2025

వార్త

బలహీనతకి పరిష్కారం దాని గురించి చింతించడం కాదు, బలం పెంచుకోవడం గురించి ఆలోచించడం.

-జార్జి ఎలియట్

# వణకుతున్న ఊళ్లు!

జలం జీవనాధారం. నీరు ఎక్కడ ఉంటే అక్కడ జీవం ఉంటుంది. అందుకే 'ఎప్పుడు ఎడతెగక పారు ఏరు...' చోటును ఎంపిక చేసుకొని ఉండమన్నారు సుమతీశతకకారుడు. వేసవికాలం వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణమైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనరాహిత్యం, ముందుచూపు లేకపోవడం, ప్రకృతి సహాయనిరాకరణ తోడుకావడంతో తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది ప్రజలు గుక్కెడు మంచినీటికి పడరాని పాట్లుపడక తప్పడం లేదు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాలబారిన పడుతున్నారు.దాదాపు ముప్పైఆరు రకాల రోగాలు కేవలం జలకాలుష్యం వల్లనే వస్తున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు మంచినీటి సమస్య దేశవ్యాప్తంగానే తీవ్రంగా ఉన్నట్లు చెప్పొచ్చు. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా అది సాధించాం, ఇది సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నా ఇప్పటికీ ప్రజలందరికీ కనీసం అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించలేని దుర దృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం. అలాని మంచినీటి కోసం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని చెప్పడం లేదు.గత ఏడున్నర దశాబ్దాల్లో కేవలం మంచినీటి కోసమే లక్షలాది కోట్లు వెచ్చించారు, వెచ్చిస్తూనే ఉన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు పనిచేస్తూనే ఉన్నారు. కానీ వ్యయం చేస్తున్న నిధులు ఏమేరకు కిందిస్థాయికి వెళ్లి ప్రజల అవసరాలు తీరుస్తున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అన్నింటిలో మంచినీటి సమస్య తీవ్రంగానే ఉంటుంది. బోరుబావులపై ఆధారపడాల్సిన పరిస్థితులు అంతకంతకు పెరిగిపోతున్నాయి. యేటా తెలుగు రాష్ట్రాల్లోనే పరిశీలించినా వేలాది బోరుబావులు కొత్తగా పుట్టుకొస్తున్నాయి. భూగర్భజలాల వినియోగం ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. అదే స్థాయిలో నీటి వృధాకూడా పెరుగుతున్నది. ప్రధానంగా వ్యవసాయరంగంలో ఉచిత విద్యుత్ కూడా ఈ నీటి వృధాను పెంచుతున్నదనే చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశంలోని అనేక రాష్ట్రాల నీటి మట్టాలు పడిపోతున్నాయి. తెలంగాణలో ఇంకా ఎండాకాలం మొదలుకాకుండానే నీటి మట్టాలు భారీగా తగ్గడం ఆందోళన కలిగిస్తున్నది. డిసెంబరులో 6.7 మీటర్ల లోతుగా ఉన్న రాష్ట్ర భూగర్భ సగటు జలమట్టం జనవరిలో 7.46 లోతుకు తగ్గిపోయింది. ఈ స్థాయిలో ఇప్పుడే భూగర్భజలాలు అడుగంటితే ఏప్రిల్, మే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులతోపాటు సామాన్య ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా కూడా ఈసారి భూగర్భజలాల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పంటల దిగుబడిపై ఆ ప్రభావం పడుతుందనివ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్‌లో యేటా దాదాపు 250 ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలు వినియోగిస్తున్నారు. దీనిపై ఏవో నామమాత్రపు నిబంధనలున్నా పట్టించుకోకపోవడంతో వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. వాస్తవంగా దేశంలో ఆరువేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా వాటిలో మూడోవంతు బ్లాకులు అవసరానికి మించి భూగర్భజలాలు వాడుతున్నారు. బోరుబావుల సంఖ్య యాభైయేళ్లలో 120 రెట్లకుపైగా పెరిగి దాదాపు మూడున్నర కోట్లకు పైగా బోరుబావులు చేరుకున్నాయి. దీంతో సన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి రైతులు కొంతమేరకు లాభపడిన మాట వాస్తవమే అయినా నానాటికీ బోరుబావుల మీద ఆధారపడే పరిస్థితి పెరిగితే ఇది అనేక అనర్థాలకు దారితీస్తుంది. దేశంలో భూగర్భజలాల వినియోగం మూడింతలు పెరగడం, నీటి నియమాలు నీరుగారిపోతున్నాయనేందుకు సజీవ సాక్ష్యాలుగా పేర్కొనవచ్చు. పంజాబ్‌లో డెబ్బైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవైశాతం, కర్ణాటక, తమిళనాడులో నలభై శాతం అధికంగా భూగర్భ జలాలు వాడుకుంటున్నట్లు సమాచారం. దేశ రాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో యేటా యాభైనాలుగు లక్షలకోట్ల లీటర్లకుపైగా భూగర్భ జలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం ఏనాడో ప్రకటించింది. పాతాళంలోకి దిగ జారిపోతున్న జలాలను పైకి తోడడానికి అటు విద్యుత్ కానీ, ఇటు డీజిల్ కానీ వినియోగం పెరిగిపోతుంది. మంచి నీటికొరతను ఆసరాగా చేసుకొని కొందరు దళారులు మంచినీటి వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా నీటి వ్యాపారం వేల కోట్లల్లోకి చేరుకున్నది. వేసవి వస్తున్నదంటే తెలుగు రాష్ట్రాల్లో కూడా అనేక ప్రాంతాలు ముఖ్యంగా నగరాలు, పట్టణాలు, గ్రామాలే కాదు శివారు పల్లెలకు కూడా నీటివ్యాపారం విస్తరించింది. ఏ కోణంలో చూసినా మంచినీటి పరిస్థితి రానురాను ప్రశ్నార్థకంగా మారుతున్నది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏమాత్రం క్షేమం కాదు. మరొక పక్క కోట్లాది ఎకరాలకు సరిపోయే వేలాది టిఎంసిల నీటిని దేశంలో వివిధ నదుల ద్వారా పొంగి పొర్లి సముద్రం పాలవుతున్నది. ప్రజల్లో అవగాహన లోపించడం ఫలితంగానే భూగర్భజలాల సమస్య రానురాను తీవ్ర రూపం దాలుస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాజకీయాలకు అతీతంగా నేతలు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాలి.

క్షమించడం, క్షమాపణ పొందడం ఒకే నాణేనికి రెండువైపులు. వాటి మధ్య సమన్వయం సాధించడమే ముఖ్యమైన కర్తవ్యం.



ఇ. గిబ్బన్

నీ తోటి మనుషులతో నీవే ఎక్కువ తెలివైనవాడిగా, ఎక్కువ చదువుకున్న వాడిగా ఎప్పుడూ వ్యవహరించకు.



విలియం రోజర్

# ప్రజావాక్కు



## ఉరుము ఉరిమి ఉక్రెయిన్ మీద పడింది

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ రాకతో ప్రపంచ దేశాల భౌగోళిక రాజకీయ సంబంధాలు పెద్ద కుదుపుకి లోనవుతున్నాయి.ఒక్కోచోట పిడుగులు, ఒక్కోచోట కుంభవృష్టి. అమెరికాతన ప్రయోజనాల్ని సాధించుకోడానికి ఏ దిశగా, ఎంత వేగంగా ప్రయత్నిస్తుందో చెప్పడం కష్టమోతుంది. తాజాగా ఆ దేశం వ్యూహం రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. అదీ తను ఇందాకా పక్షంవహించిన ఉక్రెయిన్ ఆశలకు విరుద్ధంగా.రష్యా, ఉక్రెయిన్ నడుమ యుద్ధం మూడేళ్లుగా కొనసాగుతోంది. బలమైన రష్యాతో, బలహీనమైన ఉక్రెయిన్ తలపడడానికిముఖ్యకారణం తన వెనుకబలంగా నిలిచిన అమెరికా, యూరోప్ దన్ను చూసుకునే.వారి నుండి అందుతున్న ఆర్థిక, సైనిక, ఆయుధ సాయంతోనే.

-డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

## వైద్య సౌకర్యం కల్పించాలి

ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలి.నూతనంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలలో ఇటీవలకాలంలో 9210 నూతనంగా డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పిజిటి, టీజీటీ, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్స్ వివిధ సొసైటీలలో జాయిన్ కావడం జరిగింది. రాష్ట్రంలో మొత్తం 20 వేలమంది గురుకుల సిబ్బందికి ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలి. గురుకులాలలో నిత్యం విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తూ వివిధ అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి ఈఎస్ఐ ఆరోగ్య కార్డు ఇచ్చి ఉద్యోగితోపాటుగా వారి కుటుంబ సభ్యులకు వారి తల్లిదండ్రులకు ఉచిత ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించాలి.

-రాపాక రవీందం, జనగాం

## లోక్‌అదాలత్ నిర్వహణ

ప్రతి జిల్లాలో న్యాయసేవల సాధికార సంస్థ నిర్ణీత కాలంలో లోక్ అదాలత్ నిర్వహణ జరుగుతోంది. చట్టం అనుమతించే రాజీమార్గం ఉన్న కేసుకు సత్వర న్యాయం లభిస్తుంది.ఎందరో పేద కుటుంబాలువారికి జరిగిన అన్యాయాలకు ఆర్థిక స్తోమత లేనప్పుడు మొదట పత్రాలతో సంబంధిత అధికారులు లేదా పర్యవేక్షకులను సంప్రదిస్తే దానివిధానం తెలియజేస్తారు.దీనివల్లపరిష్కారం ఏ ఖర్చు లేకుండా పొందవచ్చు. వస్తుంది.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

## జరిగిన నష్టం రాబట్టాలి!

ఎపి ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి ఆ సంస్థలో పని చేస్తున్న ముగ్గురు ఉన్నతాధికారులపనితీరు పూర్తిగా లోపభూయిష్టంగా, బాధ్యతారహితంగా ఉండటంతో తొలగించాలని తీసుకున్న నిర్ణయం అభినందనీయం. తొలగించడమే కాకుండా, వారి బాధ్యతారాహిత్యం వలన సంస్థకు జరిగిన నష్టం వారి నుంచి రాబట్టాలి. ఒక్కఫైబర్ నెట్‌మాత్రమే కాదు, ప్రతి శాఖలో, ప్రభుత్వ సంస్థల్లో అన్ని స్థాయిల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పాలకులు ప్రజలకు జవాబుదారీ. మంత్రులు, వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు పని చేయని అధికారులను గుర్తించితక్షణమే తొలగించాలి. అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## పెరిగిన టారిఫ్

డోనాల్డ్ ట్రంప్ మహాశయుడు అమెరికా అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికయిన తరువాత అనేక పరిశోధనలు చేస్తున్నారు. మన టారిఫ్ తో సమానంగా వారి టారిఫ్‌ను పెంచడం ఈ విషయాన్ని ఖరాఖండిగా మన ప్రధాని మోడి గారితోనే నిష్కర్మగా నిర్మోహమాటంగా చెప్పానని ట్రంప్ చెప్పారు. భారత దేశానికి డబ్బుఅవసరం ఏ మాత్రంలేదని చెప్పారు. ఎందుకంటే భారత్ ధనిక దేశమట. పన్నుల రూపేణా అధికంగా సంపాదిస్తోందట.ధనిక దేశమే అయితే కోటిలక్షల కోట్లు అప్పు చేయడమెందుకో. కొంతమంది ఐ.పి.ఎస్. 95 స్కీములో రిటైరయిన వారు రెండు దశాబ్దాల పైగా తమకొచ్చే వెయ్యిరూపాయల ఫించన్ను పెంచమని మొత్తుకుంటుంటే తమ ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని బీద అరుపులు అరుస్తోంది.కోట్లాది మంది భారతీయులు ఇంకా దారిద్రరేఖ దిగువున నివసిస్తున్నారు. మరి భారత్ ధనిక దేశం ఏలా అయిందో ట్రంప్ విడమరచి చెప్పాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## మాతృభాషలోనే విద్యాబోధన

విద్యాహక్కు చట్టం 2005 ప్రకారం మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి.ప్రతి తరగతికి ఒక గదిఉండాలి. అన్ని పాఠశాలలకు ర్యాంకింగ్స్ ఇవ్వాలి. ఉపాధ్యాయులను బోధనే తర కార్యక్రమాలకు ఉపయోగించకూడదు.అన్నిపాఠశాలల్లో మౌలిక వసతులుకలిపించాలి. పాఠశాలల ముందు స్కూల్ జోన్ బోర్డు ఉండాలి.మాతృభాషలో విద్యాబోధన ద్వారా విద్యార్థులు పాఠాలు త్వరగా నేర్చుకోవడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది.

-పుట్టూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'సహకారా'నికి తూట్లు పొడవొద్దు

**దేశంలో యాభైరెండు శాతంపైగా రైతులు అప్పుల ఊబిలో మగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సహకారవ్యవస్థ దిగజారే కొద్దీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఏదో ఒక రూపేణ ఈవ్యవస్థలోకి ప్రవేశించక తప్పదు. ఇప్పటికే ప్రైవేట్‌వడ్డీ వ్యాపారులు ఫైనాన్స్,మైక్రోఫైనాన్స్ పేర్లతో గ్రామగ్రామానికి విస్తరించారు. ఇష్టానుసారంగా వడ్డీలు వసూలుచేస్తున్నారు. రానురాను మరింత పెరిగేపరిస్థితులు కన్పిస్తున్నాయి. ఏదిఏమైనా ఎంతో పవిత్ర ఆశయంతో పెద్దలు ప్రవేశపెట్టిన ఈ సహకార రంగానికి తూట్లు పొడవడం ఏమాత్రం సమంజసం కాదు.**

దామెర్ల సాయిబాబ

'అప్పిచ్చువాడు వైద్యుడు, ఎప్పుడు ఎడతెగక పారు ఏరును ద్విజుడున్, చొప్పడిన ఊరనుండుము, చొప్పడ కున్నట్టిఊరు చొరకుము సుమతీ' అంటూ కొత్త ప్రదేశాల్లో స్థిరపడాలనుకునేవారికి సుమతీ శతకకారుడు కొన్నిసూచనలు ఇచ్చారు. అందులోనూ మొట్టమొదటిది అన్నిం టికంటే ముఖ్యమైనది అప్పు. ఆ అప్పుకు ఎంతటి ప్రాధా న్యత ఇచ్చారో ఆనాటి పెద్దలు.ఆరోగ్యం, నీరుకంటే అప్పిచ్చు వారికే అగ్రతాంబూలం ఇచ్చారు. ఇది కొత్తగా వచ్చిందికాదు, కొత్తగా చెప్పేది కాదు. ఎంతో అనుభవంతో కాచివడబోసి వెల్లడించిన సుమతీశతకం ఇది. పూర్వీకుల నుంచి గ్రామీణ రంగంలో రైతులను ఆదుకునేందుకు అప్పులు అందించే వ్యవస్థ ఏదోఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. రాజుల కాలం కానీ, ఆ తర్వాత కానీ ఆ గ్రామాల అవసరాలను బట్టి రైతులకు రుణసహాయం అందించేవారు. ఆనాడు లాభాపేక్ష ఉండేది కాదు. రైతులకు అప్పులు ఇచ్చేవారి మధ్య అవినాభావ సంబంధాలు ఉండేవి. ఎంతో మానవతా విలువలు ఉండేవి. ఒకరినొకరు ఆదుకోవాలనే తపన,ఆరాటం ఉండేది. కానీ దిగజారిపోతున్న మానవ విలువలతో పాటు ఆ వ్యవస్థ కూడా లాభాపేక్ష ధ్యేయంగా మారి అధిక వడ్డీలు, అపరాధవడ్డీలు అంటూ అమాయకులను దోపిడీ చేయడం ఆరంభించింది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని 'నాగు'లంటూ పంటకాలానికి బస్తాకు రెట్టింపు వసూలు చేసేవిధానం కూడా చోటు చేసుకుంది. ఈ నాగులు, అపరాధ వడ్డీలు చెల్లించలేక ఎన్నో కుటుంబాలు వీధినపడ్డాయి. దీని నుంచే వెట్టిచాకిరి ఆవిర్భవించిందని చెప్పొచ్చు. ఈ దోపిడీని వ్యతిరేకించిన వారిలో కొందరు యువకులు ఆనాటి బ్రిటిష్ పాలకులు కూడా ఎదురొడ్డి నిలిచారు. పోరాట బాటపట్టారు. ఒక దశలో బ్రిటిష్ ప్రభుత్వానికి ఇదొక సమస్యగా రూపాంతరం చెందింది. అప్పుల భారం భరించలేక, వ్యవసాయానికే మంగళం పాడే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అటు వడ్డీ వ్యాపారులను కట్టడి చేయలేక, ఇటు రైతులను ఆదుకోలేక ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం సతమతమైంది. ఎన్నో కమిటీలు, సుదీర్ఘ అధ్యయనం అనంతరం గ్రామీణ పరిస్థితులను అర్థం చేసుకున్న బ్రిటిష్ పాలకులు 1904లో సహకార వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 1911 మార్చి17వ తేదీన గుంటూరులో జిల్లాస్థాయి సహకార బ్యాంకు ఆవిర్భవించింది. ఆ తర్వాత అయ్యదేవర కాళేశ్వర రావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య లాంటి పెద్దలు కలిసి విజయవాడ కోఆపరేటివ్ బ్యాంకును స్థాపించారు. అందులోనుంచి విడిపోయిన పట్టాభి సీతారామయ్య భూములను తనఖా పెట్టుకొని దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే భూ తనఖా బ్యాంకులను భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా కృష్ణజిల్లా గుడ్ల వల్లేరులో 1925 అక్టోబరు 31వ తేదీన శ్రీకారం చుట్టడంతో గ్రామీణరంగంలో రుణవసతులు కల్పించడంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నా యి. అందరి రైతులకు కాకపోయినా కొందరికి కొంతమేరకు ఊరట లభించింది. ఈ వ్యవస్థను నీరుకార్చేందుకు కొందరు భూస్వాములు వడ్డీవ్యాపారస్తులు ఎవరి వంతు వారు కృషి చేశారు. అయినా రైతుల విశ్వాసం చూరగొంటూ అంచెలంచెలుగా ఎదిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1964లో సహకార చట్టం వచ్చింది. రైతుల కష్టాన్ని వడ్డీ, చక్రవడ్డీ రూపంలో దోచుకుంటున్న కొందరి వ్యాపారులకు పెత్తందారులకు ఇది ఇబ్బంది కలిగించినా రైతులకు మాత్రం వరప్రసాదంగా పరిణమించింది. వడ్డీ వ్యాపారస్తులకు సంబంధించిన వ్యక్తులు డబ్బులు వసూలు చేయడంలో ఎంత కర్కశంగా వ్యవహరించేవారో ఇప్పటికీ కథలుకథలుగా చెప్పుకుంటారు. వారికి వాయిదాల ప్రకారం డబ్బు చెల్లించకపోతే

ఒక్క మాట

డబ్బు కట్టేవరకు ఇంట్లో పొయ్యి వెలిగించకుండా నీళ్లుపోసేవారట. అంటే తమకు డబ్బు చెల్లించకుండా ఆ ఇంట్లో ఎవరూ ఆకలి తీర్చుకునే అవకాశం లేకుండా చేసేవారు. వంటపాత్రలను ఎత్తుకెళ్లేవారు. వ్యవసాయ పశువులను తోలుకుపోయేవారు. ఇంటి ముందు తలుపులు తీసుకువెళ్లడం, వ్యవసాయ పనిముట్లు జప్తు చేసుకువెళ్లడం లాంటివి చేసి సమాజంలో అవమానపరిచేందుకు ఎన్ని మార్గాలు ఉన్నాయో అన్ని అమలు చేసేవారు. మొత్తం మీద ఈ సహకార వ్యవస్థతో గ్రామీణరంగంలో ఆ బాధలు తప్పిపోయాయని రైతులు ఆనందించారు. మరొకపక్క రైతుల అవసరాలను బట్టి రుణసహాయం అందిస్తూ వారి ఆదరాభిమానాలు అందుకుంటూ సహకార రంగం శాఖోపశాఖలుగా విస్తరించింది. అంచెలంచెలుగా ఎదిగి కోట్ల రూపాయలు అప్పులిచ్చే స్థాయికి చేరుకున్నది. మరెన్నో సహకార సంఘాలు ఆవిర్భవించి దేశానికి ఆదర్శంగా నిలిచాయి. కరీంనగర్ జిల్లా ముల్కనూరులో ఏర్పాటైన సొసైటీ కార్యకలాపాలను చూసేందుకు మనదేశం నుంచే కాదు బ్రిటన్ లాంటి దేశాల నుంచి కూడా నిపుణులు వచ్చి అధ్యయనం చేసివెళ్లేవారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ వ్యవస్థలో రాజకీయాలు ప్రవేశించడంతో క్షీణదశ ఆరంభమైందని చెప్పొచ్చు. గత రెండు, మూడు దశాబ్దాలుగా పరిస్థితి రానురాను దిగజారిపోతున్నది. అప్పులు వసూలు చేయడంలో పాత వడ్డీవ్యాపారులు వ్యవహరించిన తీరు కొన్నిచోట్ల అధికారులు పాల్పడుతుండడంతో రైతుల విశ్వాసాన్ని కోల్పోతున్నారు. గతవారంలో తెలంగాణలో ఓ బక్క రైతు అప్పుకట్టలేదని ఆయన ఇంటి ముందు తలుపులు తీసుకువెళ్లారు. ఆ తలుపులతో ఆయన కట్టాల్సిన లక్షలాది రూపాయలు అప్పులో వందోవంతు కూడా తీరదని తెలుసు. కేవలం ఆ రైతును అవమానపరిచేందుకే ఇలాంటి పాత పద్ధతులను అవలంబిస్తున్నారు. రైతుల పరిస్థితి వేదనాభరితంగా మారుతున్నది. అధికారులు పాల్పడుతున్న ఇలాంటి చర్యల పట్ల తెలంగాణ వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మొన్న బహిరంగంగానే తీవ్ర స్థాయిలో హెచ్చరిం చారు. అయినా కొందరు అధికారుల్లో మార్పురావడం లేదు.పోనీ ఇంత నిర్ధాక్షిణ్యంగా రైతుల నుంచి వసూలుచేసి సహ కార వ్యవస్థ పురోభివృద్ధికి ఉపయోగపడుతున్నాయంటే అదీ లేదు. సహకార సంఘాల ఆర్థికపరిస్థితి అంతకంతకు దిగజారిపోతున్నది. నష్టాలఊబిలో కూరుకుపోతున్నాయి. కొన్ని సహకార సంఘాలు తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. సహకార చట్టంలో ఎన్నిసార్లు మార్పులు చేశారో చెప్పలేం. సకాలంలో ఎన్నికలు జరపడం లేదు. వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం కూడాఅదే పద్ధతి అవలంబిస్తున్నారు. రాజకీయాల అవసరాల కోసం వీరూవారు అనితేడాలేకుండా అందరూ అన్నివిధాలుగా ఈ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడే కాదు ముఖ్యమంత్రులు మారినప్పుడు వారి అభీష్టాలమేరకు నిబంధనలు మారుస్తున్నారు.భూమున్న రైతులేకాదు,భూమి లేని వారు కూడా కేవలం పదిరూపాయలు ఫీజు చెల్లించి సభ్యులుగా చేరవచ్చునన్న సవరణ తెచ్చారు.ఆ తర్వాత మళ్లీదాన్ని సవరించారు. ఎన్నికల్లో ఓట్లకోసం ఇష్టానుసారంగా సభ్యత్వాన్ని పెంచారు. 'ఒకరి కోసంఅందరు, అందరి కోసం కొందరు నిలిచి' అన్న సహకారస్ఫూర్తికి ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. సహకారవ్యవస్థ రాజకీయ పునరావాసంగా రూపాంతరం చెందింది.ఆదాయ వ్యయాలు నిమిత్తం లేకుండా అవసరాలకు మించి ఉద్యోగులను నియమించడంతో సహకార సంఘాలకు మోయలేని భారంగా పరిణమించింది. ఇక అవకతవకలకు అంతేలేకుండాపోయింది. రైతులకు తెలియకుండా రైతుల పేరుపై అప్పులు తీసుకొని భోంచేసిన ఉదంతాలు ఎన్నో బయటకు వచ్చాయి. విచారణ పేరుతో ఏళ్లతరబడి కాలంగడుపుతున్నారు. 'కావడి ఎన్ని వంకలు తిరిగినా చివరకు ఇంటికి చేరాల్సిందేనన్నట్లు' ఈ భారమంతా రైతులు మోయాల్సివస్తుందనే వాస్తవాన్ని పాలకులు పట్టించుకోవడంలేదు. దేశంలో వ్యవసాయరంగం కుదేలైపోతుండడానికి కారణాల్లో రైతులకు సకాలంలో అప్పులు దొరక్కపోవడం. దీంతోవారు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడక తప్పడం లేదు. దేశంలో యాభై రెండు శాతం పైగా రైతులు అప్పులఊబిలో మగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తు న్నాయి. సహకార వ్యవస్థ దిగజారే కొద్దీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు ఏదోఒక రూపేణ ఈ వ్యవస్థలోకి ప్రవేశించక తప్పదు. ఇప్పటికే ప్రైవేట్‌వడ్డీ వ్యాపారులు ఫైనాన్స్, మైక్రోఫైనాన్ పేర్లతో గ్రామగ్రామానికి విస్తరించారు. ఇష్టానుసారంగా వడ్డీలువసూలు చేస్తున్నారు.రానురాను మరింత పెరిగేపరిస్థితులు కన్పిస్తున్నాయి.ఏదిఏమైనా ఎంతో పవిత్ర ఆశయంతో పెద్దలు ప్రవేశపెట్టిన ఈ సహకార రంగానికి తూట్లు పొడవడం ఏమాత్రం సమంజసం కాదు. ●

# న్యాయస్థానాల్లో తీవ్రజాప్యాన్ని అరికట్టాలి!


బి. మధు

ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసిన ఉమ్మడి కుటుంబాల ఆస్తుల విషయంలో అన్నదమ్ముల మధ్య వచ్చే పొరపచ్చలు, ఘర్షణ వాతావరణం, బహిరంగ కొట్లాటలు, ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, పరస్పర దాడులు చేసుకుంటూ తమది న్యాయం అంటే తమది న్యాయం అంటూ చివరకు పోలీస్ స్టేషన్‌కు, కోర్టుకువెళ్లడం వంటివి సంభవించడం ఒక సర్వ సాధారణ విషయంగా మారిపోవడం ఈ సమాజానికి సంబంధించి ఏ మాత్రం ఆరోగ్యకరమైన పరిణామం కాదు. ముఖ్యంగా ఈ ఉమ్మడి ఆస్తుల విషయంలో ఎవరికి చెందాల్సిన ఆస్తులు వారికే చెందకుండా అంతా ఆస్తిని తాము ఒక్కరమే అనుభవించాలనే దురాశతో, దుర్బుద్ధితో తమకువచ్చే ఆస్తులు చాలక తన సొంత అన్నదమ్ములు, తోబుట్టువుల ఆస్తులను కూడా దొడ్డిదారిలో కాజేయాలని చూస్తుండటం,హస్తగతం చేసుకోవాలని ప్రయత్నం చేయడం అందుకోసం ఎలాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడటానికి కూడా వెనుకంజ వేయకపోవడం వంటి అనైతిక పోకడల మూలాన ఆస్తుల వ్యవహారాలు ముదిరిపాకాన పడిఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూ, దుమ్మెత్తి పోసుకుంటూఅంతిమంగా న్యాయం కోసం ఏ పోలీస్ స్టేషన్ లేదా న్యాయ వ్యవస్థ గడపనో తొక్కడం వంటి చర్యలు అనేకం. ప్రస్తుతం మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయి అనే మాట పచ్చి యధార్థం.అయితే ఎక్కువ భాగం ఇలాంటి కేసులలో తమ తల్లిదండ్రులను నయనో భయానో లొంగదీసుకొని లేదా వారిని పక్కదోవ పట్టించి మరీ ఉమ్మడి కుటుంబంలోని కొంతమంది నయవంచకుల వంటి అన్నదమ్ములు తమ సొంత అన్న లేదా తమ్ముడి ఆస్తులను చట్టంలోని లొసుగులను ఆధారంగా చేసుకొని ఆస్తులను అప్పనంగా కొట్టేసేందుకు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నుతుండటం, అందుకోసం నీతి,నియమాలకు సైతం తిలోదకాలు ఇచ్చి డబ్బు వ్యామోహం మెండుగా గల కొంతమంది లాయర్లను ఆసరాగా పెట్టుకొని మరీ అందరికి చెందాల్సిన ఆస్తులు తమకే చెందేలా ఆస్తులను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కూడా ఏ మాత్రం వెనుకంజ వేయడం లేదు. అంటే నేటి సమాజంలో ఎలాంటి అత్యంత దురదృష్టకరమైన, ఆందోళనకరమైన పరిస్థితులు పొడచూపుతున్నాయో మనకు బాగా విశదమవుతున్నది .అందుకోసం మోసపురితమైన,దగాకోరు పంథాలో తల్లిదండ్రుల నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాలపై సంతకాలు తీసుకొని తమకు చెందని ఆస్తులను కూడా కొంతమంది రిజిస్ట్రేషన్ ఆఫీసు అధికారులను,అక్కడ పని చేసే సిబ్బందిని మభ్యపెట్టి వారికి కాసుల ఆశ చూపి తమ పేర లిఖించుకొని ఆన్‌లైన్ చేసుకుంటున్నారు. అంటే మన వ్యవస్థ ఎంతగా భ్రష్టు పట్టిందో, ఏస్థాయిలో దిగజారిపోయిందో మనం ఇట్టే ఊహించవచ్చు. ఏదిఏమైన ఇప్పటికైనా ఉమ్మడి కుటుంబంలోని సభ్యులు తమ ఆస్తుల విషయంలో నిద్రాణావస్థ నుంచి మేల్కొని తమ ఆస్తులు మరొకరి పాలు కాకుండా,అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించడంతోపాటు, ఒకవేళ తమకు అన్యాయం జరిగిన త్వరితగతిన తమ తల్లిదండ్రులను సంప్రదించి జరిగిన దారుణ మోసాన్ని వారికి బట్టబయలు చేసివారిని (ఎంఆర్ఓ) మండల రెవెన్యూ అధికారి,తహశీల్దారు వంటి ఆఫీసర్ల వద్దకు తీసుకెళ్లి తక్షణమే వారు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేసిన భూమిని బ్లాక్ చేయించే విషయంపై అవగాహన పెంచుకొని తమ విలువైన ఆస్తులను అత్యంత సురక్షితంగా కాపాడుకోవాలి. కాబట్టి ఉమ్మడి ఆస్తుల పరిరక్షణే ప్రదాన ధ్యేయంగా ప్రతి ఒక్క ఉమ్మడి కుటుంబ సభ్యులు భావించి తదనుగుణంగా తమ గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకపోతే మాత్రం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందాన అమూల్యమైన జీవితాలు అధోగతి పాలు కావడం తథ్యం. ●

# చదువుల విప్లవం డిజిటల్ టెక్నాలజీతో సాధ్యం!

డాక్టర్ మోటె చిరంజీవి

కాలం మారుతుంది. కాలానికి అనుకూలంగా విద్యలో కూడా అనేక మార్పులు వస్తున్నాయి.రోజురోజుకు విద్యార్థుల్లో కూడా కాంపిటీషన్ పెరుగుతుంది. దాన్ని అధిగమించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు అధ్యాపకులు. ఇలా పట్టణప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలకు కూడా డిజిటల్ తరగతులతో బోధన చేపట్టి, విద్యార్థుల్లో నైపుణ్యాలను అలవరుస్తున్నారు. కరోనా సమయంలో కూడా ఈ డిజిటల్ తరగతులు కీలకంగా పని చేశాయి. గూగుల్, జూమ్ యాప్ ద్వారా ఇంటిదగ్గర ఉన్నటువంటి పిల్లలకు సైతం పాఠాలు బోధించారు.ఈ విధంగా ఆన్లైన్ క్లాసులకు ఆజ్యం పోయడం జరిగింది. ఇలా పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇంట్లోనే పాటలు వినేటువంటి పరిస్థితి కలిగింది. ప్రైవేటు పాఠశాలలే కాకుండా ప్రభుత్వ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో కూడా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధనలు అందించడానికి పలు రకాలుగా పాఠాలను బోధిస్తున్నారు. అందులో సులభతరంగా విద్యాబోధన చేయడానికి ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల్లో డిజిటల్ విప్లవం వచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు. విద్యార్థులకు సులభతరంగా పాఠ్యాంశాలు బోధించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యలోసాంకేతిక పురోగతి కోసం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఐక్యంగా నిలబడి,అధ్యాపకులు సైతం అండగా ఉన్నప్పుడుమాత్రమే ఇది సాధ్యమవుతుంది. అందుకోసం అధ్యాపకులకు నూతన టెక్నాలజీని కూడా బోధిస్తున్నారు.సాంకేతిక విప్లవం ఇంకా వెనుకబడి ఉన్న అనేక పాఠశాలలు,కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ప్రధాన సవాళ్లు ఉన్నాయి.ఉపాధ్యాయులు తరగతి గదిలో ఆధునిక విద్యా సాధనాలను ఉపయోగించడానికి వెనుకాడతారు. అలా వెనకాడకుండా ఉండడానికి , సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించడానికి, వారికి సరైన శిక్షణ ఇస్తున్నారు.గతంలో వనరులు, మౌలిక సదుపాయాలు కనెక్టివిటీ లేకపోవడం వల్ల తరగతి గదులకు ఇంత సుసం పన్నమైన సాంకేతికత అందుబాటులో లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం అలాంటి ఇబ్బంది ఏమీ లేదు. భారతదేశం డిజిటల్ మయమైంది. వేగవంతమైన సాంకేతిక పురోగతి యుగంలో మన పట్టణకేంద్రాలు అభివృద్ధి చెందుతున్నందున, మన నగరాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న విస్తారమైన విద్యా అంతరాన్ని తగ్గించడంపై మనం దృష్టి పెట్టవలసిన సమయం ఆసన్నమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ఎక్కువ నిధులు కేటాయిస్తూ, అందులో చదువుతున్నటువంటి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదుల పరిచయం ఆశాకిరణంగా ఉద్భవించింది. ఈ వినూత్న సెటప్‌లు మన



దేశంలోని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు సాధికారతను కల్పిస్తాయి. దృశ్య అభ్యాస అనుభవాలు ఇంటరాక్టివ్ వాతావరణాల ద్వారా మెరుగైన అవగాహనను అందిస్తాయి. గ్రామీణవిద్యలో సాంకేతికతను సమగ్రపరిచే మార్గంలో సవాళ్లలేకుండా లేవు. పరిమిత మౌలిక సదుపాయాలు, అనియత విద్యుత్ సరఫరా నుండి డిజిటల్ అక్షరాస్యతకు, అడ్డంకులు అనేకం ఉన్నాయి. అన్నింటిని అధిగమిస్తూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు ఇలా అన్ని సమకూర్చుతూ మరోపక్క బోధన పద్ధతుల్లోకూడా వినూత్న పద్ధతులు పాటించేలా అనేక విద్యాప్రమాణాలను పాటిస్తూ, గురుకులాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుతుంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడం జరిగింది. కంప్యూటర్ ల్యాబ్‌తోపాటు, ట్యాబు ద్వారా, బై జ్యూస్ కంటెంట్ విద్యార్థులకు బోధించేందుకు ప్రతి తరగతి గదిలో ఐ ఎఫ్ ప్యానల్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారా లైవ్ క్లాస్‌లను కూడా అందుబాటులోకి తేవడం జరిగింది. విద్యార్థికి ఏదైనా అర్థం కానప్పుడు అడిగే విధంగా కూడా ఉండి, వారికి వచ్చిన డౌటును క్లారిఫై చేసుకోవడం జరుగుతుంది. ఈవిధంగా పాఠశాల విద్యార్థుల్లో మెరుగైన ర్యాంకులురావడం, కళాశాల విద్యార్థులు నీట్, ఐఐటి వంటి పోటీ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించడం,డిగ్రీ, పిజి,పిహెచ్‌డి విద్యార్థులు సైతం వారికి తెలియని విషయాలను సైతం తెలుసుకుంటూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నారు. ఈ విధంగా కరోనా సమయంలో ఇంట్లోనే ఉండి విద్యను నేర్చుకోవడం జరిగింది. ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో సైతం ఆన్లైన్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థులకు ఆన్లైన్ పాఠాలు బోధిస్తున్నారు. 20వ శతాబ్దపు 3వ పారిశ్రామిక విప్లవం ఇంటర్నెట్, ఆటోమేషన్ టెక్నాలజీలను తీసుకువచ్చింది. డిజిటల్ టెక్నాలజీల విస్తృత వినియోగం కారణంగా, దీనిని డిజిటల్ విప్లవం అని కూడా పిలుస్తారు. కొత్త డిజిటల్ టెక్నాలజీల సహాయంతో ప్రస్తుత వ్యాపార ప్రక్రియలను మెరుగుపరిచే ప్రక్రియను డిజిటలైజేషన్ అంటారు. 20వ శతాబ్దంలో కంప్యూటర్లు విస్తృతంగా వాడుకలోకి వచ్చిన తర్వాత ఇది ప్రారంభమైంది. ఇంతకుముందు భారత్‌లో ఎంతోమంది విద్యార్థులు పలు రకాల కారణాలతో అర్ధాంతరంగా చదువుకు దూరం అయ్యేవారు. వారికోసం వారు చదువు కొనసాగించడానికి విశ్వవిద్యాలయంలో ఈ డిజిటల్ ఆన్లైన్ తరగతులు ఎంతగానో తోడ్పడుతుంది. ఇవే కాకుండా సీట్లు పొందినటువంటి విద్యార్థులు డిజిటల్‌ద్వారా తమకు నచ్చిన విశ్వవిద్యాలయంలో గాని, విద్యాలయాలలో గాని, సంక్షేమ గురుకులాల్లో సీట్లు పొందుతున్నారు. ఈ విధంగా విద్యార్థులకు ఆన్లైన్‌కోర్సులు విస్తృతంగా అందుబాటులోకి రావడం, ఆన్లైన్ కోర్సులను అందించడానికి కేంద్రం ఆధ్వర్యంలో 2016లో మాసీవ్ ఓపెన్ ఆన్లైన్‌కోర్సెస్ వేదిక ఏర్పాటు చేశారు.రాబోయే రోజులలో అంతర్జాతీయ విద్యా సంస్థలతో డిజిటల్ పాఠాలను అందించినట్లయితే ఎంతగానో ఉపయోగపడుతుంది. ఏది ఏమైనప్పటికీ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలా ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉండి, విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్నటువంటి గురుకులాలు, పాఠశాలలు ఉన్నతప్రమాణాలు పాటించడమే కాకుండా వారిని సమాజంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతు న్నారు అధ్యాపకులు. ఈ విధంగా విద్యార్థులు, అధ్యాపకులు, డిజిటల్ వ్యవస్థలను ఉపయోగించి,వాటితో బోధించి,ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు. ●

# భూ దస్త్రం.. కాసుల అస్త్రం

## - రెవెన్యూ శాఖ తీరిది - సర్వేలో వెలుగులోకి




**ఒంగోలు, ప్రభాతవార్త**

రెవెన్యూ అధికారులు భూ అవసరాలను బట్టి ఒక్కో పాస్ పుస్తకానికి రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. నగర పరిధిలో జిల్లా కేంద్ర సమీపాల్లో, పట్టణ ప్రాంతాల్లో విలువైన భూములు అయితే పట్టాదారు పాస్ పుస్తకాలకు భారీగా వసూళ్లు చేస్తున్నారు. ఇవ్వకపోతే తిరస్కరి స్తున్నారు. ఇదంతా తహశీల్దార్ కనుసన్నల్లోనే జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. తహశీల్దార్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. అయితే వారిని కాదని, కొందరు తహశీల్దార్లు తమ వ్యక్తి సహాయకులుగా కొందరు ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్లను పెట్టుకున్నారు. వారి చేతుల్లోనే తహశీల్దార్ డిజిటల్ కీ ఉంటుంది. బేరం కుదిరి పైకం చేతికి అందితే ఆయన ఫోన్‌లో సమాచారం చేరవేస్తుంటారు. ఆపరేటర్ పని చేసి పెడుతుంటారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో డిజిటల్ కీ ఉండటంతో ఆన్‌లైన్‌లో భూ రికార్డులను మార్చేస్తున్నారు. మ్యుటేషన్లకు దరఖాస్తు చేసుకున్న తరువాత 24గంటల్లోనే ఫారం-8 జనరేట్ చేయాలి. ఆ వెంటనే వీఆర్వో, అమ్మకం దారులు, కొనుగోలు దారులతో పాటు గ్రామ సచివాలయం, పంచాయతీ కార్యాలయం, బోర్డులో నోటీసులు ప్రదర్శించాలి. నోటీసులు ఇవ్వడం లేదు, క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించడం లేదు. ముడుపులు ఇస్తే చాలు ఒక్క రోజులోనే పని చేసి పెడుతున్నారు. పూర్వీకుల పేర్లపై ఉన్న భూములను తమ పేరిట మ్యుటేషన్ చేయాలంటూ పలువురు రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఏళ్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నా ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించడం లేదు. ఒంగోలు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మండలంలో65 సెంట్లు తన తండ్రి పేరుతో ఉన్న భూమిని ఆన్‌లైన్‌లో ఇతర పేరు ఆన్‌లైన్‌లో ఎక్కింది. అయితే సదరు వాళ్ళ నాన్న మరణించడంతో కుమారుడు తండ్రి మరణ ధృవీకరణ పత్రంతో పాటు తన పేరు మీద మ్యుటేషన్ చేయాలని ఎమ్మార్వో చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. ఇలాంటి సంఘటనలు జిల్లాలో కోకోలు. గతంలో మ్యుటేషన్ చేయాలంటే రూ.20, నుంచి రూ.30వేలకే చేసే వారు. ప్రస్తుతం లక్ష రూపాయలు చేయి తడపనిదే మ్యుటేషన్ చేయడం లేదని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. చివరికి ఒక రైతు రాజకీయ నాయకులతో చెప్పిస్తే అతని దగ్గర రూ.20వేలు తీసుకుని మ్యుటేషన్ చేసినట్లు సమాచారం. ఇలా రెవెన్యూ శాఖలో అక్రమాలు పుట్టగొడుల్లా వస్తున్నాయి. పాస్ పుస్తకాలు, భూ కొలతలకు సంబంధించి ఐవీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు దారుడుకి ప్రభుత్వం ఫోన్ చేయించి సమస్య తెలుసుకుంటుంది. ఈ క్రమంలో రెవెన్యూ అధికారుల తీరు వెలుగులోకి వచ్చింది.

## యానాదులపై దాడి కేసు విచారించిన డిఎస్పీ



**చీమకుర్తి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

చీమకుర్తి మండలం బక్కిరెడ్డిపాలెం గ్రామం లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ నిమిత్తం ఒంగోలు డి.ఎస్.పి రావిపాటి శ్రీనివాసరావు శుక్రవారం విచారణ నిమిత్తం వచ్చారు. యానాదులుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, వారిపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలని, విచారణ నిమిత్తం బక్కిరెడ్డి పాలెం గ్రామం కి వచ్చిన డివిజనల్ సూపర్ డెంట్ అఫ్ పోలీస్ ను కోరారు. బాధితులకు బాసటగా ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి చీమకుర్తి మండలం అధ్యక్షులు జడా విజయ్ కుమార్, పాటిబండ్ల వంశీ, పాటిబండ్ల జక్కరయ్య ,బహుజన నాయకులు ఇస్తర్ల శంకర్ బహుజన్,,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి రవి, కే ఎన్ పి ఎస్ చీమకుర్తి మండలం కార్యదర్శి అరేతోటి రాంబాబు, పిల్లి కోటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు చింతలపాలెం యలమందబాబు స్థానిక నాయకులు గుత్తి రాజు,గిరిజన నాయకులు కోమరిగిరి నారాయణ,చలం చర్ల అంజయ్య, బాపట్ల యంగయ్య, తోకల కిట్టు, తదితరులు పాల్గొన్నారు

## నాటు సారా, గంజాయి తయారు, అమ్మకం నేరం



**చీమకుర్తి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

నాటు సారా, గంజాయి, తయారు చేయడం, అమ్మడం సేవించడం నేరమని చీమకుర్తి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎం సుకన్య హెచ్చరించారు. జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్, ఒంగోలు వారి ఆదేశాలు మేరకు చీమకుర్తి ఇన్స్పెక్టర్ ఎం. సుకన్య, సబ్ఇన్స్పెక్టర్ ఎం.నగేష్, వారి సిబ్బంది తో కలిసి చీమకుర్తి మండలంలోని మర్రిచెట్లపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీలోని నివాసం ఉండే ప్రజలకు కు నాటు సారాయి, గంజాయి మరియు డ్రగ్స్ వినియోగం వల్ల కలుగు నష్టాలు మరియు వారు తీసుకోవలసిన జాగ్రత్తలు పై అవగాహన సదస్సు నిర్వహించడమైనది. ఎవరైనా నాటు సారాయి, గంజాయి మరియు డ్రగ్స్ సేవిస్తున్న వారి వివరములు సిఐ గారికి తెలిపిన ఎడల, తెలిపిన వారి వారి పేరు వివరములు గోప్యంగా ఉంచబడతాయన్నారు. నాటు సారాయి, గంజాయి మరియు డ్రగ్స్ అమ్మినా, సేవించిన వారిపై కఠిన మైన చర్యలు తీసుకొన పడతాయని హెచ్చరించారు

## రోస్టర్ విధానం సరిచేశాక పరీక్ష నిర్వహించాలి



**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

రోస్టర్ విధానం సరిచేశాక గ్రూప్2 పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, తక్షణమే డిఎస్‌సి ప్రకటించి యువతకు న్యాయం చేయాలన్నారు. సిపిఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోస్టర్ విధానంలో తప్పులు వున్నాయని న్యాయస్థానం పేర్కొన్నప్పటికి హడావిడిగా గ్రూప్2 పరీక్ష నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు.

## ఘనంగా మాతృభాషా దినోత్సవం



**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

డిఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ మాతృభాష విశిష్టతను గుర్తెరిగి తెలుగు సంస్కృతి విలసిల్లేలా వ్యవహరించాలన్నారు. విద్యార్థినుల సంగీత నృత్య రూపకాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో తెలుగు శాఖ హెచ్ఓడి యామిని, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కగార్ ఆపరేషన్ నిలిపివేయాలంటూ ధర్నా



**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

దండకారణ్యంలో కగార్ ఆపరేషన్ నిలిపివేయాలంటూ వామపక్ష, దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ న్యూడెమాక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దండకారణ్యంలో ఖనిజ సంపదను కార్పొరేట్‌లకు దోచి పెట్టేందుకే కేంద్రం కగార్ ఆపరేషన్ చేపట్టిందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఆదివాసి హక్కుల ఉల్లంఘన దారుణమని, తక్షణమే కగార్ ఆపరేషన్ నిలివేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జివి కొండారెడ్డి, ఆదివాసి హక్కుల పోరాట సమితి ఆంజనేయులు, ఎస్‌కెఎం చుండూరి రంగారావు, పిఓడబ్ల్యు పద్మ, ఎఐకెఎంఎస్ కొంగర నరసింహం, రెడ్ ఫ్లాగ్ సుబ్బారావు, ఐఎల్‌పి దాసరి సుందరం, పిడిఎస్‌యు రాజశేఖర్, ఓపిడిఆర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చీమకుర్తి పోలీస్ స్టేషన్‌కు డ్రోన్ అందజేత



**చీమకుర్తి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

చీమకుర్తి పోలీస్ స్టేషన్ కి అనంద్ గ్రానైట్ ఎక్స్పోర్ట్ ప్రవేట్ లిమిటెడ్ తరపున ఒక డ్రోన్ కెమెరాను శుక్రవారం అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రాం క్రింద, ఈ డ్రోన్ కెమెరా ను చీమకుర్తి సిఐ సుబ్బారావు కి ఆనంద్ గ్రానైట్ మేనేజర్ లు కృష్ణ, కోదండ పాణి లు అందజేశారు. వీరితో పాటు చీమకుర్తి ఎస్ఐ, పోలీస్ సిబ్బంది ఉన్నారు

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు వ్రాయాలి

### - డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మానాయక్



**ఒంగోలు టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

ఒంగోలు, కొండపి సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలలో చదువుకుంటూ పదవ తరగతి పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు స్థానిక అంబేద్కర్ భవన్‌లో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మానాయక్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడం జరిగిందని, ఒత్తిడికి లోను కాకుండా పరీక్ష వ్రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం ఆల్ఇన్ వన్ స్టడీ మెటీరియల్, స్టేషనరీ విద్యార్థులకు పంపిణీ చేశారు. వసతి గృహాలలో చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఇఓ కిరణ్ డిసిఇబి కార్యదర్శి శ్రీనివాసరావు, సిడబ్ల్యుసి సభ్యులు నీలిమ, ఎఎస్‌డబ్ల్యుఓలు పాల్గొన్నారు.

# ఐదేళ్ల అధికారంతో ఆంధ్రాను అంధకారంలోకి నెట్టేశారు

- *జగన్ అసమర్థ పాలనతో రాజధాని లేకుండా పోయింది*
- *భావితరాల భవిష్యత్తు కోసం రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం*
- *వైసీపీ నియంతృత్వ పోకడలతో అమరావతి, పోలవరం నిర్మాణ వ్యయం రెట్టింపు*
- *ఎన్నికల హామీలన్ని అమలు చేస్తాం*
- *ఏడు నెలల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాం*
- *విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్*





**బల్లికురవ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మహా కూటమి ప్రభుత్వం చేతుల ప్రభుత్వమని ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను నూరుశాతం విజయవంతంగా అమలు చేస్తామని రాష్ట్రవిద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని వైదన గ్రామంలో ట్రూ యాభై లక్షల వ్యయంతో నిర్మిస్తున్న షాదీఖానా భవనానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో పలు సీసీ రోడ్లను ప్రారంభించి అభివృద్ధి కార్యక్రమాల పట్ల భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూవచ్చి ఐదేళ్ల అధికారం వెలగబెట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను అంధకారంలోకి నెట్టేశారని విమర్శించారు. జగన్‌విధ్వంస పాలన నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం భావితరాల భవిష్యత్తుకోసం ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం చేపట్టిందని వివరించారు.

**వైసీపీ నేతల ఆదాయం ఘనం.. ప్రజలపై రెట్టింపు భారంః**

జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థ పాలనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 9 లక్షల కోట్లరూపాయల అప్పులతో రాష్ట్రాన్ని ఊబిలోకి నెట్టేశారని తెలిపారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో వైసీపీ నేతలు అక్రమంగా కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు. అదే సమయంలో ప్రజలపై అప్పులు, పన్నుల భారం రెట్టింపు అయిందన్నారు. కనీసం రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేశారని విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం నిర్మాణాల వ్యయం కూడా రెట్టింపు అయ్యిందని మంత్రి వాపోయారు. ప్రస్తుతం డయాఫ్రం వాల్ నిర్మాణానికి వెయ్యి కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని, ఇది గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఒక్క నిదర్శనం మాత్రమేనని పేర్కన్నారు. అన్ని వ్యవస్థల ను జగన్ అండ్ కో భ్రష్టు పట్టించారని స్పష్టం చేశారు. నింగి నుంచి నేల వరకు అన్నట్లు.. ఇసుక, మట్టి, గనులు తీర ప్రాం తాలు, ప్రకృతి వనరులను ఐదేళ్లు అడ్డగోలుగా దోచేశారని ఆయన మండి పడ్డారు. ప్రజలు అధికారం ఇస్తే.. రాష్ట్రాన్ని 20 సంవత్స రాలు వెనక్కి తీసుకెళ్లారని మండిపడ్డారు. ఇంత చేసినా ఇంకా జగన్ దుర్మార్గపు ఆలోచనలతో అబద్దాలు చెబుతున్నారని, ప్రజలందరూ ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి సూచించారు.

**వైసీపీ ప్రభుత్వంలో నెలవారీ జీతాలు గగనమేః**

గడిచిన ఏడు నెలల కాలంలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు నెలవారీ జీతాలు ఎప్పుడూ క్రమపద్ధతిలో ఇవ్వలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు, లక్షలాది మందికి పెన్షన్లు.. ప్రతి నెల ఒకటో తేదీన జమ చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామన్నారు. వెయ్యి కోట్లతో రోడ్లకు మరమ్మత్తులు చేశామని వెల్లడించారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాలను పునఃప్రారంభించామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయని చెప్పారు. సీఎం చంద్రబాబు దార్శనికతతో రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని తెలిపారు. ప్రజా సంక్షేమమేలక్ష్యంగా ముఖ్యమంత్రి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కుకు సీఎం చంద్రబాబు చొరువతోనే కేంద్రం రూ.10వేల కోట్లు కేటాయించిందన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య పాలనతో రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా.. ప్రజా సంక్షేమంలో రాజీ లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవినాయక్, ఎంపీడీఓ కుసుమకుమారి, సీఐ వెంకటరావు, మస్తాన్‌రావు, ఏఈలు మాధవ్, ఏవో కుమారి, ఆర్ఐ పోతురాజు, శ్రీనివాసరావు, పార్టీ నేతలు మల్లీనీడి గోవిందరావు, జాస్తి వెంకటనారాయణబాబు, పార్టీ అధ్యక్షులు ఇజ్రాయిల్, యాగంటి సింగరయ్య, గొట్టిపాటి లక్ష్మయ్య, పోగుల శేఖర్, పోగుల కృష్ణ, ఇప్పల అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు

### - జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



**ఒంగోలు, ప్రభాతవార్త**

జిల్లాలో గ్రూప్-2, ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. గ్రూప్-2, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, భద్రత, తనిఖీల విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

**గ్రూప్-2 మెయిన్స్ ఇలా..ః**

ఏపీపీఎస్‌సీ నిర్వహించే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు జిల్లాలోని 7 సెంటర్లలో ఈనెల 23వ తేదీన జరగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం సమయాలలో జరిగే ఈ పరీక్షలలో 4,544 మంది అభ్యర్థులు హాజరు కాబోతున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. సీఎస్ నిర్వహించిన వీసీ కాన్ఫరెన్స్‌లో ఏపీపీఎస్‌సీ అధికారులు కూడా పాల్గొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయడం కోసం కలెక్టరేట్‌లో 8801188046 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌కు ముందుగా ఏపీపీఎస్‌సీ అధికారులు, లైజనింగ్ ఆఫీసర్లతో జాయింట్ కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

**ఇంటర్మీడియట్ పరీక్షలు ఇలాః**

మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 64 సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 42,439 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహనను పర్యవేక్షించేందుకు 3 సిట్టింగ్ స్క్వాడ్, మరో 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్యాలయం నుంచి ఇద్దరు పరిశీలకులు కూడా వస్తున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 24 గంటలు పని చేసేలా జిల్లా స్థాయిలో 08592-281275 నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

**టెన్త్ పరీక్షలు ఇలా..ః**

మార్చి 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని డీఆర్ఓ బి.చిన్న ఓబులేషు చెప్పారు. గురువారం ఆయన అధ్యక్షతన సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ప్రత్యేక సమావేశం జరిగింది. జిల్లాలో మొత్తం 29,602 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు డీఈఓ కిరణ్ కుమార్ చెప్పారు. వీరి కోసం 183 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని అన్నారు. పరీక్షల నిర్వహనను పర్యవేక్షించేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదే విధంగా ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 1,564 మంది మార్చి 3 నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు 4,175 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. దీనిపై డీఆర్ఓ స్పందిస్తూ పరీక్షల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పించాలని, పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఆయా కేంద్రాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రశ్నాపత్రాల తరలింపు, విద్యార్థులు ప్రయాణించేందుకు అవసరమైన స్థాయిలో కంటైనర్లు, బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో ఆటంకం లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అశోక్‌బాబు, డీటీసీ సుశీల, డీపీఓ వెంకట నాయుడు, ఎస్‌టీఓ అక్కేశ్వరరావు, వైద్య, ఆర్టీసీ, మున్సిపల్, విద్యుత్, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### శ్రీశైల మందిరం శ్రీ మల్లిఖార్జునం

# ఆహ్లాదభరితం శ్రీశైల మహాపుణ్యక్షేత్రం



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

నల్లమల అరణ్యంలోని ప్రకృతి ఒడిలో వెలసిన శ్రీశైల మహాపుణ్యక్షేత్రం భక్తులను పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంది. పచ్చని చెట్లతో ఎతైన కొండల మధ్య ముగ్ధ మనోహరంగా నందన వనంలా కనువిందు చేసే శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో ఎన్నో దర్శించ దగ్గ ప్రదేశాలు, నాటి కట్టడాలు కనువిందు చేస్తాయి. శ్రీశైల క్షేత్రం పవిత్ర పుణ్యదామము. అంతా శ్రీ మల్లిఖార్జునమయం. పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలలో రెండ వది. ఇక్కడ పరమశివుడు జ్యోతిర్లింగ స్వరూపుడై శ్రీ మల్లిఖార్జునుడుగా విరాజిల్లుతున్నాడు. అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీ పార్వతి దేవి శ్రీ భ్రమరాంబ దేవిగా వెలసి పూజలందు కుంటుంది. విగ్నేశ్వరుడికి స్కందునికి రుద్ర గణాధిపత్యం కోసం జరిగిన పందెంలో విగ్నేశ్వరుని విజయం వరించింది. అన్నగారు కేవలం తల్లిదండ్రులకు ప్రదక్షణం చేసి ఆ పదవిని సంపాదించాడని తెలుసుకున్న స్కందుడు అలకతో కైలాసాన్ని విడిచి శ్రీశైలం కౌంచ పర్వతంపై ఆశీనుడై కాళ్ళను మంత్ర బద్దంగా బంధింపచేసుకుని కూర్చుండి పోయారు. పార్వతీ పరమేశ్వరుల కోరికపై నారధుడు స్కందుని వద్దకు వచ్చి ఎన్ని విధాలుగా నచ్చచెప్పిన ఫలితం కనిపించలేదు. అలక మార లేదు. అలక వీడని కుమారుని కోసం స్వయంగా పార్వతీ పరమేశ్వరులు కైలాసాన్ని విడిచి భూలోకానికి స్కందుని వద్దకు వచ్చారు. తల్లి ఎంత బతిమాలిన స్కందుడు రాలేదు. కుమారుడి ఎడబాటు భరించలేని పరమేశ్వరి పుత్రవాత్సల్యంతో శ్రీశైలంలోని శక్తి పీఠం నందు స్థిర నివాసం ఏర్పరుచుకొని భ్రమరాంబికగా ప్రసిద్ది చెందింది. భార్యను కుమారుణ్ణి వదిలి ఉండలేని పరమేశ్వరుడు శ్రీశైలము నందు జ్యోతిర్లింగ స్వరూపుడై వెలిశాడు. ఈ విషయం తెలుసుకున్న దేవతలు శ్రీశైల క్షేత్రం వచ్చి శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వార్లను దర్శించి అర్చించారు. ఆనాటి నుండి కౌంచ పర్వతం పైనున్న స్కందుని శ్రీశైల శిఖరంపై నుండి రోజు కనులారా చూసుకుంటున్నారని లోక ప్రసిద్ధమైంది. తర్వాత విగ్నేశ్వరుడు కూడా అక్కడికే వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని సాక్షి గణపతి పేరుతో భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఇక్కడ శివుడు మల్లిఖార్జునుడుగా పేరొందారు. ఈ ప్రాంత రాజు చంద్రగుప్తుడు. ఈయన ఏకైక కుమార్తె చంద్రావతి. ఈమె మల్లెలతో మాలకట్టి స్వామికి సమర్పించేది. ఓ రోజు స్వామి కరుణించి కుమారీ.. నీ భక్తినచ్చాను. ఏదైనా వరము కోరుకో అన్నారు. స్వామీ.. ఈ మల్లెమాల శాశ్వతంగా నీ కంఠము నందు అలంకరింపబడాలి. నీ జఠజూటమునందు అర్ధ చంద్రాకృతిలో ఉండే ఒక మల్లెమాలను నా సుహస్తాలతో అలంకరించాలని ఉందని మనసులో మాట చెప్పింది. ఆమె భక్తికి ముగ్ధుడైన పరమశివుడు ఆమె ప్రార్ధనను మన్నించి కుమారీ..! నీకు నాకు ఉన్న పుత్రకాను బందం శాశ్వతంగా నిలిష్టకు నేను మల్లిఖార్జునుడిగా భక్తులకు అనుగ్రహిస్తానన్నారు. ఆనాటి నుండి శ్రీశైలంలో జ్యోతిర్లింగ రూపంలో వెలసిన శివుడిని భక్తులు మల్లిఖార్జునగా కొలుస్తున్నారు. ఇంతటి విశిష్టత కలిగిన శ్రీశైలం శాతవాహనుల కాలంలో నాసిక్ శాసనంలో సిరిధాన్, సిరిగిరి పేరుతో ప్రస్థానంలో ఉంది. అనంతరం ఇక్ష్వాకుల ఏలుబడి నుంచి పల్లవుల పాలనకొచ్చింది. 450- 570 కాలంలో విష్ణు కుండీలు, ఆరవ శతాబ్దంలో రేనాటి చోళులు, ఎనిమిదో శతాబ్దంలో రాష్ట్ర కూటులు, 1132-62 మధ్య కాలంలో వెలనాటి రాజులు శ్రీశైల ఆలయ గోపురానికి శిఖరాలను అమర్చాడు. ఈక్షేత్ర ప్రారంభానికి కారకులైన కాకతీయులలో రెండవ ప్రోలరాజు సందర్శించాడు. ప్రతాపరుద్రుడు భార్యతో సహా తులాభారం తూగి ఆ దనాన్ని స్వామికి సమర్పించారు. గణపతి దేవుడు ప్రతి ఏడాది 12 వేల బంగారు నాణెలు ఈ క్షేత్ర అభివృద్ధికి ఖర్చు చేశారని చరిత్ర చెబుతోంది. గణపతి దేవుని సోదరి మహిళాదేవి స్వామివారి ఆలయాన్ని నిర్మించారు. పోలయ్య వేమారెడ్డి పాతాళ గంగకు మెట్లు నిర్మించారు. వీర శైవులు తమ కాళ్ళను, చేతులను, నాలుకలను శరీరంలోని వివిధ భాగాలలో గండ్ల కత్తుతో చేధించుకొని శివునికి సమర్పించే వారని చరిత్ర చెబుతుంది. ఈ సాంప్రదాయాన్ని వీరశైవుల వీరాచారం అని పిలుచుకునేవారు. వీరి కోసం నిర్మించినదే వీరసిరో మండపం. విజయనగర రాజులు మల్లిఖార్జున స్వామి ఆలయానికి ముందు ముఖ మండపాలు నిర్మించారు. కి.శ 1511 సంవత్సరం కృష్ణదేవరాయల శాసనం నిర్మాణాల గురించి తెలియజేస్తుంది. కి.శ 1674 లో చత్రపతి శివాజీ జీర్ణోద్ధరణ చేసి ఎత్తయిన గోపురాన్ని నిర్మించారు. ఇంతటి మహోన్నత విశేషాలు ఉన్న శ్రీశైల క్షేత్రానికి దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరై భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటారు. పాతాళగంగ, హఠకేశ్వరం, పాలధార పంచధార, ఘంటమఠలు, శిఖరేశ్వరం, దర్శనీయ స్థలాలు, భూలోక కైలాసంగా పిలువబడుతున్న శ్రీశైలాన్ని సందర్శించి శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి వార్లను తనివితీర దర్శిద్దాం.







## ఎస్.డబ్ల్యూ.బిసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**జె.పంగులూరు , ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మండలంలోని రామకూరు గ్రామ పంచాయతీలో ఎంపిడిఒ కె.స్వరూప రాణి ఆధ్వర్యంలో డివిజనల్ పంచాయతీ అధికాఇర బి.శివన్నారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి మాట్లాడుతూ ఎస్.డబ్ల్యూ.బిసి షేడ్ల నిర్మాణ పనులు, ఇంటిపన్ను వసూలు, మరియు సర్వేపై అన్నీ గ్రామాల పంచాయతీ కార్యదర్శులను, సచివాలయాల సిబ్బందితో సమీక్ష నిర్వహించి, తగు సలహాలు, సూచనలు ఇచ్చి త్వరతిగతున పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి యుఆర్‌డిఒ సునీత, గ్రామసర్పంచ్ కొత్తపల్లి సుజాత, సెక్రటరీ ఎం.శిరీష, మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు బాషా దినోత్సవం

### - పలువురు కవులకు సత్కారం

**అద్దంకి , ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవాన్ని రోటరీక్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ముందుగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అద్దంకికి చెందిన పలువురు కవులను పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, గాడేపల్లి దివాకర్ దత్తు, నారాయణ్ సుబ్రమణ్యం, అనిల్ కుమారి సూరిలను రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు, చప్పిడి వీరయ్య, చుండూరి మురళీ సుధాకరరావు,మలాది శ్రీనివాసరావు,షేక్ మహమ్మద్‌రఫీ, హరిప్రసాద్, పూర్ణచంద్రరరావు, అంజనేయులు, శ్రీలక్ష్మి, శివకుమారి,భువనేశ్వరి,నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఈఈ

**అద్దంకి , ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



ట్రాన్స్‌కో ఈఈ నల్లూరి మస్తాన్ రావు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సింగరకొండ లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోని శ్రీలక్ష్మీ నరసింహాస్వామి దేవస్థానంకు వెళ్ళె మెట్ల దారి వెంబడి, ఎల్‌టి లైన్ ఏర్పాటు, ఆర్యవైశ్య సత్రం నుండి ఎన్‌ఆర్‌టి రోడ్డులోని ఆర్చి వరకు లైన్ మార్పు, మూడు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు, టిటిడి కళ్యాణమండపం వరకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు, అద్దంకి పట్టణంలో నేషనల్ హైవేకి సంబంధించి రోడ్డు క్రాసింగ్‌లో ఇబ్బంది కరంగా వున్న విద్యుత్ లైన్లను మార్పులు చేయడం వంటి పనులను ఈఈ పరిశీలించి పలు సూచనలు చేశారు.

## వివాహ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి గొట్టిపాటి

**సంతమాగులూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



సంతమాగులూరు గ్రామంలో విశ్రాంత ఉద్యోగి కూరపాటి సాంబశివరావు కుమారుడు శ్రీకాంత్ వివాహ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై ఆశ్వీదించారు. ఈ కార్యక్రమంలో సన్నెబోయిన ఏడుకొండలు, చేవూరి వాసురెడ్డి, సన్నెబోయిన గురుబ్రహ్మం యాదవ్, బండారు వెంకటరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

**గిద్దలూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



గిద్దలూరు పట్టణంలోని అర్బన్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు మార్కాపురం డిఎస్పి యు నాగరాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదుపులోకి తీసుకున్న ముగ్గురు వ్యక్తులలో ఒకరు గిద్దలూరుకు చెందిన వ్యక్తికాగా మరో ఇద్దరు తెలంగాణకు సంబంధించిన వ్యక్తులని వీరి వద్ద నుంచి 3కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే గిద్దలూరు ఏరియాలో గంజాయి బ్యాచ్‌పై ప్రత్యేకంగా డ్రోన్ కెమరాలతో నిఘా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయిపై ప్రత్యేకంగా యువత తప్పుదారి పట్టే అవకాశం ఎక్కువగా ఉందని తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని తెలియజేశారు. సిఐ సురేష్ మాట్లాడుతూ గంజాయితో కుటుంబాలు నాశనం అవుతాయని విద్యార్థులు, పెద్దలు గంజాయికు అలవాటుపడితే ఆ మత్తులో వారు ఏం చేసేది వారికే అర్థం కాదని దాని వలన చాలా ప్రమాదాలు ఎదురవుతాయని ఆయన తెలిపారు. గిద్దలూరు రూరల్ సిఐ రామకోటయ్య మాట్లాడుతూ గంజాయి సరఫరా చేసే వారి వివరాలు పోలీసు వారికి తెలియజేసిన యెడల వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని గంజాయి అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని డ్రోన్‌తో గస్తీ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరు నుండి బెంగుళూరు ఆర్టీసీ సర్వీస్‌ను కొనసాగించాలి

**గిద్దలూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



గిద్దలూరు నుండి బెంగుళూరు ఆర్టీసీ సర్వీస్‌ను కొనసాగించాలని గిద్దలూరు పట్టణ భారతీయ జనతాపార్టీ అధ్యక్షులు అపిశెట్టి ఉదయ్ శంకర్ అన్నారు. గిద్దలూరు ఆర్టీసీ డిపో సిఐకు శుక్రవారం గిద్దలూరు పట్టణ బిజేపి అధ్యక్షులు ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో బిజేపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిద్దలూరు పట్టణం నుండి ప్రతిరోజు బెంగుళూరుకు నడుస్తున్న ఆర్టీసీ సర్వీస్‌ను రద్దు చేయడం వలన ఈ ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలు ప్రైవేట్ ట్రావెల్స్ అధిక చార్జీలు వసూలు చేస్తూ అధిక భారము మోపుతూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కావున బెంగుళూరు సర్వీస్ కొనసాగించాలని భారతీయ జనతాపార్టీ కోరుతుందన్నారు. అంతేకాకుండా గిద్దలూరు నుండి సాయంత్రం 8గంటల తరువాత కడప వెళ్ళుటకు ఆర్టీసీ సర్వీసు లేకపోవడంతో విజయవాడ నుండి సాయంత్రం 8గంటల తరువత ఆర్టీసీ సర్వీస్ లేక పోరుమామిళ్ళ కడప వెళ్ళడానికి ప్రజలు ప్రైవేటు ట్రావెల్స్‌ను సంప్రదించగా వారు అధిక చార్జీలు వసూలు చేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. కావునా సాయంత్రం 8గంటల తరువాత కడప వరకు ఆర్టీసీ సర్వీస్ నడపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజేపి నాయకులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు మంత్రి రవికుమార్ ఆశీర్వాదం

**బల్లికురవ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మండలంలోని వైదన గ్రామంలో శుక్రవారం జరిగిన పలు వివాహాలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వైదన గ్రామంలో బద్రి శ్రీనివాసరావు కుమారుని వివాహం సందర్భంగాహాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రామాంజనేయ పురంలో మారాబత్తుని సుంకులయ్య- సుబ్బాయమ్మ దంపతుల కుమారుని వివాహం సందర్భంగాహాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే విధంగా సంతమాగులూరు గ్రామంలో కూరపాటి సాంబశివరావు కుమారుని వివాహం సందర్భంగా హాజరై నూతన వరుడు శ్రీకాంత్‌ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల పరిశీలన

**కొనకనమిట్ల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల అధికారులు, సచివాలయ సిబ్బంది బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల దరఖాసూత్తులను పరిశీలించారు. మొత్తం 24 యూనిట్లకు గాను రూ.46 లక్షలు నిధులు మంజూరయ్యాయని, కార్పొరేషన్ రాయితీ పోను బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తారని ఎంపీడీఓ తెలిపారు. బీసీ ఏ కేటగిరికి 8 యూనిట్లకు రూ.15లక్షలు, బీసీ బీ కి 11 యూనిట్లుకు గాను రూ.21 లక్షలు చొప్పున నిధులు కేటాయించడం జరిగిందన్నారు. మొత్తం 271 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.

## కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో తోడ్పడుతుంది : ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

**గిద్దలూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



కరాటే ఆత్మరక్షణకు ఎంతగానో తోడ్పడుతుందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఇటీవల విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం నందు రాష్ట్ర కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 22వ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్ షిప్‌లో గిద్దలూరులోని కరాటే మాస్టర్ పివి సుబ్రమణ్యంకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాలలో పతకాలు సాధించారు. గెలుపొందిన విజేతలకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి జ్ఞాపికలను ప్రదానం చేసి అభినందించారు.అనంతరం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణకు మరియు దేహ దారుఢ్యానికి ఉపయోగకరమైందని తెలిపారు. కరాటే ఇండియా ఆర్గనైజేషనన జడ్జిగా నియమితులైన మాస్టర్ పివి సుబ్రహ్మణ్యంను ప్రత్యేకంగా అభినందించి కియో బ్యాడ్జిని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ది గిద్దలూరు సిద్దాఆర్థ కరాటే డో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రంగారెడ్డి,ప్రధాన కార్యదర్శి షబ్బీర్,మాస్టర్ చాంద్ బాషతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శుద్దికరణ తాగునీరు విద్యార్థులకు అందేనా

### - విద్యార్థులు అనారోగ్యం పాలు కావాల్సిందేనా

### - పట్టించుకునే వారు లేరా అని విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన

**అర్ధవీడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



అర్ధవీడు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో నీళ్లశుద్ధి చేయు యంత్రం నిరూపయోగంగా ఉన్నాయి. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా శుద్దికరణ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో గత వైకాపా ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా పాఠశాలలో నీరు శుద్ధి చేయు యంత్రాలను తీసుకొని వచ్చారు. కానీ అమర్చిన రెండు మూడు నెలలకే అన్ని పాఠశాలలోని నీళ్ల శుద్ధిచే యంత్రాలు పాడైపోయి ఉన్నాయి. నీళ్ల ఫిల్టర్ చేయక ఆ నీళ్లను చిన్న పిల్లలు తాగితే నోటి దంతాలు గారెపట్టి దంతాలు అధ్వాన్నంగా ఉంటున్నాయి. చిన్న పిల్లలలో చెప్పుకోలేని సమస్యలు తలెత్తుతున్నాయి. నీళ్ల శుద్ధి చేయక పలు పాఠశాలలో చేతిపంపు ద్వారా నీరు తాగితే పాఠశాలలోని పిల్లలకి అతిసారం కడుపునొప్పి తదితర చెప్పుకోలేని సమస్యలు విద్యార్థులకు వస్తున్నాయి. పాడైపోయిన యంత్రాల వైపు చూసే దిక్కులేరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.పైగా అర్థవీడు మండలం వెనుకబడిన ప్రాంతంలో మొట్టమొదటిగా ఉండటంతో ఫ్లోరిన్ సమస్య కూడా అర్ధవీడు ప్రాంతంలో కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఫ్లోరిన్ నీరును నీరు శుద్ధిచే యంత్రంలో తగిన మోతాదులో మినరల్స్ కలిపి శుద్ధి చేసి విద్యార్థులకు నీటిని అందించవచ్చు కానీ ఆ యంత్రాలు పాడైపోయినప్పటికి విద్యార్థులు మాత్రం బోరు నీళ్లే తాగుతున్నారు. ఇప్పటికైనా జిల్లాలోని విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ యంత్రాలను బాగు చేయించి చిన్న పిల్లల ఆరోగ్యం కాపాడాలని అర్ధవీడు మండలంలోని పలుప్రాంత పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులను వేడుకుంటున్నారు.

## పలువురికి మంత్రి రవికుమార్ పరామర్శ

**బల్లికురవ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మండలంలోని వైదన గ్రామంలో శుక్రవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలువురిని పరామర్శించారు. వైదన గ్రామ పంచాయతీ పరిధిలోని చవిటి మాదిగపల్లెలో మాజీ ఎంపీటీసీ నాగబాము వీరయ్య అనారోగ్యంతో మరణించాడు. సమాచారం అందుకున్న గొట్టిపాటి వారి నివాసానికి వెళ్లి వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైదన గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ పోగుల సుబ్బారావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య విషయమై వాకబు చేసి సుబ్బారావుని పరామర్శించారు.

## ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టు డైరీని ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి

**బల్లికురవ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మండలంలోని వైదన గ్రామంలో శుక్రవారం వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏపీయూడబ్ల్యూజే యూనియన్ జర్నలిస్టు డైరీని ఆవిష్కఇంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాకూటమి ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, జర్నలిస్టులకు ఇచ్చిన మామీలను చిత్తశుద్దితో నెరవేరుస్తూ ముందుకు పోతుందన్నారు. ముందుగా బాపట్ల జిల్లా యూనియన్ అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు మంత్రి రవికుమార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం దుర్గాప్రసాద్, కృష్ణారెడ్డి, వేణుబాబు, శ్రీనివాసరావు, హుస్సేన్, సుబ్బారావు, ఎన్‌టీవీ మురళి, మహాటీవీ కృష్ణ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ

**బల్లికురవ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



దివ్యాంగుల సంక్షేమానికి మహాకూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వైదన గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి పథకాల శంకుస్థాపనలు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అద్దంకి, బొడ్డువాని పాలెం, కొమ్మాపలాడు, కొప్పురపాడులకు చెందిన నాగేంద్రం, యేసు,నాగేశ్వరరావు, పున్నారావు, ఆనందరావు,5 మంది దివ్యాంగులకు ఉచిత బ్యాటరీ ఛార్జింగ్ ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను మంత్రి లబ్దిదారులకు అందజేశారు. ఇవి జైపూర్ అలింకో సంస్థ ద్వారా అందిస్తున్నారని ఇప్పటికే అద్దంకి నియోజకవర్గంలోని దాదాపు 43 మందికి అందజేయడం జరిగిందని, ఆబోయే రోజుల్లో నియోజకవర్గం లోని ప్రతి గ్రామంలో అర్హత ఉన్నటువంటి దివ్యాంగులకు ఇవి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల దివ్యాంగుల అధ్యక్షులు దమ్ము అంజయ్య, టీడీపీ నేతలు పోగుల శేఖర్, పోగుల కృష్ణ అనిల్, సాంబశివరావు పాల్గొన్నారు.

## కొండపి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్

**కొండపి, ఫిబ్రవరి 21 ,ప్రభాతవార్త**



సాధారణ తనికీలలో భాగంగా కొండపి పోలీస్ స్టేషన్‌ను కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ శుక్రవారం ఆకస్మికంగా తనికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై, సిబ్బందికి పలు సూచనలు అందించారు. సమస్యాత్మకంగా ఉన్న ప్రదేశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే నిఘా పరిశీలనకై డ్రోన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. దాతల సహకారంతో సమకూర్చడం జరిగిందని ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. ఆ మేరకు సిబ్బందికి వివరించాలని సూచించారు. ఎస్పి ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం సిబ్బందితో క్రైమ్ రివ్యూ నిర్వహించారు. సమావేశంలో ఎస్సై ప్రేమ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## జార్జ్ ఫార్మసీ కళాశాలలో రక్తదాన శిబిరం

**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



పట్టణంలోని జార్జ్ ఫార్మసీ కళాశాల నందు శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో 25మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ రక్తదానం కార్యక్రమానికి ముందు ప్రిన్సిపల్ డాక్టర్ వై రాజా జయరావు మరియు మార్కాపురం ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ యూనిట్‌కు సంబంధించిన సిబ్బంది చలపతి రావు, రవికుమార్, విద్యార్థులకు రక్తదానం చేయడం వలన కలిగే ఉపయోగాల గురించి తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరం ఆవశ్యకతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజ జయరావు, అధ్యాపకులు డాక్టర్ సునీత, డాక్టర్ అశోక్, అధ్యాపకులు ముజీబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు





**రాచర్ల, ఫిబ్రవరి 21 ,ప్రభాతవార్త**

మండలంలోని శివాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినం ఈనెల 26వతేదీ జరగనుండగా ఆలయాలను ఇప్పటినుండే కార్యనిర్వాహకులు ఉత్సవాలకు ముస్తాబుచేస్తున్నారు. ఆలయాలకు ప్రత్యేక అలంకరణ శివరాత్రి పర్వదినం రోజు జరిగే పూజలు అభిషేకాలతోపాటు వివిధ రకాల కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లకు ఆలయాల కమిటీ పెద్దలు నడుంబిగించారు. ప్రజల సహకారంతో అవసరమైన కార్యక్రమాలకు చర్యలు చేపట్టి అందులో నిమగ్నమయ్యారు. మండలంలోని గుడిమెట్ట పంచాయితీ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలో వెలసియున్న శ్రీ సిద్ధిభైరవేశ్వర ఆలయ ధర్మకర్తలు మదిరె రంగారెడ్డి, శ్రీరంగపు వెంకటనారాయణ రెడ్డి తమ అనుచరులతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు ఇప్పటికే 80శాతం కార్యక్రమాలను పూర్తి చేశారు. బండలాగుడు పోటీలు, నాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర కార్యక్రమాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. అదేవిధంగా సత్యవోలు గ్రామ సమీపంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర ఆలయం, చోళ్లవీడు పంచాయితీ పరిధిలోని అక్కపల్లి గ్రామ సమీపంలో వెలసియున్న శ్రీ కనక సురభేశ్వర ఎల్లమ్మ కోన ఆలయాల్లో కూడా శివరాత్రి ఉత్సవాల కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆయా ఆలయాల కమిటీ పెద్దలు గ్రామాల పెద్దలు రాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 26వ తేదీ నాటికి కార్యక్రమాలన్నీ పూర్తి చేసి శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాల కమిటీ పెద్దలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు, అభిషేకాలు చేసుకునే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు ఆటంకాలు కలుగకుండా అధికారుల నుండి అన్ని అనుమతులు కూడా ఆలయాల కమిటీ సభ్యులు పొందినట్లు తెలిసింది.

## విద్యార్థులు విద్యతోపాటు క్రీడా ప్రతిభా పోటీల్లో కూడా రాణించాలి

### - ఎమ్మెల్యే సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి

**రాచర్ల, ఫిబ్రవరి 21 ,ప్రభాతవార్త**



విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు మరియు సాంస్కృతిక, ప్రతిభా పోటీల్లో కూడా రాణించాలని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి అన్నారు. ఇటీవల ఒంగోలులో జరిగిన ప్రకాశం బాలోత్సవ కార్యక్రమంలో పాల్గొని జిల్లా స్థాయిలో తమ ప్రతిభ కనబరచి 13 అవార్డులను గెలుచుకొని స్పందన విద్యాసంస్థ పేరును జిల్లా స్థాయిలో వినిపించిన విద్యార్థులను రాచర్ల స్పందన విద్యాసంస్థ యాజమాన్యం స్థానిక పాఠశాలలో శుక్రవారం అభినందించేందుకు అభినందన సభ ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన విద్యాసంస్థ మొదటి నుండి ఒక ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తోందని వారి విధి విధానాలు, క్రమశిక్షణ, విద్యా విధానం చాలా బాగున్నాయని అన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఏ పోటీల్లో పాల్గొన్నా తప్పకుండా విజయం సాధించి పాఠశాల పేరును మారు మ్రోగిస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థులు కూడా ఎంతోమంది ప్రయోజకులయ్యారని వివిధ రంగాలలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని ఆయన అన్నారు. స్పందన విద్యార్థులు చాలా సంవత్సరాల నుండి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని ఇది గర్వించదగ్గ విషయమన్నారు. ఎలాంటి రిమార్కులు లేకుండా దిగ్విజయంగా పాఠశాలను నడిపిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఎంతోమంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ అందరి మన్ననలు పొందుతున్న స్పందన విద్యాసంస్థ యాజమాన్యాన్ని తాము అభినందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రకాశం బాలోత్సవ కార్యక్రమంలో 62మంది విద్యార్థులు పాల్గొని వివిధ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఏకంగా జిల్లా స్థాయిలో 13 అవార్డులు గెలుచుకోవడం శుభపరిణామమని విజయం సాధించిన విద్యార్థులు అందరినీ అభినందిస్తున్నారని భవిష్యత్తులో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఇంకా గొప్ప విజయాలు సాధించి అవార్డులు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఎలాంటి పోటీలకైనా విద్యార్థులు సిద్ధమై పోటీల్లో పాల్గొంటే తమలో దాగిఉన్న ప్రతిభను బయటకు తీయవచ్చని కాబట్టి విద్యార్థులు ఏ పోటీకైనా ధైర్యంగా సిద్ధపడాలని ఆయన అన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక మొమెంటోస్, సర్టిఫికేట్లను అందజేసి అభినందనలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పేర్ల పరమేశ్వరరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ పేర్ల సుస్మిత రెడ్డి, జన విజ్ఞాన వేధిక రాష్ట్ర నాయకులు పంచలింగాల స్వరూపరెడ్డి, స్థానిక తెలుగుదేశం నాయకులు కటిక యోగానంద్, గోపిరెడ్డి జీవనేశ్వర రెడ్డి, దప్పిలి కాశిరెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తప్పనిసరిగా భూములను భూ ఆధార్ చేయించుకోవాలి

### - వ్యవసాయ శాఖాధికారుల పిలుపు

**యర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాలలో తమ భూమిని భూ ఆధార్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు తెలుపుతున్నారు. భూ ఆధార్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించిన విషయం విధితమే. రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు అనర్హులు పొందుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, గతంలో జగన్ ప్రభుత్వం అందించిన రైతు భరోసా అనర్హులు కూడా పొందినట్లు కూటమి ప్రభుత్వం చెబుతుంది. భూ ఆధార్‌తో వాటిని ఏరివేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. భూ ఆధార్‌తో అర్హులెవరు, అనర్హులు ఎవరు అనేది కూడా తేలుతుందని భావిస్తున్నట్లు ఆ ప్రభుత్వ నేతలు చెబుతున్నారు. అందులో భాగంగా యర్రగొండపాలెం మండలంలో వ్యవసాయ శాఖ అధికారుల నేతృత్వంలో భూ ఆధార్ పనులను రైతు సేవా కేంద్రాలలో ముమ్మరంగా ప్రారంభించాయి. ప్రతి రైతు ఫిబ్రవరి నెల చివరిలోపు భూ ఆధార్ చేయించుకోవాలని రైతులను యర్రగొండపాలెం మండల వ్యవసాయాధికారి శేషరెడ్డి కోరుతున్నారు. యర్రగొండపాలెం మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలను పరిశీలించిన ఆయన మండలంలోని రైతు సేవా కేంద్రాల వద్ద అగ్రికల్చరల్ అసిస్టెంట్‌ల ద్వారా తమ పొలాలను భూ ఆధార్ చేయించుక్వోఆలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలిసిన వార్త ప్రతినిధితో పలు విషయాలు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ పథకాలకు సరైన లబ్దిదారులను గుర్తించి పథకాలు వర్తింప చేసేందుకు భూ ఆధార్ అనే కార్యక్రమం తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో చేపడుతున్న బృహత్తర కార్యక్రమం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమమని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రధానమంత్రి కిసాన్ చెల్లింపు పెట్టుబడి సాయం, అన్నదాత సుఖీభవ, డ్రిప్పు పరికరాలు, పంట రుణాలు, వడ్డీ రాయితీ, మొదలగు ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ప్రతి రైతు తన ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకం నకలు తీసుకుని రైతు సేవా కేంద్రాలలో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో వ్యవసాయ శాఖాధికారితోపాటు ఏఈఓ మాల్యాద్రిరెడ్డి, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు షేక్ ఫయాజ్, మంత్రు నాయక్‌లతోపాటు రైతులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు

**బేస్తవారిపేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



బేస్తవారిపేట పరిధిలోని 8వసతి గృహములలోని మొత్తం 154మంది విద్యార్థులకు శుక్రవారం పట్టణంలోని యశ్వంత్ కళాశాలలో ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మానాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వరనయంలో ప్రకాశం జిల్లాలోని 56సాంఘీక సంక్షేమ వసతిగృహంలలో విద్యనభ్యసిస్తున్న 934మంది విద్యార్థినీ విద్యార్థులు 10వ తరగతి పరీక్ష ఫలితాలలో మంచి ఫలితాలు సాధించే దిశగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సౌజన్యంతో ప్రేరణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సంక్షేమ వసతి గృహంలో విద్యనభ్యసించే విద్యార్థినీ విద్యార్థులు 10వ తరగతి పరీక్షలపై వత్తిడి తగ్గించుటకు, సబ్జెక్టులపై విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయుటకు 6 సబ్జెక్టులపై ప్రావిణ్యంగల ఉత్తమ ఉపాధ్యాయుల ద్వారా ప్రతి సబ్జెక్టుపై గంటసేపు ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రేరణ తరగతులు నిర్వహించడం జరిగినట్లు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు మంచి ఫలితాలు సాధజంచేందుకు వారికి ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్‌ను స్టేషనరీ, మెటరీయల్‌ను ముందుగానే పంపిణీ చేయడం జరిగిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖాధికారిణి రాజేశ్వరమ్మ, బేస్తవారిపేట వసతిగృహ సంక్షేమాధికారులు, యశ్వంత్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బి వెంకటేశ్వరరెడ్డి, ప్రిన్సిపల్ ఎం యోగానంద్ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**గిద్దలూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

పౌరసరఫరా సంస్థలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం గిద్దలూరు రైస్ గోడౌన్ దగ్గర సివిల్ సప్లై హమాలీ కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై గిద్దలూరు రైస్ గోడౌన్ డిటి వాసుదేవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుమలరావు, పి శ్రీనివాసులు మాట్లాడుతూ పౌరసరఫరా సంస్థలో పనిచేసునతన్న హమాలీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో హమాలీ కూలీ రేట్లు 25రూపాయల నుండి 28రూపాయలకు పెంచుతామని ఒప్పందం జరిగిందని నేటికీ కూలి రేట్లు పెంచిన జీవో అమలు చేయలేదని అన్నారు. 2024 జనవరి నుండి పెంచిన హమాలీ కూలి రేట్లకు అరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు ఓబులేసు, ఎన్ వీరయ్య, ఎస్ పిచ్చిరెడ్డి, హామాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహన కార్యక్రమం



**గిద్దలూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మండలంలోని జయరాంపురం, వెల్లుపల్లి, అంబవరం గ్రామాల్లో శుక్రవారం మండల వ్యవసాయ శాఖాధికారి విజయభాస్కర్ రెడ్డి రైతు విశిష్ట సంఖ్య నమోదుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని భూమికలిగిన ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకుని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## వెల్లంపల్లి జేఎంఆర్ సీనిమా థియేటర్ సీజ్



**మద్దిపాడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మండల పరిధిలోని సినిమా థియేటర్‌ను శుక్రవారం రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గత కొంత కాలంగా జీఎంఆర్ సినిమా హాల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సినిమా థియేటర్ స్థలంలో గతంలో రైస్ మిల్ నిర్వహించే వారిని ఇప్పుడు రైస్ మిల్‌ను బదలాయించి సినిమా హాల్‌గా మార్చుకోకుండా సినిమా హాల్ నిర్వహిస్తున్నారు. అదే విధంగా సినిమా హాల్ నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవని దాన్ని తక్షణమే నిలిపివేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మండల తహశీల్దార్ సుజన్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఇక్కడకు చేరుకొని థియేటర్‌ను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజయ్ కుమార్‌రెడ్డి, ఆర్ఐ పీవీ రమణయ్య, వీఆర్వో పూజిత, మహిళా పోలీసు అనూష తదితరులు పాల్గొన్నారు.

## రుణాలు తీసుకునే లబ్ధిదారులు యూనిట్ నెలకొల్పాలి

**- ఎంపీడీఓ మహబూబ్ భాషా**



**వెలిగండ్ల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మండలంలో బీసీ, ఈడబ్ల్యూఎస్ రుణాలకు సంబంధించి బల్లవరం, హుస్సేన్‌పురం, వెలిగండ్లలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులతో ఆయా గ్రామాలకు వెళ్లి ఎంపీడీఓ మహబూబ్ భాషా శుక్రవారం వెర్ఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహబూబ్ భాషా మాట్లాడుతూ రుణాలు పొందిన వారు ఖచ్చితంగా యూనిట్ ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఇంటింటికి తిరిగి దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఒంగోలు అన్నమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రావణ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## వీఎస్ఆర్అండ్ఏఎం డిగ్రీ కళాశాలలో ఫేర్వెల్ వేడుకలు




**మార్టూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మార్టూరులోని వీఎస్ఆర్అండ్ఏఎం డిగ్రీ కాలేజీలో ఫేర్వెల్ వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మంచి మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వీరగంధం శ్రీనివాస్, హైస్కూల్ హెడ్మాస్టర్ పి.సురేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్టూరు, ఇసుక దర్శి గ్రామాల్లో టామోట పైర్లను సందర్శించిన అధికారులు



**మార్టూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మార్టూరు మండలంలోని మార్టూరు, ఇసుక దర్శి గ్రామాలకు సంబంధించి టమోటా పంట సాగు పద్ధతులు, సాగు ఖర్చులు, దిగుబడి, మార్కెట్ రేట్లను డీడీ మార్కెటింగ్ కే.రూఫస్ రాణి, ఏడీ మార్కెటింగ్ రమేష్, ఉద్యాన అధికారి బి.హనుమంత్‌నాయక్ పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. రైతుల వద్ద నుంచి సమాచారం తీసుకున్నారు. గత కొంత కాలంగా మార్కెట్‌లో రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేకుండా రైతులు నష్టపోతున్నారని ఈ సందర్భంగా డీడీ మార్కెటింగ్ గుంటూరు వారు పేర్కొన్నారు. అందుకు ప్రభుత్వం తరుపున తగు చర్యలు చేపడతామని రైతులకు తెలియజేశారు.

## మాతృభాష కమ్మనైన భాష

**- విశ్రాంత మండల విద్యాశాఖాధికారి రాఘవరావు**



**మద్దిపాడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మాతృభాష అమ్మ పెట్టిన గోరుముద్ద కన్నా కమ్మనైనదని విశ్రాంత మండల విద్యాశాఖాధికారి పి.రాఘవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తూర్పు ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత మండల విద్యాశాఖాధికారి పి.రాఘవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతృభాష అమ్మ పెట్టిన నేతి గోరు ముద్ద కన్నా కమ్మనైనదని, ప్రతి రాష్ట్రంలో ప్రాంతీయ భాషకు ప్రాముఖ్యతను ఇచ్చి విద్యాబోధన చేపట్టాలని ఆయన అన్నారు. దేశభాషలందు తెలుగులెస్స అని అమ్మ భాషలో కమ్మని తీయదనం ఉందని అన్నారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లూరి నరసింహారావు అధ్యక్షత వహించారు. అనంతరం బహుభాషా కోవిదుడైన విశ్రాంత ఉపాధ్యాయుడు షేక్‌షఫీను సత్కరించి జ్ఞాపిక బహుకరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘం మండల అధ్యక్షులు, కార్యదర్శులు దేవరశెట్టి యల్లమంద, నేలటూరి సత్యనారాయణ, గంగిశెట్టి నరసింహారావు, కాకుమాను సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన టీడీపీ మండల అధ్యక్షుడు



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కుఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం మండల పరిధిలోని వీరారంపురం గ్రామంలో జరుగుతున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఆలకిష, మండల గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప్పుటూరి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ కనమర్లపూడి వెంకటనారాయణ, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య గ్రామంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలేరమ్మ తల్లి దేవాలయానికి వైద్యులు శ్రీనివాసరావు రూ.2 లక్షలు అందజేత



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని అంబేద్కర్ నగర్ నందు గల పోలేరమ్మ తల్లి దేవాలయానికి దాత మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు రూ. 2లక్షలను శుక్రవారం నాడు ఆలయ అభివృద్ధి ప్రతినిధి మార్పుడి శ్రీనివాసరావుకు అందజేశారు. సంతనూతలపాడుకు చెందిన బల్లికురవ వెంకటరావు కుమారుడు శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏరియా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ బల్లికురవ శ్రీనివాసరావు స్వచ్ఛందంగా ఆలయ అభివృద్ధికి రెండు లక్షల రూపాయల నిధులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పలతోటి శివరామకృష్ణ స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి ప్రతినిధులు బి.ఏడుకొండలు, కిషోర్, రామకృష్ణ, వై.శ్రీనివాసరావు, ఎన్.బాబు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు కంప్యూటర్ వితరణ



**మార్టూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

కౌండిన్యఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు, చైర్మన్ ఈవీ నారాయణ మండలంలోని కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకు ప్రధానోపాధ్యాయులు జి.బాలకృష్ణకి సుమారు రూ.3లక్షల విలువ గల కంప్యూటర్‌ను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా నారాయణకు పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ఈవీ నారాయణ గత రెండు సంవత్సరాల నుండి తమ ట్రస్టు తరుపున పదో తరగతి పబ్లిక్ పరీక్షల నందు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, ఉపకార వేతనాలు అందజేయచున్నారు. అదే విధంగా 2025 మార్చి నెలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నందు అత్యధిక మార్కులు సాధించిన వారికి, 360 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు అందరికి తమ ట్రస్టు తరుపున ఉపకార వేతనాలు అందజేయుటకు హామీ ఇచ్చారు. ఈవి నారాయణ ఉదార స్వభావంను కొనియాడుతూ గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ టి.నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు కే.రామకోటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా ప్రభుత్వ వాటర్ ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులు ధ్వంసంపై చర్యలు చేపట్టాలి



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

సంతనూతలపాడులోని పెద్ద బజార్ సమీపంలో గల సాయిబాబా సత్సంగ కేంద్రం ఎదురు వైపున ఉన్న గ్రామ పంచాయతీ వాటర్ ప్లాంట్‌ను కొందరు ప్రైవేటు వ్యక్తులు ధ్వంసం చేసి దానిని తీసుకెళ్తే నేటి వరకు వారిపై గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంకే సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ కంఠం సర్వే నెంబరు 99/1లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాల క్రితం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సాధనికులు కొందరు ధ్వంసం చేసి మిషన్లు కూడా తీసుకెళ్లారని నేటి వరకు దానిని పట్టించుకోకపోవడంపై సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సుబ్బారావు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు దీని పట్ల నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం మరింత దారుణం అన్నారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే చర్యలు లేకపోవడం పట్ల బీజేపీ రాష్ట్ర నేత సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తికి సంబంధించిన ధ్వంసం చేసిన వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సుబ్బారావు డిమాండ్ చేశారు.

## ఘనంగా మాతృభాషాదినోత్సవ వేడుకలు



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి21,ప్రభాతవార్త**

యర్రగొండపాలెంలో ప్రభుత్వ,ప్రవేటు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా మాతృ భాషాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.యర్రగొండపాలెం మండంలోని వైకొత్తపల్లె గ్రామంలోని యంపియుపిఎస్ స్కూల్ నందు ప్రపంచ మాతృభాషాదినోత్సవ వేడుకలు ఘనంగా ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా యర్రగొండపాలెం మండల విద్యాశాఖదికారి పి.ఆంజనేయులు హజరైనారు.ఈ సందర్భంగా యంఇవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టుకతోనే తల్లి ఒడిలోనే కొంత భాషా పరిజ్ఞానం కలిగి వుంటారనీ ఎన్ని ఇతర భాషలు నేర్చుకున్నా పరభాషా వ్యామోహంలో మాతృభాషను మరువరాదనీ,మాతృబాషను ప్రేమించని వారు మరచిపోయిన వారు తల్లిని మరచినట్లేనన్నారు.తెలుగు భాషకు గిడుగు రామమూర్తి గారి సేవలు కొనియాడారు.విద్యార్థి దశనుంచే మాతృభాషపై మంచి పట్టు సంపాదించుకోవాలనీ ఉపాధ్యాయులుఅందుకు తగిన విదంగా తర్ఫీదునివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముందుగా సరస్వతీదేవీ,తెలుగుతల్లి,గిడుగురామూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.పాఠశాల విద్యార్థులు తెలుగుతల్లి, గిడుగురామమూర్తి పంతులు,తెలుగింటి ఆడపడుతుల వేషాలతో మంచి సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలరించారు.ఈ కార్యక్రమంలో యంఇవో2 మల్లూనాయక్,పాఠశాల ఉపాధ్యాయులు బాబుల్ నాయక్,ఆత్మానంద ప్రభాకర్ జివివి నారాయణ, శ్రీనివాస్ యం.శ్రీకాంత్,సిఆర్‌పిలు మూర్తి,కోటేశ్వరరావు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలాజీ హైస్కూల్ 36వ వార్షికోత్సవం

**- తక్కువ ఫీజులతో నూతన బోధన విధానం**

**- ఐఐటీ, నీట్, ఇంజనీరింగ్‌న సీట్లు సాధించడమే పాఠశాల ధ్యేయం**

**- కొండారెడ్డి లక్ష్మీరెడ్డి**



**సంతమాగులూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

గత36 సంవత్సరాల నుండి సంతమాగులూరు మండలంలోని చుట్టు పక్కల గ్రామల విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతి సంవత్సరం నూతన విధానంలో విద్యాను బోధించి ఐఐటీ, నీట్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలలో సీట్లు సాదించడమే పాఠశాల ధ్యేయం అని బాలాజీ హైస్కూల్ కరస్పాండెంట్ కొండారెడ్డి లక్ష్మీ రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాల 36వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ కరిమున్, ప్రిన్సిపాల్ రాము, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మండల పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డిని సన్మానించిన వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి



**సీఎస్‌పురం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

వైఎస్సార్‌సీపీ నూతన మండల అధ్యక్షునిగా నియమితులైన పాలుగుళ్ల మల్లిఖార్జునరెడ్డిని ఆయన కార్యాలయంలో శుక్రవారం వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరు నాయకులను కలుపుకుని సమిష్టిగా కృషి చేస్తానన్నారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన బాధ్యతను నెరవేర్చుతానని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయపథంలో నడిచేలా పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, ముత్యాల భారతీనారాయణరెడ్డి, మితికాల గురవయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డిలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దు వెంకటరెడ్డి, బసివి చంద్రశేఖర్, గడ్డం రంగారెడ్డి, పీరం వెంకటేశ్వర్లు, దుగ్గిరెడ్డి కృష్ణారెడ్డి, పాలుగుళ్ల శశి, రమణారెడ్డి, ఇండ్ల బాలయ్య, పలువురు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న నేరెళ్ల కిషోర్ గుప్తా



**తాళ్లూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మండలంలోని తూర్పు గంగవరానికి చెందిన జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం సెక్రటరీ, జిల్లా ఆర్యవైశ్య ఉపాధ్యక్షుడు నేరెళ్ల కిషోర్ గుప్తా బెస్ట్ ఎంప్లాయ్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. గురువారం దుబాయిలో నిర్వహించిన టాటా లైఫ్ ఇన్సూరెన్స్ అవార్డ్స్‌లో బెస్ట్ ఎంప్లాయ్ ఇంటర్నేషనల్ అవార్డు ఇన్సూరెన్స్ చీఫ్ ఏజన్సీస్ ఆఫీసర్ రాకేష్ శర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆర్యవైశ్య సంఘ నాయకులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మరెన్నో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

# భక్తిశ్రద్ధలతో చండీ హోమం

**- కన్నుల పండువగా గరుడ వాహన సేవ, గ్రామోత్సవం**



**సీఎస్‌పురం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లో భాగంగా రెండో రోజు శుక్రవారం వేద మంత్రాతో రుత్వికులు చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ, పప్పు శ్రీకాంత్‌లు నారాయణస్వామి వారికి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రికి స్వామివారికి పల్లకిసేవ, శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి స్వామివారికి గరుడ వాహనంపై గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు, కొమినేని వెంకటరావుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం, వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉభయ దాతలు హరిబాబు, టి.వెంకటరమణయ్య, లక్ష్మీనారాయణ, జానకి, శివకుమారి, హేమలత భక్తులు పాల్గొన్నారు.

## నారాయణస్వామి ఆలయ ముఖద్వారానికి వెండి తొడుగు అందజేత





**సీఎస్‌పురం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ముఖద్వారం దర్వాజకు సుమారు 30 కేజీల వెండితో చేసిన తొడుగును దాతలు సమకూర్చారు.ఈ సందర్భంగా శుక్రవారం దాతలు మంగపేటకు చెందిన బొల్లా వెంకటేస్వామి, బొల్లా వెంకట సుబ్బయ్యలు వారి ప్రతినిధులు పోకా వినోద్ కుమార్, బహునాధం శివప్రసాదాచారిల చేతుల మీదుగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో ఆలయ ఈవో, చైర్మన్‌కు అందజేశారు.

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే :

మహాశివరాత్రి సందర్భంగా నారాయణస్వామి ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో, చైర్మన్‌లకు పలు సూచనలు చేశారు. తాగునీరు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని వెంకటరావు, బొబ్బూరి రమేష్, చావా సుబ్బయ్య, షేక్ రజ్జబ్ భాషా, ఎన్‌సీ మాలకొండయ్య, స్థానికులు పాల్గొన్నారు.

## మరోసారి వైసీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన యక్కంటి శ్రీనివాసరెడ్డి



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హనుమంతునిపాడు మండల అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసరెడ్డి మరో సారి ఎన్నికయ్యారు. ఆ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమపై నమ్మకంతో మరో సారి మండల పార్టీ అధ్యక్షుడిగా తమను నియమించిన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ నాపై నమ్మకం ఉంచి నా నియామకానికి సహకరించిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణయాదవ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతుగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బర్డ్ ఫ్లూ జాడ మన ప్రాంతంలో లేదు

**- పశువైద్యాధికారి అమూల్య**



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

మన ప్రాంతంలో కోళ్లల్లో బర్డ్‌ఫ్లూలేదని నిర్భయంగా చికెన్, గుడ్లు తినవచ్చునని కొనకనమిట్ల పశువైద్యాధికారి అమూల్య అన్నారు. మన జిల్లాలో బర్డ్ ఫ్లూ జాడ లేదని, చికెన్ ప్రియులు భయపడనవసరం లేదన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే కోళ్లను, గుడ్లను దిగుమతి చేసుకోరాదని, ఈ ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదన్నారు. చికెన్ దుకాణదారులు ఇతర జిల్లాల నుంచి వచ్చే కోళ్లను కొనుగోలు చేయవద్దని సూచించారు. ఇప్పటికే ఉన్నతాధికారుల జిల్లాల సరిహద్దులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారన్నారు. మండలంలో ఉన్న కోళ్లఫారాలను పరిశీలించి తనిఖీలు చేయనున్నట్లు చెప్పారు.

## రైతులను ఆదుకోవడమే మన ప్రభుత్వ ప్రధాన ధ్యేయం



**కురిచేడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

రైతులు వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రతి రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని దర్శి టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. శుక్రవారం నాడు మండలంలోని బోధనంపాడు గ్రామంలో టమోటా పైరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు గిట్టుబాటు ధర లేకపోతే ఆర్థికంగా ఎంతో నష్టపోతారని ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక విధాలుగా కృషి చేస్తూ గిట్టుబాటు ధరకై ప్రయత్నిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 25శాతంగా ఉన్న కొనుగోలు సీలింగ్ నిబంధనలను తొలగించి 75శాతం కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టారన్నారు. అదే విధంగా దర్శి నియోజకవర్గంలో కూరగాయాలు పండించే రైతులను ఆదుకునేందుకు తాను కృషి చేస్తానన్నారు. త్వరలో దర్శిలో కోల్డ్‌స్టోరేజీ నిర్మించి రైతులకు మరింత సౌకర్యాన్ని కల్పిస్తానన్నారు. అంతే కాకుండా రైతు బజార్లలో టమోటా అమ్మేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంట సాగులో రైతులకు ఇబ్బందులు కలిగినట్లయితే ప్రభుత్వ పరంగా వారిని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నాయకులు కడియాల లలిత్ సాగర్, కురిచేడు మండల టీడీపీ అధ్యక్షులు పిడతల నెమిలయ్య,మాజీ అధ్యక్షులు కాట్రాజునాగరాజు, నాయకులు మొగల్‌మస్తాన్‌వలి, కాళ్ల వెంకటేశ్వర్లు,కోటయ్య,టామోటా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలి

**- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు**



**తాళ్లూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

రైతులందరూ విశిష్ట గుర్తింపు కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లావ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని శివరాంపురం, తాళ్లూరు-1,2 రైతు సేవా కేంద్రాలను పరిశీలించి ఫార్మర్ రిజిస్టర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఆధార్, పొలం పాస్ పుస్తకం, ఆధార్ లింకైన ఫోన్ తీసుకొని తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సబ్సిడీ విత్తనాలు, భీమా, పంట నష్ట పరిహారం, పంట రుణాలు తదితరాలు రానున్న రోజుల్లో ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే దక్కుతాయన్నారు. రైతులకు బాసటగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్దిని ఈ నెల 24వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదురావు, వీఏఏలు రాజశేఖర్‌రెడ్డి, వెంకట్రావు, నాగరాజు నాయక్, అశోక్, రైతులు పాల్గొన్నారు.

## పుట్టుకతో వచ్చే దివ్యాంగత్వంను నయం చేయవచ్చు



**సీఎస్‌పురం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

పిల్లల్లో పుట్టుకతో వచ్చే దివ్యాంగత్వంను నయం చేయించుకోవచ్చని సీహెచ్ఓ గంధం శామ్యేల్ అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం మండల కేంద్రమైన సీఎస్‌పురంలో నిర్వహించిన ఇంటింటా సర్వే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాదికార సంస్థ ఆదేశాల మేరకు పిల్లల్లో పుట్టుకతో వచ్చిన దివ్యాంగత్వాన్ని గుర్తించడానికి ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. చిన్న వయస్సులోనే వచ్చిన దివ్యాంగత్వాన్ని చికిత్స ద్వారా తొలగించవచ్చని, చికిత్స అవసరమైన పిల్లలకు ప్రభుత్వం ద్వారా తగిన సహాయం అందించేందుకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాలల ఆరోగ్యం కొరకు ప్రభుత్వాలు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రజని, మెహరున్ పాల్గొన్నారు.

## ప్రజల కోసం ప్రజాసేవకురాలుగా నిరంతరం కృషిచేస్తా

### - టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



దర్శి నియోజకవర్గ ప్రజల కోసం ప్రజా సేవకురాలుగా నిరంతరం కృషి చేస్తానని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శిలోని 15వ వార్డు, సాయినగర్ నందు సీసీ రోడ్డు శంకుస్థాపనలో గొట్టిపాటి లక్ష్మి పాల్గొని పనులను ప్రారంభింపచేశారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ మన ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు కనీస అవసరాలు తీర్చే లక్ష్యంగా ఎనిమిది నెలల పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా ముందుకు వెళ్తుందని వివరించారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే గుంతలు లేని రోడ్లకు శ్రీకారం చుట్టామని, గ్రామాల్లో రోడ్లన్నీ డ్రైన్‌లన్నీ పూర్తి చేసుకునే కార్యక్రమానికి నాంది పలికామన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు పనులు ప్రారంభించుకున్నామన్నారు. రోడులన, డ్రెయిన్‌లు మంచినీటి వంటి మౌలిక సదుపాయాల కల్పనకు మన ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఈ సందర్భంగా తెలియజేశారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నిరద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు మెగా డీఎస్సీని ప్రకటించడం నిరుద్యోగ యువతకు ఎంతో సంతోషకరమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కనీస ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మున్సిపల్ చైర్మన్ మహేష్, కౌన్సిలర్లు మల్లేశ్వరి, రాంగిరి, వలిబాబు, టీడీపీ నాయకులు వాసు, సురేష్, మహిళలు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## 8వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

**దర్శి,ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



దర్శి మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు మహిళలు వాటర్ పైపులైన్ ఉంది కాని నీరుసరగ్గా రావడం లేదని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. వాటిని పరిశీలించి, ఇది పాతవి కావడంతో ఈ సమస్య ఏర్పడిందని వెంటనే కొత్త పెన్షన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. అలాగనే మరికొన్ని చోట్ల సీసీ రోడ్లు సైడు కాలువలు ఏర్పాటు చేసే విధంగా అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మహేష్, మున్సిపల్ ఏఈ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవ, 8వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

## దర్శిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

**దర్శి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



పట్టణంలోని చెంచు కాలనీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని మలేరియా సబ్ యూనిట్ అధికారి నరావుల బసవారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల కాటు ద్వారా వచ్చే వ్యాధుల గురించి, అవి రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటిలో బయట నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక సారి(శుక్రవారం) నీరు నిల్వ ఉంచే ప్రాంతాలన్నింటిని శుభ్రంగా కడుక్కొని, నీరు నింపుకోవాలన్నారు. దోమతెరలు వాడాలన్నారు. పరిసరాలను పరిశీలించారు. దర్శి నియోజకవర్గ క్షయ వ్యాధి సూపర్‌వైజర్ సాయి మాట్లాడుతూ క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, 2 రోజులకు మించి దగ్గు, జ్వరం ఉన్న వెంటనే సీహెచ్‌సీ దర్శికి వెళ్లి కళ్లె పరీక్ష చేయించుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో దర్శి పీహెచ్‌సీ మహిళా సూపర్‌వైజర్ సుభాషిణి, ఏఎన్ఎం రమణ, ఎంఎల్‌హెచ్‌పీ షారోన్, ఆశా కార్యకర్త సుశీలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవ వేడుకలు

**దర్శి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



దర్శిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ప్రభుదాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా డాక్టర్ ఏ.నగేష్, డాక్టర్ గంధం వేణు, డాక్టర్ నరేష్ కుమార్, సీహెచ్ ప్రవీణ, వైవీ రమణ, కళాశాల సీపీడీసీ మెంబర్ జీవిరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాతృభాష గొప్పతనం గురించి వివరించారు. తల్లిని గౌరవించినట్లే మన భాషను కూడా గౌరవించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దోపిడి లేని సమాజమే సీపీఎం లక్ష్యం

**దర్శి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



అధ్యయనం చేద్దాం సమాజాన్ని మార్చుదాం అనే లక్ష్యంతో కమ్యూనిస్టు పార్టీలు, వామపక్షాలు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న రెడ్‌బుక్ జరుపుతుందని అందులో భాగంగా దర్శి సుందరయ్య భవన్‌లో కామ్రేడ్ లెనిన్ రచించిన రాజ్యం- విప్లవం బుక్‌పై అధ్యయనం చేసి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తాండవ రంగారావు బుక్ వివరించుతూ దోపిడి లేని సమాజమే లక్ష్యంగా సీపీఎం పని చేస్తుందని ప్రపంచంలో మొదటి సోషలిస్టు విప్లవ రథసారధి లెనిన్ రచించిన 1916లో రాజ్యం విప్లవం బుక్‌లో వివరించారు. భారతదేశంలో పెట్టుబడిదారుల ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల ద్వారాదారాదత్తం చేస్తున్నారు, కార్మిక చట్టాలను రద్దు చేస్తూ 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్మిక వర్గాన్ని అణిచి పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేవీ పిచ్చయ్య అధ్యక్షత వహించగా చిరుపల్లి అంజయ్య, ఆర్.రామకోటిరెడ్డి, ఉప్పు నారాయణ, గోగు వెంకయ్య, గర్నెపూడి జాన్ సామ్యేల్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మండలంలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి

**ముండ్లమూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంను జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా పెద్దఉల్లగల్లు, కెల్లంపల్లి గ్రామ పంచాయతీలలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వద్ద కు వెళ్లి చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వద్ద నిర్వహించాల్సిన కార్యక్రమాలు, చేయాల్సిన పనులను, రికార్డులను గురించి వివరించారు. కమీషనర్ ఆదేశాల మేరకు నేడు, రేపు ప్రతి గ్రామంలో ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్‌కు హాజరై ప్రతి ఇంటిని సందర్శించాలని తెలియజేశారు. సదరు విషయంను ముండ్లమూరు మండలం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలోని ప్రతి అధికారులకు తెలియపరిచి ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జనార్దన్, ప్రభుత్వ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పాత ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన తహశీల్దార్ లక్ష్మీనారాయణ

**ముండ్లమూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని మారెళ్ళ గ్రామంలో ఖాళీగా ఉన్న పాత ఆరోగ్య కేంద్రాన్ని తహశీల్దార్ లక్ష్మీనారాయణ శుక్రవారం పరిశీలించారు. ప్రజా పరిష్కార వేదికలో ఆ గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత ఆరోగ్య కేంద్రం పెంకుటిల్లును పొట్టి శ్రీరాములు మ్యూజియంగా ఇవ్వాలని కోరారు. ఆ పెంకుటిల్లు ను తహశీల్దార్ శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలం ఒబన్నపాలెం గ్రామంలో జి.త్రావణికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.47,297ల చెక్కును సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ అందజేశారు. శుక్రవారం లబ్ధిదారు ఇంటికి వెళ్లి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, మండల సెక్రటరీ కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, సర్పంచన వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు అందయ్య, జాన్సన్, శ్రీనివాసరెడ్డి, మెట్టు సుబ్బయ్య నాయుడు, స్వర్ణ కిషోర్, పల్లపోతు సాయి వరణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పందిళ్లపల్లి హైస్కూల్లో తెలుగుభాషా దినోత్సవం

**వేటపాలెం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మండలంలోని పందిళ్లపల్లి హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు ఎం.శేఖరరావు అధ్యక్షతన తెలుగుభాషా దినోత్సవ వేడుకలను శుక్రవారం పండుగలా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక, సృజనాత్మకపోటీలను నిర్వహించారు. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శేఖరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలతో మమేకమై ఈవిధంగా మాతృభాష, అఫీషియల్ లాంగ్వేజ్అయిన హిందీ, కమ్యూనికేషన్ లాంగ్వేజ్ అయిన ఇంగ్లీష్, ఇలా మూడు భాషలకు సంబంధించి ఒక పండుగ వాతావరణంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీయవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ చెరుకూరి రాంబాబు, బండ్ల భారతి, ఓల్డ్ స్టూడెంట్స్ సొసైటీ అధ్యక్షులు ఊటుకూరి శ్రీమన్నారాయణ, సెక్రటరీ దశరథరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ కడెం రాయుడులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయని, కార్యక్రమం నిర్వహించి ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శంఖం లలితా పరమేశ్వరి, ఉమ్మిటి వేణుగోపాలరావు, సీహెచ్ భవాని దేవి, వీఎల్ నరసింహం, నీలిమ, చైతన్య, నిర్మల, ఉపాధ్యాయులు నాగరాజు, వై.రత్నం తదితరలు పాల్గొన్నారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవ వేడుకలు

**చీరాల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



చీరాల ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25వ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా చీరాల పురపాలక సంఘం నందు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, తూర్పు పాకిస్థాన్‌లో బెంగాలీ మాతృభాష పరిరక్షణ ఉద్యమంలో పోలీసు కాల్పులలో అమరవీరులైన ఢాకా విశ్వవిద్యాలయంకు చెందిన నలుగురు విద్యార్థుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. మన మాతృభాష తెలుగుకి ప్రధాన గుర్తింపు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, సెక్రటరీ చారగుళ్ళ గురు ప్రసాద్,గ్రంధి నారాయణమూర్తి,గుద్దంటి రమేష్‌బాబు,చింతా రమేష్, దేగల తిరుపతిరావు, సుబ్బారావు, సత్యనారాయణ, రవి, నరసింహారావు, చెంగలరాయుడు, జీవై ప్రసాద్, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## మలేరియా వ్యాప్తిని నిర్మూలిద్దాం

**చీమకుర్తి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మలేరియా వ్యాప్తిని అదుపు చేయటానికి ప్రతి ఒక్కరు అవగాహనతో ముందుకు నడవాలని జిల్లా మలేరియా అధికారి ఎన్ మధుసూదన్ రావు కోరారు. చీమకుర్తి మండలం, రామ తీర్థం వద్ద ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా పాఠశాలను సందర్శించి లార్వా నిర్మూలన, దోమల వ్యాప్తిని అరికట్టడం వంటి అంశాలను వివరించారు. స్థానిక కాల్వ నీటి గుంటలలో లార్వాను తినే చేపలను విడిచిపెట్టారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

**చీమకుర్తి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

చీమకుర్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.ఫ్లొరెన్సు గురువారం ఒక ప్రకటన తెలియజేశారు.మార్చి 6 తేదీ వరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగలరు. ఏప్రిల్ 6 తేదీన ప్రవేశ పరీక్ష ఉందని తెలియజేశారు. ఇతర వివరాలకు పాఠశాలకు సంప్రదించాలని సూచించారు...

## మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**చీమకుర్తి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ చీమకుర్తి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణకు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ విధానం రద్దుచేస్తూ తీసుకున్న నిర్ణయం వలన కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పడం ద్వారా సకాలంలో జీతాలు అందువన్నారు. కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. లేనియెడల యూనియన్ ఇచ్చేటువంటి పిలుపుల్లో కార్మికులు కూడా భాగస్వాములు అవుతామని యూనియన్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.ఏడుకొండలు, పి.పద్మ యూనియన్ నాయకులు నరసయ్య, బి.ఏడుకొండలు, డి.వెంకటేశ్వర్లు, కోటేశ్వరి పాల్గొన్నారు.

## 50 ముస్లిం కుటుంబాలు టీడీపీలో చేరిక

**దర్శి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



దర్శి మండలం రాజంపల్లికి చెందిన 50 ముస్లిం కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వైసీపీ నాయకులు షేక్ మహబూబ్ జానితో పాటు 50 కుటుంబాలు శుక్రవారం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, యువ నాయకులు కడియాల లలిత్ సాగర్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి లక్ష్మి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, రాజంపల్లి గ్రామ నాయకులు దామా కృష్ణా, ఫణిదపు వెంకటరామయ్య, నాగమణి, ఒంగోలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, నీటి సంఘం డీసీ అధ్యక్షులు కామిరెడ్డి వెలుగొండారెడ్డి, ముస్లిం సోదరులు అల్లాబక్షు, టెంట్ హౌస్ సుభాణి, బట్టల షాపు సుభాణి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, రాజంపల్లి గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**టంగుటూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



టంగుటూరు మండలంలోని తూర్పు నాయుడుపాలెంలో నియోజకవర్గ తహశీల్దార్లతో మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ రీ సర్వేను అత్యంత పకడ్భందీగా నిర్వహించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన ఫ్రీ హోల్డ్ ల్యాండ్స్ అక్రమాల గుర్తించాలన్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల కోసం అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. పరిశ్రమలకు భూములు కేటాయించే అంశంలో రైతులు, కలెక్టర్‌తో సంప్రదించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కేటాయింపులు జరపాలన్నారు. గృహ రుణాలకు అవసరమైన పొజిషన్ సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రాలు ఆలస్యం చేయకుండా సకాలంలో అందించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో కుల, ఆదాయ, ధృవీకరణ పత్రాలు అందజేయాలన్నారు.

## రైతు గుర్తింపు నమోదును పరిశీలించిన డిప్యూటీ డైరక్టర్

**టంగుటూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మండలంలోని అనంతవరం, టంగుటూరు, ఎంనిడమానూరు, పొందూరు గ్రామాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని డిప్యూటీ డైరక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రమేష్, మండల వ్యవసాయాధికారి జి.స్వర్ణలతలు సందర్శించారు. రైతు విశిష్ఠ గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరక్టర్ అగ్రికల్చర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ పొలం ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈనెల 25వ తేదీ లోపల గుర్తింపు సంఖ్య కొరకు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## కనిగిరిలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు

**కనిగిరి, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త**




కనిగిరి సాంఘిక సంక్షేమ సహాయ సాంఘిక సంక్షేమాధికారి శివ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. కనిగిరిలోని ఎనిమిది వసతి గృహాల్లోని 180 మంది విద్యార్థులకు ఈ తరగతులను సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ తరగతుల ద్వారా విద్యార్థులకు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రేరణనిచ్చి, ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్, స్టేషనరీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ ఎన్.లక్ష్మానాయక్ ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు ఉత్తమ విజయం సాధించేందుకు విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి వసతి గృహ సంక్షేమాధికారి ఎస్.జయంతి, కే.చంద్రకుమారి, ఎస్‌వీకే శాస్త్రి, జి.సురేందర్, జి.మురళీకృష్ణ, బి.కిరణ్‌రాజ్, జేఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

## బాలల హక్కులు కాపాడటం అందరి బాధ్యత - ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి

**కనిగిరి, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త**



బాలల హక్కులు కాపాడడం అందరి బాధ్యతని ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంపై శుక్రవారం కనిగిరి డివిజన్ రెవెన్యూ ఆఫీసులో వివిధ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలందరికి విద్య వైద్యంతో పాటు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంగా బంగారు బాల్యం కమిటీలు పని చేస్తున్నాయని అన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అప్పుడే డ్రాపౌట్‌ను తగ్గించవచ్చని అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలనలో భాగంగా బాలకార్మిక వ్యవస్థను రూపుమాపే ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ మధ్య కాలంలో ముందస్తుగా బాల్య వివాహాలు నిలిపివేసినందుకు బంగారు బాల్యం కమిటీ సభ్యులను అభినందించారు. ప్రతి గ్రామంలో జరుగుతున్న వివాహాలను నమోదు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో కిశోర బాలికల క్లబ్‌లు ఏర్పాటు చేసి పౌష్టికాహారం, సామాజిక రుగ్మతల, ఆరోగ్యం మీద అవగాహన కల్పించాలన్నారు. బంగారు బాల్యం ఫోగ్రాంలో 0–18 లోపు పిల్లల సర్వేకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలల హక్కులకు భంగం కలిగిస్తే ఎవరిని వదిలిపెట్టేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి బంగారు బాల్యం, మిషన్ శక్తి టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి

### - జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు గయాజ్

**కనిగిరి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మోడల్ స్కూల్ విద్యార్థులు పది పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు షేక్ గయాజ్ భాషా కోరారు. శుక్రవారం కనిగిరిలోని మోడల్ స్కూల్ నందు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి తులసి ఆధ్వర్యంలో జరిగిన పదో తరగతి విద్యార్థుల మోటివేషన్ తరగతిలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని వ్యసనాలకు ప్రలోభాలకు దూరంగా ఉండి పాఠశాలలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందించే పదో తరగతి గైడెన్స్‌ను పొంది మంచి ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ క్రమంలో మధ్యలో పాడిన గేయాలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. భోజన సమయాన్ని మరచిపోయి ఎంతో ఆసక్తిగా విద్యార్థులు విన్నారు. గీతాలపనకు, మోటివేషన్ కాలాన్ని కూడా మర్చిపోయారు. విద్యార్థినీ, విద్యార్థులు మంచి మార్కులతో పాస్ అవ్వాలని ఆకాంక్షిస్తూ స్కూల్లో ఫస్ట్ మార్కులు సాధించిన వారికి ఎస్ఎంసీ చైర్మన్ పందిటి మోహన్ రూ.5వేలు బహుకరిస్తామని తెలిపారు. అనంతరం కెమిస్ట్రీ లెక్చరర్ సతీష్ పదవ తరగతి విద్యార్థినీ,విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు బహుకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఉగ్ర

**కనిగిరి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన కనిగిరి కొండపై వెలసిన శ్రీ పార్వతి సమేత శ్రీ విజయ మార్తాండేశ్వరి దేవస్థానం మహాశివరాత్రి వేడుకల ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా మహాశివరాత్రి కళ్యాణ మహోత్సవం ప్రచార కరపత్రాన్ని ప్రకాశంజిల్లా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి దేవస్థానం పాలకవర్గ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, భక్తులు హాజరయ్యారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, శుభ్రత, పార్కింగ్, మెడికల్ సదుపాయాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, విజయ మార్తాండేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గొంట్లా మల్లిఖార్జునరావు, గౌరవ అధ్యక్షులు ఐవీ నారాయణ, కోట సురేష్, కొలిపర్తి మారుతి కుమార్, శ్రీ విష్ణు రైస్ ట్రేడర్స్ అధినేత రాచపూటి వెంకటేశ్వర్లు, ఒలేటి చిన్న, దర్శి వెంకట సుబ్రహ్మణ్యం, యువరాజ్, వెంకటేశ్వర్లు, అద్దంకి రంగా రాచర్ల వెంకట నరేష్, ఇతర ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు. మహాశివరాత్రి వేడుకలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించేలా దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన వైసీపీ నాయకులు

**కనిగిరి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**



మహాశివరాత్రి సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో కనిగిరి గార్లపేట రోడ్డులోని ఓల్డ్ ఏజ్ హోమ్ వెనుక నిర్వహించిన కనిగిరి నియోజకవర్గ స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కనిగిరి మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. కనిగిరి మండల పార్టీ అధ్యక్షులు జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ ఆటలో గెలుపోటములు సహజమని ఓటమి నుంచి గెలుపు దిశగా పయనించేలా జట్లు సాధన చేయాలన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు 40 టీములు ఈ టోర్నమెంట్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి కనిగిరివైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణయాదవ్ రూ.23,456, రెండో బహుమతి యువజన విభాగం అధ్యక్షులు వాకమళ్ల రాజశేఖర్‌రెడ్డి రూ.12,345, మూడో బహుమతి ఆర్టీఐ విభాగం అధ్యక్షులు తూము కృష్ణారెడ్డి రూ.5678 అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీ సూరసాని మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాంఢ్లపర్తి ఆదినారాయణరెడ్డి, పీసీపల్లి మండల అధ్యక్షులు గోపవరపు బొర్రారెడ్డి, కనిగిరి మున్సిపల్ వైసీపీ నాయకులు సిరుపగోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, సంగటి మహేంద్రరెడ్డి, నాగమణి, గూడూరి లింకన్, గొల్లపల్లి సర్పంచ్ నారాయణరెడ్డి, గురువాజీపేట సర్పంచ్ కుమ్మరికుంట రవి, మడతల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 23న బీసీ ఐక్యవేదిక నూతన కమిటీ ఎన్నిక

**కనిగిరి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ స్థాయి బీసీ ఐక్యవేదిక నూతన కమిటీ ఎన్నికలు ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఆదివారం ఉదయం 10గంటలకు కనిగిరి పట్టణంలోని ఆకృతి షాపింగ్ మాల్ పక్కన గల బృందావనం ఫంక్షన్ హాల్ నందు జరుగుతుందని వారు తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని బీసీలలోని అన్ని కులాల బీసీ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## ఆంజనేయులుకు నివాళులర్పించిన పార్లమెంటు సభ్యులు తెన్నేటి

**చీరాల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త**




టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు నక్కల ఆంజనేయులు ఇటీవల మరణించారు.ఈ సందర్భంగా బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ పందిళ్లపల్లిలోని వారి నివాసానికి వెళ్లి ఆంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

22-2Pg5.qxd:22-2Pg5.qxd 01/01/01 8:07 AM Page 1



# ఎన్నికల ప్రక్రియలో విదేశీ జోక్యమా?

## డోజ్ వ్యాఖ్యలపై మండిపడుతున్న వివిధ పార్టీలనేతలు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** అంతర్జాతీయ అభివృద్ధికి నిధులు అందచేసే యుఎస్ఎయిడ్ భారత్‌లో ఓటర్ టర్నౌట్ పెంచేందుకుగాను 21 మిలియన్ డాలర్ల నిధిని అందించిందని ఎలాన్‌మస్క్ చేసిన వ్యాఖ్యలు ఆపై వీటన్నింటిని రద్దుచేస్తున్నట్లు ప్రకటించిన వైనంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. భారత అంతర్గత వ్యవహారాల్లో అమెరికా మితిమీరిన జోక్యం చేసుకుంటున్నదని దౌత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు. విదేశాంగశాఖ ఈ 21 మిలియన్ డాలర్ల ఇండియా ఫండ్‌పై స్పందించింది. కాంగ్రెస్ బిజెపిలమధ్య మాటలయుద్ధం పెరుగుతుండటంతో ఆయన స్పందించారు. భారత ఎన్నికల ప్రక్రియలో బయటిశక్తుల జోక్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేసారు. అయితే అధికార బిజెపి 2012లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఎ ప్రభుత్వం భారత్ కీలక సంస్థల్లోకి చొరబాట్లను సమ్మతించిందని, జాతిప్రయోజనాలను పణంగా పెట్టిందని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్‌నేతలు కూడా ఘాటుగానే స్పందించారు. యుఎస్ ఎయిడ్ ద్వారా ఒక్క బిజెపి మాత్రమే లబ్ధిపొందిందని అన్నారు. డోజ్ సంస్థ చీఫ్ టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని డోజ్ ఆడిట్‌లో అనేక ప్రభుత్వ ఏజెన్సీలకు వృధా నిధుల మంజూరును కోత విధించింది. సుమారు 486 మిలియన్ డాలర్లు ఎన్నికల కూటములు, ఎన్నికల ప్రక్రియను పటిష్టంచేసేందుకు వెచ్చించినట్లు చూపించడంతో వాటిని రద్దు చేసారు. మాల్డోవా లో సమ్మిళిత రాజకీయ ప్రక్రియలో భాగ స్వామ్యం కోసం 22 మిలియన్ డాలర్లు, 21 మిలియన్ డాలర్లు భారత్‌లో ఓటర్ల భాగస్వామ్యం పెంచే చైతన్యకార్యక్రమానికి వినియోగించినట్లు తేల్చింది. బిజెపికి చెందిన అమిత్ మాలవీయతోపాటు నలిన్‌కోహ్లీకూడా అమెరికా ఏజెన్సీ భారత్‌లో ఎన్నికల పనులకని 21 మిలియన్ డాలర్లు ఎందుకు ఇచ్చిందని ప్రశ్నించడంతోపాటు భారత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని అన్నారు. అయితే 2010 నుంచి 2012మధ్యకాలంలో పనిచేసిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎస్‌వై ఖురేషి ఈ క్లెయిమ్‌లను ఖండించారు. బిజెపి నేతల వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడం, మరింత పటిష్టంచేయడం వంటి వాటితోపాటు ఐఎఫ్ఆఎస్ వంటి సంస్థలతో ఎంఒయులు జరిగాయని, అవి ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయని వనరులను శక్తివంతం చేయడంకోసం ఈ నిధులు వెచ్చిస్తాయన్నారు. యుఎస్ఎయిడ్ ఇచ్చిన నిధుల్లో ఎక్కువ శాతం రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలోని స్వచ్ఛంద సంస్థలు రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కే వెళ్లాయని ఆరోపించారు.

డోజ్ సంస్థ బం గ్లాదేశ్‌కు కూడా 29 మిలియన్ డాలర్లు ఇచ్చినట్లు ప్రకటించింది. వీటిని కూడా రద్దుచేస్తామని ప్రక టించారు. తనను గద్దెనుంచి దించేందుకు విదేశీ శక్తుల హస్తం ఎంతో పని చేసిందని, ఒక ద్వీప్ కల్పం అప్పగించనందుకు అమెరికా తనను గద్దె నుంచి దించే కుట్రలు చేసిందని బంగ్లా మాజీ ప్రధాని హసీనా ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇపుడు డోజ్ సంస్థ ప్రకటించిన నిధుల జాబితా తనను గద్దెదించేందుకు వినియోగించారని ఆమె ఆరోపించారు.



# కేంద్రం ఏ భాషను నిర్బంధం చేయలేదు..

## స్టాలిన్ లేఖపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** కేంద్ర ప్రభుత్వం ఏ భాషను బలవంతంగా రుద్దడం లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. విదేశీ భాషపై అతిగా ఆధారపడటం వల్ల విద్యార్థులు భాషాపరమైన మూలాలను తెలుసుకోకుండా పరిమితం చేసినట్లవుతుందన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా ఈ పరిస్థితిని సరిచేసే ప్రయత్నం జరుగుతోందని మంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు. తమిళ భాష శాశ్వతమని గతంలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యను ప్రస్తావించిన మంత్రి తమిళ సంస్కృతి, భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యను రాజకీయం చేయవద్దని విజప్తి చేశారు. మోడీకి తమిళనాడు సిఎం లేఖ రాసిన నేపథ్యంలో మంత్రి నుంచి ఈ స్పందన వచ్చింది. సమగ్రశిక్షా పథకంకింద రాష్ట్రానికి రూ.2,152 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ప్రధాని మోడీ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరారు. ప్రధానికి రాసిన లేఖలో జాతీయ విద్యావిధానం - 2020ని పూర్తిగా అమలుచేసి త్రిభాషా విధానాన్ని ఆమోదించే వరకు తమిళనాడుకు సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయబోమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇటీవల వెల్లడించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోని విద్యార్థులు, రాజకీయ పార్టీలు, ప్రజల మధ్య ఆవేదన, ఆక్రోశం కలిగించిందని తెలిపారు. సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయకపోతే ఉపాధ్యాయులకు వేతనం, విద్యార్థులకు సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు దెబ్బతింటాయన్నారు. 2024,25వ ఏడాదికి రాష్ట్రానికి అందాల్సిన రూ.2.152 కోట్లను వెంటనే మంజూరు చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

# మహాయుతిలో తారస్థాయికి చేరిన లుకలుకలు!



**ముంబయి, ఫిబ్రవరి 21:** మహాయుతికూటమిలో అంతర్గత విభేదాలు పెరిగి పోతున్నాయి. అందుకు అనుగుణంగానే జరుగుతున్న కొన్ని సంఘటనలు ఇందుకు ఊతం ఇస్తున్నాయి. ప్రత్యేకించి డిప్యూటి సిఎం ఏక్‌నాథ్‌షిండే, ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవిస్‌లమధ్య దూరం పెరుగుతూ వస్తోంది. బిజెపి ఆధ్వర్యంలోని మహాయుతిలో బిజెపితోపాటు ఎన్సీపీ అజిత్ పవార్, ఏక్‌నాథ్‌షిండే శివసేనలు మిత్రులుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. బిజెపి అద్వితీయ మెజార్టీతో గెలిచినప్పటికీ అజిత్, షిండేలకు డిప్యూటి సిఎంలు కేటాయించిన బిజెపి హైకమాండ్ వీరిమధ్య చోటుచేసుకుంటున్న విభేదాలను మాత్రం సర్దుబాటు చేయలేకపోతోంది. నాయకులను బుజ్జగించలేకపోతోంది. తాజాగా ప్రభుత్వపరంగా ఏర్పాటు అయిన మూడు అధికారిక కార్యక్రమాల్లో ఏక్‌నాథ్‌షిండే పాల్గొనడకపోవడం నేతలమధ్య పొరపొచ్చాలు మరింతపెరుగుతున్నట్లు సూచిస్తోంది. థాణెజిల్లా బద్లాపూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ప్రారంభం కార్యక్రమంలో డిప్యూటిసిఎం ఏక్‌నాథ్‌షిండే పాల్గొనలేదు. మరాఠా కింగ్ జయంతి కార్యక్రమాల్లోను ఆయన పాల్గొనకపోవడం విభేదాలు మరింత పెరుగుతున్నాయి. అలాగే అంబేగాంవ్ బుద్రక్‌లో జరిగిన శివశృతి కార్యక్రమానికి కూడా రాలేదు. అలాగే ఆగ్రాఫోర్ట్‌లోజరిగిన చరిత్రాత్మక కార్యక్రమంలో కూడా షిండే పాల్గొనలేదు. ఈ మూడు కార్యక్రమాల్లోను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ పాల్గొన్నారు. రానురాను ఈ విభేదాలు మరింత తారస్థాయికి చేరాయి. శివసేనకు చెందిన ఎమ్మెల్యేలకు వై కేటగిరీ సెక్యూరిటీ కవర్‌ను మహారాష్ట్రప్రభుత్వం ఉపసంహరించింది. హోంశాఖ ముఖ్యమంత్రి ఫడ్నవిస్ చేతుల్లోనే ఉండటం ఇందుకు మరింత కారణం అయింది. ఈ చర్యతో శివసేన షిండేవర్గం తీవ్రంగా కలతచెందింది. 44 మంది ఎమ్మెల్యేలు, 11 మంది లోక్‌సభ ఎంపిలకు 'వై'కేటగిరీ భద్రతను కల్పించారు. ఆనాడు షిండే వర్గీయులు కావడంతో వీరిపై దాడులుజరగవచ్చున్న భావనతో వారికి భద్రతపెంచడంతోపాటు కీలకమైనవారికి కేబినెట్ బర్తులు కూడా ఇచ్చారు. ఆనాడు ముఖ్యమంత్రి హోదాలో ఎన్నికల్లో ప్రధానంగా లడ్కీబహిన్‌యోజన వివాదాలను పెంచింది. ఈ పథకానికి ముందు ముఖ్యమంత్రి అన్న పదాన్ని ఎన్సీపీ అజిత్‌వర్గం తన ప్రచార సామగ్రిలో తొగించింది. ఎన్సీపీ నేత అదితి తత్కారే, బిజెపి గిరీష్‌మహాజన్‌లను నాసిక్, రాయ్‌గడ్ ఇన్‌ఛార్జి మంత్రులుగా నియమించడం కూడా వివాదాన్ని మరింతపెంచింది. 2027 నాసిక్ కుంభమేళా సమీక్షాసమావేశానికి కూడా షిండే గైర్హాజరు అయ్యారు. సీనియర్ బిజెపి నాయకుడు ఆశీష్ షేలార్ మాట్లాడుతూ ఎలాంటి అసమ్మతి, అసంతృప్తిలేదని ప్రభుత్వం సజావుగా నడుస్తోందని, ఏకతాటిపై కూటమి పయనిస్తోందని ప్రకటించారు. షిండే కూడా పైపైకి ఎలాంటి కోల్డ్‌వార్ తమమధ్యలేదని చెప్పలేక చెపుతూ రావడంచూస్తుంటే మహాయుతిలో మహా లుకలుకలు బయలుదేరాయని స్పష్టం అవుతోంది.



# దేశాల మధ్య వివాదాలు విచ్ఛిన్నానికి దారితీయొద్దు

## జి-20 విదేశాంగమంత్రుల సమావేశంలో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్



**ప్రిటోరియా, ఫిబ్రవరి 21:** ఏ కోణంలో చూసినా ప్రపంచ రాజకీయ పరిస్థితి సంక్లిష్టంగానే ఉందని విదేశాంగమంత్రి జైశంకర్ పేర్కొన్నారు. రాబోయే కాలంలో కృత్రిమమేథ, ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, డ్రోన్లు, గ్రీన్ హైడ్రోజన్ వంటి అంశాల్లో భౌగోళిక రాజకీయ పరిస్థితుల ప్రభావం కచ్చితంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంఘర్షణ పరిస్థితులు, ఆర్థిక ఒత్తిళ్లు, ఆహార భద్రత, కొవిడ్ మహమ్మారి సవాళ్లు, వాతారవణ ఆందోళనలను ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్నాయన్నారు. జి-20 మన ఆసక్తులు, సంస్కృతులు, దృక్పథాల వైవిధ్యాన్ని సంగ్రహిస్తుందన్నారు. దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న విదేశాంగ మంత్రి జి-20 విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సమస్యలను ఎదుర్కోవడంలో, ప్రపంచ దేశాల ఎజెండాను ముందుకు తీసుకువెళ్లడంలో జి-20 కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ సమాఖ్యను కాపాడుకోవడం ప్రపంచ దేశాల తక్షణ కర్తవ్యమని అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు వివాదాలుగా మారి విచ్ఛిన్నానికి దారితీయకూడదని పేర్కొన్నారు.

**ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకం:** పశ్చిమాసియా ఘర్షణలు, సముద్ర భద్రత, ఉక్రెయిన్ వివాదం, ఇండో-పసిఫిక్, యుఎన్ సంస్కరణలపై భారతదేశ వైఖరిని జైశంకర్ తెలిపారు. గాజా కాల్పుల విరమణ, బందీల విడుదలను దేశం స్వాగతిస్తోందని అన్నారు. భారత్ ఎప్పుడూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదని, మానవతా సహాయానికి మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఘర్షణలు నెలకొంటున్న ఆయా ప్రాంతాల్లో శాంతి, సుస్థిరత నెలకొనడం ప్రపంచ దేశాలకు చాలా అవసరమని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రపంచదేశాలు ఒకదానికి ఒకటి సహాయ,సహకారాలు అందించుకోవాలని, అంతర్జాతీయ చట్టంప్రకారం కుదుర్చుకున్న ఒప్పందాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ వివాదంపై జైశంకర్ మాటాడుతూ యుద్ధం నివారించడానికి ఇరుదేశాల అధినేతలు చర్చల్లో పాల్గొనాలని భారత్ చాలాకాలంగా సూచిస్తోంద న్నారు. భారత్ యుద్ధాన్ని ప్రోత్సహించదని, దౌత్యాన్ని సమర్థిస్తుందని పేర్కొన్నారు. ఈ సమస్యకు త్వరలో ముగింపు పలకాలని కోరుతున్నట్లు తెలిపారు.

# రాత్రికి రాత్రే బెంగళూరు నగరాన్ని మార్చేయలేం..

## కర్ణాటక డిప్యూటీ సిఎం వివాదాస్పద వ్యాఖ్యలు



**బెంగళూరు, ఫిబ్రవరి 21:** డిప్యూటి ముఖ్యమంత్రి డికెశివకుమార్ బెంగళూరును సాక్షాత్తూ దేవుడే దిగివచ్చినా బాగుచేయలేడని చేసిన వ్యాఖ్యలు ఇపుడు రాజకీయంగా పెద్ద దుమారం రేపాయి. ఇటు నగరవాసులు రాజకీయ పార్టీల నాయకులు ఆయనపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బెంగళూరు నగరాన్ని రాత్రికి రాత్రే మార్చేయలేం. ఈ మహానగరం ఏ రెండేళ్లకో, మూడేళ్లకో మారదు. ఒకవేళ దేవుడే తలుచుకున్నా అది సాధ్యపడదు. నగరం బాగుచేయాలంటే ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో జరగాలి అని ఒక వర్క్‌షాపులో శివకుమార్ అన్నారు. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా బెంగళూరులోట్రాఫిక్‌జామ్ వాహనదారులకు నిత్యం నరకం చూపిస్తుంటుంది. ఈ మధ్యకాలంలో అది మరీపెరిగిపోవడంతోపలువురు మేధావులుకూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో స్వయంగా డిప్యూటిసీఎం వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ప్రజల్లో అసహనం పెరిగింది. ఆయన మంత్రి అయి రెండేళ్ల అవుతోందని బలమైన నేతగా మీకు ఆహ్వానం పలికాం కానీ మా బతుకులు బలహీనంగా మారుతున్నాయని ప్రముఖ ఆర్థికవేత్త ఆరిన్‌కేపిటల్ ఛైర్మన్ మోహన్ దాస్‌పాయ్ విమర్శించారు. ఫుట్‌పాత్‌ల పరిస్థితి సజావుగాలేదని, ఐదువేల కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అవసరమని మెట్రోరైలు విస్తరించాలని మోహన్ దాస్ అన్నారు. బ్రాండ్ బెంగళూరు అంటూ నినాదం ఇచ్చిన వ్యక్తి ఈరోజు దేవుడుకూడా సరిచేయలేడంటూ వ్యాఖ్యానించడం దురదృష్ట కరమని బిజెపి వాదిస్తోంది. ప్రజలకు సేవచేసే అవకాశం దేవుడు ఇస్తే ఈప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని బిజెపినేత మోహన్‌కృష్ణ విమర్శించారు. ఈ విమర్శలపై డికెఎస్ స్పందిస్తూ బెంగళూరు నగర సమస్యలను పరిష్కరించే బాధ్యతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే నగరంలో కొత్తరోడ్లనిర్మాణం, ట్రాఫిక్ సమస్యను తప్పించే ప్రణాళికతోకూడిన మినీ బుక్‌ను విడుదల చేసామని చెప్పారు.

# ఎఫ్‌బిఐ కొత్త డైరెక్టర్‌గా కాశ్‌పటేల్




**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా భారతీయ అమెరికన్ కాశ్ పటేల్ నియామకాన్ని గురువారం సెనెట్ ఆమో దించింది. ఈ నేపథ్యంలో కాశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికన్లకు హాని చేయాలని చూస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'ఎఫ్‌బిఐ తొమ్మిదో డైరెక్టర్‌గా నన్ను నియ మించడం ఎంతో గౌరవంగా ఉంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అటార్నీ జనరల్ పామ్ బోండికి కృతజ్ఞతలు. ఎఫ్‌బిఐకి ఎంతో ఘనచరిత్ర ఉంది. దేశ ప్రజలకు పాదర్శకంగా, జవాబు దారీగా ఉం డేందుకు బ్యూరో కట్టుబడి ఉంది. దేశం గర్విం చేలా ఎఫ్‌బిఐని పునర్నిర్మిస్తాం. అమెరికన్లకు ఎవరైనా హాని చేయాలని చూస్తే.. వారి అంతు చూస్తాం' అని ఆయన రాసు కొచ్చారు. ఇదిలా ఉండగా ఎఫ్‌బిఐ డైరెక్టరుగా కాశ్ పేరును అలస్కాకు చెందిన రిపబ్లికన్ తోపాటు పలువురు డెమొక్రట్లు వ్యతిరేకించారు. అయితే 51-49ఓట్ల తేడాతో ఆయన నియా మకం జరిగింది. దీంతో ఈ పదవిని చేపట్టిన తొలి హిందూ, భారతీయ అమెరికన్‌గా ఆయన నిలిచారు. అధ్యక్షుడు ట్రంప్‌నకు వీరవిధేయుడిగా కాశ్‌కు పేరుంది. పటేల్ కుటుంబ మూలాలు గుజరాత్ లో ఉన్నాయి. ఆయన తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. ఉగాండా నియంత ఈదీ ఆమిన్ బెదిరింపుల కారణంగా అతడి తండ్రి అమెరికాకు వలస వచ్చారు. 1980లో న్యూ యార్క్‌లోని గార్డెన్‌సిటీలో పటేల్ జన్మించారు. యూనివర్శిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఒక లా సంస్థలో పని చేయాలనుకున్నా కొలువు లభించలేదు. దీంతో ఆయన మియామీ కోర్టుల్లో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి వివిధ హోదాల్లో సేవలందించారు.



# టెన్త్ విద్యార్థుల ఘర్షణ: కాల్పుల్లో ఒకరు మృతి

**పాట్నా, ఫిబ్రవరి 21:** పదో తరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందంటూ వచ్చిన ఆరోపణలు విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీశాయి. దీంతో రెచ్చిపోయిన విద్యార్థులు ఏకంగా తుపాకులతో కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు కాగా అందులో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. బీహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రోహ్‌తాస్‌లోని సాసారామ్ పట్టణంలో నిర్వహించిన పదోతరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 19న విద్యార్థుల మధ్యవివాదం చోటుచేసుకుంది. మరుసటిరోజు గ్రూపులుగా విడిపోయిన విద్యార్థులు భౌతిక దాడులకుపాల్పడ్డారు. ఈ క్రమంలో తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ బాధిత విద్యార్థి కుటుంబసభ్యులు, గ్రామస్థులు మృత దేహంతో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సాసారామ్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. అటు విద్యార్థులు చికిత్స పొందుతున్న స్థానిక మెడికల్ కాలుజీ ఆసుపత్రి వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వారణాసి సమీపంలో రోడ్డు ప్రమాదం

# కర్ణాటక బీదర్ వాసులు దుర్మరణం



**వారణాసి, ఫిబ్రవరి 21:** మహాకుంభమేళాకు వెళుతూ ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. భక్తులుప్రయాణిస్తున్న క్రూయిజర్ వాహనం లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదంజరిగింద.ఇ ప్రమాదంలో మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారణాసి జిల్లాలోని మీర్జామురారా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌జిల్లాలోని లడగేరి ప్రాంతానికి చెందిన 14 మందిక్రూయిజర్ జీపులో మహాకుంభమేళాకు బయలుదేరారు. వారి వాహనాన్ని యుపిలోని వారణాసి జిల్లా మీర్జాముారా పోలీస్ స్టేషన్‌పరిధిలో రూపా పూర్‌గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్రూయిజర్ జీపు లోని ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ సహా మిగతా ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు.

# ఒక్కరోజు కాకుండానే మాపై విమర్శలా?

## మాజీ సిఎం విమర్శలు తిప్పికొట్టిన ఢిల్లీ సిఎం రేఖాగుప్తా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21:** బిజెపి ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ ఢిల్లీమాజీ సీఎం అతిశి చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖాగుప్తా కొట్టిపారేసారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు ఢిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేసారో చూసుకోకుండా అధికారంలోకి వచ్చి ఒక్కరోజుకూడా కాని మాపై విమర్శలు చేస్తున్నారేమిటి? మొదటిరోజే మేం కేబినెట్ సమావేశం నిర్వహించాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్‌భారత్‌యోజనను అందుబాటులోకి తెచ్చాం. దాంతో ప్రజలకు రూ.10 లక్షల మేర వైద్యసహాయం అందనున్నది. ఈపథకాన్ని ఆప్ అమలుచేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికిలేదు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఢిల్లీ తన హక్కులన్నీ సాధిస్తుందని ముందు మీరు మీ పార్టీగురించి చూసుకోండి అని హితవు పలికారు. ఎంతో మంది మీ పార్టీని వీడాలని ఆసక్తితో ఉన్నారు. కాగ్ నివేదికను అసెంబ్లీలోపెడితే అందరి జాతకాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారని రేఖ దుయ్యబట్టారు. మహిళలకు రూ.2500 నెలనెలా ఆర్థిక సాయం అందించేపథకం మొదటి కేబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని బిజెపి హామీ ఇచ్చిందని కానీ మొదటిరోజే ఉల్లంఘించిందని అతిశి విమర్శించారు. అయితే రేఖాగుప్తామాత్రం మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థికసాయం రూ.2500 జమచేస్తామని తెలిపారు. ఢిల్లీ అభివృద్ధికోసం ఒక్కరోజును కూడా వృథా చేయనని ఆమె అన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ నివేదికలను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ప్రవేశపెడతామని చెప్పారు.




# టారిఫ్‌ల దెబ్బకు బ్రిక్స్ మాటే వినిపించట్లేదు..

## కూటమిదేశాలపై ట్రంప్ వ్యంగ్యోక్తులు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** బ్రిక్స్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ కొంతకాలంగా గుర్రుగా ఉన్నారు. కూటమి దేశాలపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ప్రపంచ రిజర్వు కరెన్సీగా అమెరికన్ డాలర్‌స్థానంలో వేరే కరెన్సీ తెచ్చేందుకు ప్రయత్నిస్తే 150శాతం సుంకాలు విధిస్తామని పలుమార్లు తీవ్రంగా హెచ్చరించారు. తాజాగా బ్రిక్స్‌దేశాలపై మరోసారి ఆయన నోరుపారేసుకున్నారు. సుంకాలు విధిస్తామనగానే బ్రిక్స్ చెల్లాచెదురైపోయిందని వ్యంగ్యోక్తులు విసిరారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌ను నాశనం చేయాలని చూస్తున్నాయని అందుకు ప్రయ త్యామ్నాయంగా కొత్తకరెన్సీని సృష్టించాలను కున్నాయని, డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే బ్రిక్స్‌పై 150శాతం సుంకాలు వేస్తామని తాను చెప్పగానే అందులోని దేశాలు పరస్పరం దూరం జరిగాయని తర్వాత ఆకూ టమి మాటే వినిపించడంలేదని ట్రంప్ అన్నారు. ఇప్పటికే ట్రంప్ బ్రిక్స్ కూటమిపై ఘాటుగా స్పందించారు. బ్రిక్స్ ఒక చెడు ప్రతిపాదన తెచ్చిందని దీన్ని ఎవరూ అంగీకరించరని, డాలర్‌తో ఆటలాడితే 150శాతం సుంకాలు విధిస్తానని చేసిన హెచ్చరికతో ఆ ప్రతిపాదన గురించి మాట్లాడేందుకుసైతం భయపడుతు న్నారన్నారు. తాను ఈ వ్యాఖ్యలుచేసిన వెంటనే బ్రిక్స్ అంతం అయిందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో కానీ మరేప్రాంతంలో అయినా కానీ అమెరికన్ డాలర్‌ను భర్తీచేసే అవకాశం బ్రిక్స్‌కు లేదని ఒకవేళ ఏదేశం అయినా ప్రయత్నిస్తే సుంకాలకు హలోచెప్పి అమెరికాకు గుడ్‌బై చెప్పాల్సి వస్తుందన్నారు. బ్రిక్స్‌కు ఉమ్మడి కరెన్సీ ఏదీ లేనప్పటికీ ఉక్రె యిన్‌తో ఉద్ధం అనంతరం అనేక పశ్చిమ దేశాలనుంచి రష్యా ఆంక్షలను ఎదుర్కొనడంతో ఈ అంశంపై చర్చలు భారీగా సాగాయి.

# ట్రక్కును ఢీకొట్టిన బస్సు: నలుగురు మృతి, 30 మందికి గాయాలు



**కచ్(గుజరాత్), ఫిబ్రవరి 21:** కచ్‌జిల్లాలోని ముంద్రా ప్రాంతంలో ఒక ప్రయాణీకుల బస్సు, ట్రక్కు ఢీకొన్న సంఘటనలో నలుగురు మృతిచెందారు. మరో 30మందివరకూ తీవ్రగాయాలపాలయ్యారు. బస్సులో ప్రమాద సమయానికి 40 మందిప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారందరినీ సమీపంలోని ఆసుపత్రికి తరలించామని కచ్ ఎస్‌పి తెలిపారు. గత వారంలో కూడా ఒక టూరిస్టు వ్యాన్ ప్రయాణీకులతో మహాకుంభ్‌నుంచి తిరిగివస్తుండగా ఒక స్టేషనరీతో వెళుతున్న ట్రక్కును హైవేపైనే ఢీకొట్టింది. దాహోద్‌జిల్లాలో ఈసంఘటన జరిగింది. ఆ ప్రమాదంలో కూడా నలుగురు చనిపోగా ఆరుగురు తీవ్రగాయాల పాలయ్యారు. ప్రస్తుతం ముంద్రా ప్రమాదంలో గాయపడిన అందరినీ వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

22-2Pg6exHMNWJQE.qxd:22-2Pg6exHMNWJQE.qxd 01/01/01 10:06 AM Page 1



# రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



- పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం
- ప్రజా సమస్యలు పరిష్కరించటం ఉద్యోగుల ముఖ్యమైన బాధ్యత
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీరాంప్రసాద్ సిసోడియా

**నెల్లూరు, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త** - కలెక్టరేట్ శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పిజిఆర్ఎస్ , రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, భూ ఆక్రమణలు, భూ సంబంధిత కోర్టు కేసులు తదితర అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లతో సమీక్ష చేశారు. ఈ సమీక్ష సమావేశంలో సిసోడియా మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేసిన తరువాత మాత్రమే డిస్పోస్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు. .సమస్యలతో వచ్చే అర్జీదారులను వెయిట్ చేయించకుండా వారి పట్ల గౌరవ మర్యాదలతో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించటం ఉద్యోగుల ముఖ్యమైన బాధ్యతని ఆయన పేర్కొన్నారు. రీసర్వే చేసిన భూముల కొలతలతో చిన్న చిన్న తేడాలుంటే రైతులను పిలిపించి నచ్చజప్పి వీలు ఉన్నంతవరకు పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. భూములు ఆక్రమణ గురైతే ఆక్రమణలు తొలగించి మరల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో అందించాలన్నారు.

చుక్కల భూముల విషయంలో ప్రత్యేక డ్రైవ్ పెట్టాలని సూచించారు. రెవెన్యూ రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేయాలన్నారు.

కోర్టు కేసులను తేలికగా తీసుకోకుండా వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కౌంటర్ అఫిడవిట్లు ఫైల్ చేయాలన్నారు. నెల్లూరు జిల్లా తీర ప్రాంతంలో ఉంది కాబట్టి ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, కమ్యూనికేషన్ ప్లాన్ పక్కాగా రూపొందించుకోవాలని ఉన్నారు. జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల ప్రకారం సమస్యలు పరిష్కారం నాణ్యతగా ఉండేటట్లు చూస్తామని ,అఫిడవిట్ల ఫైల్ చేయడంలో జాప్యం లేకుండా ఆర్డీవో తాసిల్దారులకు ఆదేశాలు ఇస్తామని లీగల్ సెల్ ఏర్పాటు చేసి కేసుల సత్వర పరిష్కారం చర్యలు తీసుకుంటామని ప్రధాన కార్యదర్శి జెసి వివరించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్, సూర్యతేజ, సబ్ కలెక్టర్ పూజ,డీఆర్ఓ జె.ఉదయ భాస్కర రావు, కావలి, ఆత్మకూరు ఆర్ డీ ఓ లు జిల్లా సర్వే అధికారి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# గజపతినగరంలో దొంగల హల్‌చల్

**గజపతినగరం (విజయనగరం జిల్లా) ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** విజయనగరం గజపతినగరం పట్టణంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒకేసారి ఎనిమిది వేర్వేరు షాపుల్లో భారీ చోరీకి పాల్పడ్డారు. సుమారు రెండు లక్షల నగదు, ఎనిమిది లక్షల రూపాయల విలువ గల వస్తువులు దొంగలు అపహరించుకుపోయారు. దీంతో గజపతినగరం ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దొంగలు ఒకే రోజు ఈ తరహా దొంగతనానికి పాల్పడటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసు స్టేషన్‌కి కూత వేటు దూరంలో హైవేపై గల ఈ ఎనిమిది దుకాణాల్లో ఒకేసారి దొంగతనాలు జరగడం పోలీసుల వైఫల్యమేనని స్థానికులు విమర్శిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట, మూడున్నర గంటల మధ్య దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు సిసి పుటేజీ ఆధారంగా తెలుస్తోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే 26వ నెంబర్ జాతీయ రహదారిపై గల సూపర్ ఎం మార్ట్, వెంకి మొబైల్స్, మినీ డిమార్ట్‌లతో పాటు మెంటాడ రోడ్డులో గల ఆర్కే ఫ్యామిలీ మార్ట్, హాసిని బట్టల దుకాణం, షూ మార్ట్‌తో పాటు మరో రెండు దుకాణాల్లో షట్టర్లు లేపి దొంగలు లోపలకు ప్రవేశించారు. దొరికినదంతా దోచుకుపోయారు. ప్రధానంగా వెంకి మొబైల్స్ దుకాణంలో లక్షా యాభై వేల నగదు, ఐదు లక్షల రూపాయల విలువ చేసి సెల్ ఫోన్లు, ఆర్కే ఫ్యామిలీ మార్ట్‌లో ఇరవై వేల రూపాయలు నగదు, కొంత సామాగ్రి దొంగిలించుకుపోయినట్లు ప్రాథమిక సమాచారం. ఈ వరుస దొంగతనాల నేపథ్యంలో వ్యాపారుల్లో సైతం అభద్రతా భావం, భయాందోళనలు నెలకొన్నాయి. శుక్రవారం ఉదయం స్థానికులు కొందరు దుకాణాల షట్టర్లు తెరిచి ఉండటం గమనించి సంబంధిత యజమానులకు సమాచారం అందజేయడంతో ఈ దొంగతనాల విషయం బయటకు వచ్చింది. ఆ తరువాత పోలీసులకు దుకాణాల యజమానులు సమాచారం అందజేయడంతో ఎస్.ఐ లక్ష్మణరావు, క్లూస్ టీం, డాగ్ సా్వడ్ సహాయంతో దర్యాప్తు ప్రారంభించారు. ఆ తరువాత బొబ్బిలి డిఎస్పీ భవ్యరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిపివి రమణ సంఘటన స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణ యజమానులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలాలను పరిశీలిస్తున్న బొబ్బిలి డిఎస్పీ భవ్యరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిపివి రమణ

## ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీరెడ్డి ఆరోపణలపై వివరణ కోరిన మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీరెడ్డి చేసిన ఆరోపణలపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారుల నుంచి వివరణ కోరారు. ఆ సంస్థ ఎండీ దినేష్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ లతో ఆయన సచివాలయంలో సమావేశమై ఈ అంశాలపై ఆరా తీశారు. ఏపీ ఫైబర్‌నెట్ సంస్థను పూర్తిగా కనుమరుగు చేసేలా అధికారులు కుట్రలు పన్నుతున్నట్లు అనుమానం వ్యక్తమవుతోందని ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎండీ దినేష్ కుమార్ ఏపీ ఫైబర్‌నెట్ సంస్థను చంపేయాలనుకుంటున్నారని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఫైబర్‌నెట్‌లో ఉన్నత ఉద్యోగులు రాజద్రోహానికి పాల్పడుతున్నారని జీవీ రెడ్డి ఆరోపించారు.

గత ప్రభుత్వానికి సహకరించే విధంగా వారి వ్యవహార శైలి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క పైసా ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టకపోగా, సంస్థకు నష్టం కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని జీవీరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన ముగ్గురు ఉన్నతాధికారులను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. సంస్థ నష్టపోయిన ఆదాయాన్ని అధికారుల నుంచే రాబట్టేలా ప్రభుత్వాన్ని కోరతానన్నారు. ముఖ్యంగా ఏపీ ఫైబర్‌నెట్ ఎండీ దినేష్‌రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఫైబర్‌నెట్ సంస్థలో జరుగుతున్న అవకతవకలు, ఉద్యోగుల పనితీరుపై ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి చేసిన ఆరోపణలపై శనివారం సాయంత్రంలోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎండీ దినేష్‌కుమార్‌ను ఆదేశించారు. మరోవైపు ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని ఏపీఎఫ్ఎస్ఎల్ ఛైర్మన్ జీవీరెడ్డికి కూడా మంత్రి కార్యాలయం లేఖ రాసింది. అయితే రెండు రోజుల్లోగా మొత్తం ఆధారాలు సమర్పిస్తానని జీవీ రెడ్డి మంత్రికి తెలియజేశారు.



హైదారాబాద్‌లో చేతి ఉత్పత్తులు విక్రయిస్తున్న శ్రీకాకుళం వాసి, ఇన్‌సెట్‌లో చంద్రబాబు

## అతడి కథ ఒక స్ఫూర్తి దాయక జీవిత పాఠం: సిఎం చంద్రబాబు

- హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ పోస్టును షేర్ చేసిన సిఎం

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా(ఎక్స్ )లో ఆసక్తికర పోస్టును పంచుకున్నారు. ఓ వ్యక్తి శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్నో ఏళ్ల కిందట హైదరాబాద్ కు వలసవెళ్లి అక్కడే వెదురు బుట్టలు, విసనకర్రలు, కొబ్బరి ఆకులతో పలు ఉత్పత్తులు తయారు చేస్తూ జీవిస్తున్న వైనాన్ని హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ అనే సోషల్ మీడియా హ్యాండిల్ పోస్టు చేసింది. ఈ పోస్టును షేర్ చేసిన ఏపీ సీఎం చంద్రబాబు... ఇది ఒక స్ఫూర్తిదాయక జీవితపాఠం అని కొనియాడారు. అతడి కథను పరిశీలిస్తే కష్టించి పనిచేసే స్వభావం, ఏపీ వాణిజ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. కానీ, అతడు సొంతగడ్డను వదిలి అవకాశాలను వెతుక్కుంటూ వేరే ప్రాంతానికి వెళ్లడం తనను విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు.ఏదేమైనా ఆ వ్యక్తి పనితనం, ఆశావహ దృక్పథం బాగా నచ్చాయని. తన కలలను, కళను కలగలిపి వస్తువులుగా మలిచి జీవనం సాగిస్తుండడాన్ని ప్రగాఢంగా అభిమానిస్తున్నానని వివరించారు. "ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్ నిర్మించడానికి, అవకాశాలను సృష్టించడానికి కృషి చేస్తోంది. ఆ వ్యక్తిలా నైపుణ్యం ఉన్న వారు స్వస్థలంలోనే ఉంటే ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు.

# ఉత్తమ పోలీసు అధికారులకు సిఎం చంద్రబాబు అభినందన



అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులతో ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి**హ అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులను ఎక్స్ వేదిక ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. జార్ఖండ్ రాజధాని రాంచిలో ఆరు రోజుల పాటు 68వ అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో సత్తా చాటి నాలుగు స్వర్ణపతకాలు, ఒక రజత పతకం, రెండు కాంస్య పతకాలు సాధించడంతో పాటు టీం విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాల పట్టికలో ద్వితీయ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యక్తిగత విభాగంలో మూడు స్వర్ణ పతకాలసాధించిన రికార్డ్ సృష్టించిన ఎస్ఐ కె.కృష్ణమూర్తికి

ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇక జాతీయ స్థాయిలో డ్యూటీ మీట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎపి పోలీసు అధికారులన డిజిపి హరీష్ కుమార్ గుప్తా అభినందించారు.

మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో వారందరిని డీజీపీ సముచిత రీతిన సత్కరించారు. కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలకు చెందిన 24 టీమ్‌లు పాల్గొనగా, డిఐజి కె.కె.ఎస్ అంబురాజన్ నేతృత్వంలోని అధికారులతో కూడిన బృందం పాల్గొందని తెలిపారు.

# శివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఒక్కో రోజుకు ఒక్కో వాహనం

**(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలంటే ఎన్నో వింతలు,ప్రతి రోజు ఓ వాహన సేవను నిర్వహిస్తారు. అయితే ఈ వాహనాలనే ఎందుకు వాడుతున్నారన్నది దేవస్థానం నిర్వాహకులు వివరిస్తూ వాహన మండపం వద్ద సమాచారం అందిస్తే బాగుంటుంది. ప్రతి రోజూ ఏదో వాహనంపై స్వామి అమ్మవార్లు వస్తారు. దర్శించుకుంటున్నామనే భావనేతప్ప ఈ వాహనంపై స్వామి అమ్మవార్లు ఎందుకు వస్తున్నారనే విషయం పలువురికి తెలియదు. అయితే స్థానిక ఆర్చకుల కథనం మేరకు వాహనాలకు సంబంధించిన సమాచారం ఇలా ఉంది. దేవతల్ని త్రిపురాసురుడనే రాక్షసుడు ఇక్కట్లు పెడుతున్నట్లు చెబుతున్నారు. వారి తపస్సులకు భంగం కల్గిస్తూ ఆధ్మాతిక కార్యక్రమాలను జరగనివ్వకుండా ఇబ్బందులు పెడుతుంటే ఆతన్ని సంహరించే శక్తి ఒక్క శివునికే ఉందని భావించిన ఋషులు దేవ దేవుని వేడుకున్నట్లు స్థలపురాణంలో పేర్కొన్నారు. మహాశివరాత్రి పది రోజులు ఒక్కొక్కరోజుకు ఒక్కొక్క ప్రాధాన్యత ఉంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటి రాత్రిని దేవరాత్రి అంటారు. త్రిపురాసురుని సంహరించుటకు సముద్రంలో అమృతమథనం కోసం దేవతలందరూ సమావేశమై తమను త్రిపురాసురుని బాధ నుంచి కాపాడేది ఒక్క కైలాసనాధుడే అని చర్చించు కోవటాన్ని దేవరాత్రి అంటారు. హాలాహాలాన్ని ముక్కంటీశుడు భక్షించి దేవతలకు అమృతం పంచిన రాత్రి అనికూడా అంటారు.దేవతలందరూ సమావేశమై నిర్ణయించు కోవటానికి దేవరాత్రి అంటారు. అంటే శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ధ్వజారోహణం సందర్భంగా స్వామిని దేవతలు వేడుకోవటాన్ని వివరిస్తారు. ఆ రోజు స్వామి వారు వెండిపల్లకిలో దర్శన మిస్తారు. త్రిపురాసురుడు ఒక్క దేవతల్నే కాకుండా అన్ని వర్గాల వారిని వేధిస్తూ అల్లకల్లోలం సృష్టించటంతో ప్రకృతి ఆతని బారి నుంచి ఎలా బయటపడాలనే యోచన చేస్తున్నట్లు చెబుతారు. రెండవ రాత్రిని భూత రాత్రి అంటారు. భూతాలందరూ సమావేశమై తమ ఆరాధ్యదైవంమైన ముక్కంటీశుని ప్రార్థించటాని న్న భూత రాత్రి అంటారు. భోళాశంకరుడు భూతనాదుడంటారు. కాబట్టి తమ నాధుని వేడుకునే రాత్రిని భూత రాత్రి అంటారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు భూత నాధుడు 'భూతకీ వాహనం'పై దర్శన మిస్తాడు శివునికోసం ఘోర తపమాచరించి వరాలు పొందిన రావణాసురుడు సామవేదానికి అధిపతి అంటారు. గంధర్వులందరూ సమావేశమై తమను త్రిపురాసురుని బారి నుంచి రక్షించాలని వేడుకునేందుకు తీర్మానించినట్లు చెబుతారు. ఈ సందర్భంగా రావణాసురుని దౌత్యంతో మూగజీవాలకు మోక్షమిచ్చిన ముక్కంటీశుని వేడుకోవటం అని అర్థం. ఈ రాత్రి ని గాంధర్వ రాత్రి అంటారు. అందుకు ఆ రోజు స్వామి 'రావణాసుర వాహనం'పై దర్శన మిస్తాడు. నాల్గవ రాత్రిని నాగరాత్రి అంటారు. నాగలోకంలోని నాగదేవతలందరూ సమావేశమై తమను త్రిపురాసురుడనే రాక్షసుని బారి నుంచి తప్పించాలంటూ తీర్మానం చేయటాన్ని నాగరాత్రి అంటారు. పాములను హారాలుగా ధరించిన పరమేశ్వరుని వేడుకునేందుకు సమావేశం కావటాన్ని నాట్యాలకు ప్రతీతిగా చెబుతారు. ఆ రోజు రాత్రి అర్థనారీశ్వరుడు 'శేషవాహనంపై' దర్శనమిస్తాడు. అన్ని వర్గాలు, సంస్థల అభ్యర్థన మేరకు సాగరమధనంలో మొదట వచ్చిన హాలాహాలాన్ని తాను మింగి పార్వతి దేవి ఒడిలో రెప్పకాలం పాటు విశ్రయించి నిద్రలేచిన సందర్భంగా శివయ్య మరణాన్ని జయించాడంటూ అన్ని వర్గాలు ఆనందో త్సాహాలతో సంబరాలు జరుపుకుంటారు. ధర్మస్వరూపుడు నంది. కాబట్టి నంది వాహనంపై కైలాసనాధుడు దర్శనమిస్తాడు. 'నంది సేవ' అంటారు.



ఉత్సవాలకు సిద్ధమైన బంగారు వాహనాలు

# రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. మార్చి 1, 3వ తేదీల నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ గవర్నెన్స్ లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా ఇంటర్మీడియట్ బోర్డు అఫీషియల్ వెబ్‌సైట్ నుంచి సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇటీవల ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధంచిన హాల్ టికెట్లను వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం కల్పించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. ఏపీలో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి జరుగుతాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 1 నుంచి 19 వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మార్చి 3 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ గవర్నెన్స్‌లో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులు వాట్సప్ ద్వారా నేటి నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కాలేజీలు హాల్‌టికెట్లు ఆపేయడం వంటి ఘటనలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకుంది ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ కలిపి దాదాపు 10 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కాలేజీలు హాల్‌టికెట్లు ఆపేయడం వంటి ఘటనలు జరగకుండా వాట్సప్ లోనే హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పలు సేవలను ప్రభుత్వం అందిస్తోంది. వాట్సప్ నంబరు 9552300009 ద్వారా ఎంతో సింపుల్‌గా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పదో తరగతి విద్యార్థులు సైతం వాట్సప్ లోనే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలని విద్యాశాఖ భావిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన 9552300009 నెంబర్ కి మీ ఫోన్‌లో హాయ్ (హై) అనే వాట్సప్ లో మెసేజ్ చేయండి. సేవను ఎంచుకోండి అంటూ ఒక లింక్ వస్తుంది. ఆ లింక్ పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని సేవలు కనిపిస్తాయి. అందులో విద్య సేవలు అనే ఆప్షన్ ను సెలక్ట్ చేసుకోండి. అనంతరం ఇంటర్ ఫస్ట్ ఇయర్ లేదా సెకండ్ ఇయర్ హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోండి అనే ఆప్షన్ ఉంటుంది.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ అయితే పదో తరగతి హాల్‌టికెట్ నెంబర్ లేదా ఆధార్ నంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మీరు ఇంటర్ సెకండ్ ఇయర్ స్టూడెంట్ అయితే ఫస్ట్ ఇయర్ హాల్‌టికెట్ నంబర్ లేదా ఆధార్ నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేయాలి.

కొద్ది నిమిషాల్లోనే మీ హాల్‌టికెట్ వాట్సప్ కే వచ్చేస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవడమే. అంతే ఇలా ఎంతో సింపుల్ గా మీ ఫోన్ లోనే హాల్ టికెట్ ని డౌన్ లోడ్ చేసుకోవచ్చు.



# 2027 నాటికి దగదర్తి ఎయిర్‌పోర్ట్ పూర్తి

- అథారిటీ అధికారులతో కలిసి భూములను పరిశీలించిన ఎంపీ వేమిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్

**దగదర్తి, (నెల్లూరు,) ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** 2027 నాటికి దగదర్తి ఎయిర్‌ఫోర్ట్ పూర్తవుతుందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలుగతాయని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం ఎయిర్‌ఫోర్ట్ అథారిటీ అధికారులతో ఎంపీ వేమిరెడ్డి, రాజ్యసభ్యులు బీద, ఎమ్మెల్యే దగుమాటిలు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణంలో భూములు కోల్పోతునన్న రైతులకు, యువతకు ఉపాధి అవకాశం కలుగుతుందని అన్నారు. కృష్ణపట్నం పోర్టు, రామాయపట్నం పోర్టు అనుసంధానం చేస్తూ నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణంతో పెగనుందన్నారు. 2019లో దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు భూమి పూజ చేస్తే వైసీపీ పాలనలో అడుగు ముందు పడని పరిస్థితి నెలకొందన్నారు. 1379 ఎకరాల్లో ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణానికి ప్లాన్ చేశారని, 700 ఎకరాల భూసేకరణ పూర్తయిందన్నారు. మిగిలిన భూసేకరణ కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఎయిర్ ఇండియా అధికారులు టెండర్లు డీపీఆర్ మొదలైన పక్రియలను పూర్తి చేయాలని కోరారు. అన్ని పనులు పూర్తయితే త్వరలో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్‌మోహన్‌నాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పనుల శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుల సహకారంతో త్వరలో కావలి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ రామ్‌మోహన్‌నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, తెలుగు వాడు కావడం ఎయిర్‌ఫోర్ట్ పనులు వేగవంతమయ్యాయి. ఒక్క రోజు వ్యవధిలో అధికారులను ఢిల్లీ నుంచి ఇక్కడికి పంపడం రామ్‌మోహన్‌నాయుడు చొరువ, ఇండోసెల్, బీపీసీఎల్ సహా అనేక కంపెనీలు నెల్లూరు వైపు అడుగులు వేస్తున్నాయి. గ్రామస్తులు ఇబ్బంది పడకుండా పరిశ్రమలు తీసుకురావడమే మా లక్ష్యం, ఎయిర్‌ఫోర్ట్ నిర్మాణం నెల్లూరు జిల్లా వాసుల చిరకాల కల అని టీడీపీ ఎన్డీఏలో భాగస్వామ్యం కావడం రాష్ట్ర అభివృద్ధికి బలంగా దోహదపడుతుందని, భూములు కోల్పోతున్న ఈ ప్రాంత అభివృద్ధికి రైతులు ఎంతగానో సహకరిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రస్తుతం మన దగ్గర ఉన్న భూములతో ఎయిర్‌ఫోర్టు పనులు ప్రారంభించవచ్చని, ఎయిర్‌ఫోర్ట్ భూముల సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అన్నారు. వీరితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించండి - డిఆర్‌ఎంను కలిసిన ప్రజా ప్రతినిధులు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 21,ప్రభాతవార్త** గుంతకల్లు పట్టణంలో సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న పలు రైల్వే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీ నారాయణ,స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,గుంతకల్లు మున్సిపల్ కమీషనర్ మొహమ్మద్ నయీమ్ అహ్మద్‌లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాను కోరారు. శుక్రవారం డిఆర్ఎం గుప్తాను కలిసిన వారు గుంతకల్లు పట్టణంలోని పలు రైల్వే బ్రిడ్జిల నిర్మాణం గురించి చర్చించారు. ఈ సందర్భంగా గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా ధర్మవరం గేట్ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని గత పాలకులు కేవలం రాజకీయ లబ్ది కోసం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు సంపాదించుకునేందుకు టెంకాయలు కొట్టి ధర్మవరం గేట్‌ను అభివృద్ధి పనులు మొదలు పెట్టామని చెప్పుకున్నారని కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుల సహకారంతో అభివృద్ధి పనులను మొదలు పెట్టామని తెలిపారు. అలాగే కసాపురం రోడ్డులోని రైల్వే బ్రిడ్జి ఎత్తును (హైట్) 5ఇంచులు పెంచి తొందరలోనే పనులు ప్రారంభించే కార్యక్రమం చేపట్టామని, హనుమాన్ సర్కిల్‌లో కూడా ఫ్లైఓవర్‌కి ప్రతిపాదనలు పంపామని ఖచ్చితంగా వీటన్నింటిని అభివృద్ధి చేసే బాధ్యత తాను,ఎంపి అంబికా లక్ష్మినారాయణ తీసుకుంటామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. మున్సిపాలిటీకి రైల్వే శాఖ చెల్లించవలసిన బకాయిల గురించి వారు డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత మేరకు భూసేకరణకు సంబంధించిన రూ.1.85కోట్లను చెల్లించేందుకు డిఆర్ఎం సూచన ప్రాయంగా అంగీకరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో తెదేపా నాయకులు నారాయణ స్వామి, మష్టూరు భాస్కర్, క్రిష్ణారెడ్డి, మున్సిపల్, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై డిఆర్‌ఎంను కలిసిన ఎంపి అంబిక,ఎంఎల్ఏ జయరాం

# కెసిఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిల్ దాఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** విపక్ష నేత, బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిటిషన్ దాఖ లైంది. ఫార్మర్స్ ఫెడరేషన్‌కు చెందిన విజయ్‌పాల్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుంటే స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. కేటీఆర్ దీనిపై స్పందించి కేసీఆర్ బదులు వేరేవాళ్లను అక్కడ పోటీ చేయించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీలో ప్రజల కోసం పోరాటం చేయాలని కానీ అసెంబ్లీకే రాకుంటే అన ర్హుడిగా ప్రకటించాలని పిటిషన్‌లో తెలిపారు. 2023 డిసెంబరు 16న ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారని, ఆయన ఇప్పటివరకు అసెం బ్లీకి రాకున్నా స్పీకర్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఎలాంటి ప్రొసీడింగ్స్ చేపట్టలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజల గొంతుకను అసెంబ్లీలో వినిపించేందుకు ఎమ్మెల్యేల జీతాలు కూడా పెంచారని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలను నిర్వహించలేకపోతే ఆయనను ఆ బాధ్యతల నుంచి తొలగిం చాలని కోర్టును కోరారు. శాసన వ్యవస్థ, అధికారులు తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలను సమీక్షించే అధికారం న్యాయ వ్యవస్థకు ఉందని చెప్పారు. ప్రతివాదులుగా కేసీఆర్, కేటీఆర్‌లతో పాటు స్పీకర్, స్పీకర్ కార్యాలయాన్ని చేర్చారు. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

# రాజధాని అమరావతిలోని ఎన్ఆర్టీ సొసైటీ ఐకానిక్ టవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కమిటీ

**విజయవాడ,ఫిబ్రవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలోని ఎన్ఆర్టీ సొసైటీ ఐకానిక్ టవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సారథ్యంలో తొమ్మిది మంది అధికారులతో ప్రాజెక్ట్ కమిటీ ఏర్పాటైంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే బాధ్యతలను కమిటీ అప్పగిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసారు. పెట్టుబడిదారులు, టెండర్లు, పెండింగ్ కేసుల పరిష్కారం తదితరంశాలను కమిటీ పర్యవేక్షిస్తుంది.

22-2P□g7exHMNWJQE.qxd:22-2P□g7exHMNWJQE.qxd 01/01/01 10:03 AM Page 1



# ఇంజనీరింగ్‌లో పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

## నాలుగేళ్లల్లో 160 క్రెడిట్‌లు.. అదనంగా మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు 20 క్రెడిట్‌లు

### ఇంజనీరింగ్ సిలబస్ సవరణల కమిటీ సిఫారసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలన్నింట్లోనూ ఒకే విధమైన క్రెడిట్ సిస్టమ్‌ను అమలు చేయనున్నారు. ప్రతి సెమిస్టర్‌కి 20 క్రెడిట్స్ ప్రకారం.. మొత్తం 160 క్రెడిట్స్ ఉండేలాగా సిలబస్‌ను రూపొందించనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ సిలబస్ సవరణ కోసం తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసిన కోర్ కమిటీ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్ట రెడ్డి, వైస్ చైర్మన్1 ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, వైస్ చైర్మన్2 ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తోపాటు కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్‌లో ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడానికి సిలబస్‌ను నవీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించిన నేపథ్యంలో సమావేశం జరిగింది. పరిశ్రమ మరియు ప్రపంచ అవసరాల నేపథ్యంలో సిలబస్ సవరణ అవసరాన్ని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి వివరించారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు ఏకరీతి నిర్మాణం, క్రెడిట్ ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించాలని.. ప్రతి సెమిస్టర్‌లో నాలుగు సంవత్సరాల పాటు 20 క్రెడిట్‌లతో మొత్తం 160 క్రెడిట్‌లు ఉండాలని.. అదనంగా మైనర్, హానర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు 20 క్రెడిట్‌లు కేటాయించారు.
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్ (డీఎస్), సైబర్ సెక్యూరిటీ (సీఎస్) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికత కోర్సులతో కలపడం ద్వారా కోర్ శాఖలను బలోపేతం చేయాలని.. అన్ని యూనివర్సిటీలు/కాలేజీలు మైనర్/హానర్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టితో రెండవ, మూడవ సంవత్సరాల చివరిలో రెండు తప్పనిసరి క్రెడిట్ ఆధారిత పారిశ్రామిక ఇంటర్న్‌షిప్‌లుండాలని సూచించారు. ఇంజనీరింగ్‌లో వేగంగా నేర్చుకునేవారికి క్రెడిట్‌లను సంపాదించడంలో సౌలభ్యంగా ఉంటుందని.. విద్యార్థి 6వ లేదా 7వ సెమిస్టర్ చివరి నాటికి 160 క్రెడిట్‌లను పూర్తి చేయవచ్చని.. తద్వారా మిగిలిన సెమిస్టర్(ల)ను పారిశ్రామిక ఇంటర్న్‌షిప్/ప్రాజెక్ట్ కోసం పూర్తి సమయం కేటాయించవచ్చని సూచించారు. ఇంజనీరింగ్ కోర్సులో కనీసం నాలుగు పారిశ్రామిక /క్షేత్ర సందర్శనలు చేయాలని సూచించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను బోధించడానికి ప్రాక్టీస్ ప్రొఫెసర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ అవగాహన ఒప్పందాల ప్రకారం అధ్యాపకులు మరియు విద్యార్థుల మార్పిడిని ప్రోత్సహించాలని సిఫారసుల్లో పేర్కొన్నారు.



అమ్మవారికి ప్రత్యేకపూజలు చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు

## పోలేపల్లి ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**దుద్యాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలంలోని పోలేపల్లిలో జరిగే ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సిఎంకు దేవాదాయ కమిషనర్ శ్రీధర్ పుష్పగుచ్ఛం అందజేసి, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి సిఎం పట్టువస్త్రాలు సమర్పించి, దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వేద పండితులచే ఆశీర్వచనం అందుకున్నారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణా రావు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, శాసనసభ్యులు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, దేవాలయ చైర్మన్ జయరాములు, ఇఒ రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, జయకృష్ణ, నర్సింలుగౌడ్, మేర్గ వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, యుగంధర్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు కేంద్రం అన్యాయం

### ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్



శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 21:** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మండిపడ్డారు. కృష్ణా జలాలపై తెలంగాణ ఏపీ మధ్య జరుగుతున్న చర్చలు.. దానిపై కేంద్రం స్పందనపై ఎమ్మెల్సీ కోదండరాం స్పందించారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. తెలంగాణ ఉద్యమానికి మూల కారణాలైన వాటిలో నీళ్ళ పంపకం ఒకటి అన్నారు. కృష్ణా జలాల నీటి వివాదంపై గత పదేళ్ళు అధికారంలో ఉండి కూడా మాట మాట్లాడకుండా ఉన్న బీఆర్ఎస్ నేతలు.. ఇపుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి తాము పోరాటం చేస్తామని ముందుకు రావడం హాస్యాస్పదమన్నారు. గత పదేళ్లలో మీరు మౌనం వహించడం వల్లే.. ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎనికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, టీజేఎస్ తరపున గట్టిగానే నిలదీస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ టీజేఎస్ మద్ధతు కోరిందని కోదండరాం మీడియాకు తెలియజేశారు.

## మార్చి 4, 5 తేదీల్లో డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఉత్తీర్ణులకు వైవా

### షెడ్యూల్‌ను విడుదల చేసిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) నవంబర్–2024లో నిర్వహించిన డిపార్టమెంటల్ పరీక్షలకు వైవాను నిర్వహించనుంది. నవంబర్‌లో లాంగ్వేజెస్ పరీక్షలకు హాజరై అర్హత సాధించిన వారికి మార్చి 4, 5 తేదీల్లో వైవా నిర్వహించాలని టీజీపీఎస్‌సీ నిర్ణయించింది. సంబంధిత షెడ్యూల్‌ను కమిషన్ శుక్రవారం జారీచేసింది. వైవాకి అర్హత సాధించిన వారి జాబితాను కమి షన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు మార్చి 4, 5 తేదీల్లో కమిషన్ కార్యాలయంలో వైవాకి గంట ముందుగా వివరాలను నమోదు చేసుకొని బయోమెట్రిక్‌ను పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు చేతులకు మెహందీ వేసుకోవడం గానీ, తాత్కాలిక టాటూస్ వేసుకోవడం చేయవద్దని కమిషన్ సూచించింది.

## పిసిసి విస్తృతస్థాయి కార్యవర్గం సమావేశం వాయిదా

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం గాంధీభవన్‌లో జరగాల్సి ఉండగా దానిని వాయిదా వేశారు. శాసనమండలి ఎన్నికలు ఈ నెల 27న ఉండటంతో సమా వేశం వాయిదాను నిరవధికంగా వాయిదా వేశారు. విస్తృతస్థాయి సమావేశంలో చర్చించాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికల అంశంపై ఒకరోజు ముందే పిసిసి చీఫ్ మహేష్ కుమార్ అధ్యతన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ ప్రాదేశిక నియోజకవర్గం పరిధిలోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించే ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు పాల్గొని ఎన్నికల గెలుపు కోసం వ్యూహరచనకు దశదిశను నిర్దేశించారు. ఈ నెల 23న జరగాల్సిన పిసిసి కార్యవర్గ సమావేశం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీగా మీనాక్షి నటరాజన్ నియ మితులయ్యాక ఏర్పాటు చేసిన తొలి సమావేశం కావడంతో అత్యంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల బిజీ కారణంగా వాయిదా వేశారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ఎన్.మారేష్, జబ్బుల శ్రీనివాస్, సి.రాజేందర్, భూపేష్‌సాగర్ తదితరులు

## 12, 13 తేదీల్లో ఢిల్లీలో 'జాతీయస్థాయి మేధావుల సదస్సు'

### యావత్ బిసిలు పాల్గొనాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ' పేరిట మార్చి 12, 12 తేదీల్లో ఢిల్లీలోని ఎపి భవన్‌లో 'జాతీయస్థాయి మేధావుల సదస్సు' నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం, దక్షిణాది రాష్ట్రాల ఒబిసి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో కేంద్రమంత్రులు, ఎంపిలు, ఎపి, తెలంగాణ, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 100 బిసి సంఘాల ప్రముఖులు పాల్గొంటారని, బిసిలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చలో ఢిల్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన జరగవలసిన చారిత్రాత్మక అవశ్యకత ఎంతైనా ఉందని, ప్రధాని నరేంద్రమోడీ వెంటనే చొరవ తీసుకుని బిసి బిల్లు, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల ఒబిసి సంఘం అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాస్, బిసి నేతలు సి.రాజేందర్, పీతాను ప్రసాద్, నడిపిన శ్రీనివాస్‌రావు, నీలం వెంకటేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో టాప్10 బ్యాంకుల్లో స్థానం సంపాదించాలి

### ఎస్‌బిఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ప్రపంచంలోని టాప్ 10 బ్యాంకుల్లో స్థానం సంపాదించే విధంగా ఎస్‌బిఐ సిబ్బంది పని చేయాలని, ఇందుకు ఖాతాదారులు సహకారం కూడా ఎంతో అవసరం అని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) చైర్మన్ చల్లా శెట్టి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్రంలోని (హైదరాబాద్) సర్కిల్లో 10 కొత్త (1. అలంపూర్ల్ రోడ్ 2. చిన్నంబావి 3. రాఘవేంద్ర కాలనీ (కొండాపూర్) 4. నియోపోలిస్ 5. కిష్టారెడ్డిపేట్ (పటాన్‌చెరు) 6. ఖాజాగూడ 7. ఉస్మాన్ నగర్ 8. కంగ్టి (నారాయణఖేడ్) 9. సుచిత్ర సర్కిల్ (కుత్బుల్లాపూర్) 10. నందిపేట్) శాఖలను వర్చువల్‌గా ప్రారంభించారు. చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీ చల్లా శ్రీనివాసులు శెట్టి ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో (హైదరాబాద్ సర్కిల్) పది కొత్త శాఖలను చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ రాజేష్ కుమార్ సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఆ శాఖలు 2024లో దేశంలోని అత్యుత్తమ బ్యాంకుల జాబితాలో 4వ స్థానంలో ఉందని దీన్ని మరింత ముందుకు తీసుకెళ్ళ బాధ్యత సిబ్బందిపై ఎంతగానో ఉందన్నారు. ఈ నూతన బ్యాంకుల ఏర్పాటుతో రాష్ట్రంలో ఎస్‌బిఐ బ్రాంచ్‌ల సంఖ్య 1206కు చేరుకున్నట్లు తెలిపారు. బ్యాంకులు లేని ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందేలా చేయడం, అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రాల్లోని ప్రజల పెరుగుతున్న బ్యాంకింగ్ అవసరాలను తీర్చడం వంటి చర్యలు బ్యాంకుల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. కస్టమర్ మన విశ్వానికి కేంద్రమని, కస్టమర్ కేంద్రీకృతి, వ్యాపార వృద్ధి, స్థిరమైన వృద్ధి, ఉద్యోగుల కేంద్రీకృతి అనే నాలుగు ప్రాథమిక సూత్రాలపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.దేశ ఆర్థిక భవిష్యత్తును రూపొందించడంలో బ్యాంకు కీలక పాత్ర పోషిస్తుంది. దీనిని సాధించేందుకు ఉద్యోగులు ఉత్తమ బ్యాంకుగా, అత్యంత విలువైన బ్యాంకుగా ఉండేలా చూసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. మరింత మంది ఖాతాదారులను చేర్చుకోవడం, అత్యున్నత స్థాయి బ్యాంకింగ్ సేవలను అందించడం వంటి కార్యక్రమాలపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు.




## కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం చేసిన బిఆర్ఎస్

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలను తాకట్టుపెట్టి లక్షా81వేల కోట్లు అప్పు తీసుకొచ్చినా కృష్ణాజలాల వాటా విషయంలో తెలంగాణకు బిఆర్ఎస్ అన్యాయం చేసిందని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులకు మంత్రులకు కృష్ణా ప్రాజెక్టులపై మాట్లాడే నైతికత లేదని అన్నారు. గత పదిసంవత్సరాలు బిఆర్ఎస్ నిర్లక్ష్యం చేశారని ఉత్తమ్ పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణలో 100 టిఎంసిల నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం కలిగిన ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేయ లేదని ఆయన అరోపించారు. ఎస్ఎల్‌బిసి, డిండి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు నిధు లు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాజె క్టులు పూర్తి చేసుకొంటామని ఆయన తెలిపారు.

## యాదగిరిగుట్ట కుంభాభిషేకం సంప్రోక్షణ మహోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**భువనగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి బంగారు విమాన గోపురం మహా కుంభా భిషేకం సంప్రోక్షణ మహోత్సవ కార్యక్రమానికి ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ఏర్పా ట్లను పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముఖ్య మంత్రి పర్యటన సందర్భంగా జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.పోలీస్, రెవెన్యూ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, దేవాదయ శాఖ, అర్ అండ్ బి, ట్రాన్స్ పోర్ట్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, పంచాయితీ, ఎక్సైజ్, మత్స్య శాఖ, వైద్య శాఖ, మిషన్ భగీరథ, ట్రాన్స్ కో, డిపిఆర్ఓ,సివిల్ సప్లై, వ్యవసాయ శాఖ, ట్రాఫిక్ తదితర శాఖల ఏర్పాట్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు అధికారులు సంపూర్ణ సమన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. భద్రత ఏర్పాట్లు, శాంతి భద్రతలు, పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తును పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను, అగ్నిమాపక పరికరాలను, సేవలను అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక శాఖను, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖను, రోడ్ల మరమ్మత్తుల పనులను అర్.అండ్.బి, అధికారులు, శానిటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయితీ శాఖ, ఈ ఏర్పాట్లన్నీ ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణ రెడ్డి,సీఈఓ శోభారాణి, ట్రాఫిక్ ఎసిపి ప్రభాకర్ రెడ్డి, డిఆర్డిఏ నాగిరెడ్డి, ఏ.ఓ జగన్మోహన్ ప్రసాద్ ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులను చితకబాదిన ఇంటర్ స్టూడెంట్లు

### రుక్మాపూర్ సైనిక్ స్కూల్లో ఘటన

### పట్టించుకోని డైరెక్టర్, ప్రిన్సిపాల్

### గతంలోనూ ఘటన.. తల్లిదండ్రుల ఆందోళన

### విద్యార్థులను గోప్యంగా ఆస్పత్రికి తరలించిన స్కూల్ సిబ్బంది



**చొప్పదండి, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి చదువుతున్న విద్యార్థులను చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది ఈ విషయాన్ని సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ డైరెక్టర్ గోప్యంగా ఉంచి విద్యార్థులకు వైద్య సేవలు అందించినట్లు సమాచారం వివరాల్లోకి వెళితే ఈనెల 20న సాయంత్రం ఇంటర్మీడియట్ విద్యార్థులు 10 మంది కలిసి పదో తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులపై భౌతికంగా దాడి చేశారు ఈ దాడిలో కొందరికి గాయాలు కాగా రాత్రి కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు విశ్వాసనీయ సమాచారం ప్రిన్సి పల్ సైనిక్ స్కూల్ డైరెక్టర్ నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు విషయం తెలిసిన తల్లిదండ్రులు శుక్రవారం మధ్యాహ్నం సైనిక్ పాఠశాల కు చేరుకొని ఆందోళన నిర్వహించారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని ఆందోళన నిర్వహించారు సంఘటన స్థలానికి ఎస్సై గొల్లపల్లి అనూష చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యార్థులతో మాట్లాడారు గతంలో కూడా పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను దాడి చేసిన సంఘటన కూడా చోటుచేసుకుంది మళ్లీ ఇలాంటి సంఘటనలు పునారవృతం అవుతున్నాయి ఇదిలా ఉండగా విద్యార్థులు కొందరు మత్తుపదార్థాలకు బానిస అవుతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి సైనిక్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మద్యం సేవిస్తున్నారని సంఘటనలు కూడా జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి ప్రిన్సి పల్ డైరెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులను పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు పిల్లలను విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి పంపిస్తే క్రమశిక్షణ లేకుండా చేస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రిన్సి పాల్ ను డైరెక్టర్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## దోచి, దాచిపెట్టిన అధికారులపై వేగంగా విచారణ చేపట్టాలి

### ఆ అధికారుల వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు

### చర్యలు తీసుకొనే సమయం ఆసన్నమైంది

### పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణలోని అధికారుల తీరువల్లే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆవేదన చెందారు. శుక్రవారం ప్రసారమాధ్యమ ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ దోచిపెట్టిన దాచిపెట్టి అధికారులపై వేగంగా విచారణ జరుగాలని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వంలో పెత్తనం చేసిన అధికారులు ఇప్పడూ ఉండటంతో ప్రతిపక్ష పార్టీతో కుమ్మక్కై ప్రభుత్వ సమాచారాన్ని బట్టబయలు చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో పదేళ్లు కీలకంగా వ్యవహరించిన అధికారులను పక్కన పెట్టాలని ప్రభుత్వ పెద్దలకు ఆయన సలహా ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో ఇంటెలిజెన్స్ పూర్తిగా విఫలమైందని చాలాచోట్ల ఇది కనపడుతోందని ఆయన అన్నారు. పోలీసుల వైఫల్యం కారణంగానే భూపాలపల్లిలో రాజలింగమూర్తి హత్య జరిగిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు అవినీతి అధికారుల జబితా చేరిందని ఇక వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేష్‌కుమార్ బాగోతం ఇంకా బయట పడటంలేదని ఆయన అండతోనే జిఎస్‌టి కుంభ కోణం జరిగిందిన ఆయన వివరించారు. అమయ్ కుమార్ లాంటి వారిపై చర్యలు అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. విచారణలో వేగం తగ్గడంతో 'రాజీ'పడ్డామనే ఆరోపణలు కాంగ్రెస్‌పై వస్తున్నాయని అన్నారు. సంధికాలం ముగిసింది ఇక అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన సమయం కూడా ఆసన్నమైందని అన్నారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించినవారిని పక్కనపెట్టాల్సిన అవసరం ఉంది. అవినీతిపై విచారణ చేయాల్సిన అధికారులు కూడా దోషులు కావడంతో విచారణ ముందుకు సాగడంలేదు. సింగరేణిలో కల్వకుంట్ల కవితకు అన్ని రకాలుగా సహకరించిన అధికారి మా ప్రభుత్వంలో ఉన్నత స్థానంలోప ఉన్నారు.

## రుణమాఫీ కాలేదంటూ గాంధీభవన్ వద్ద రైతుధర్నా

**హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** తుంగతుర్తి నియోజకవర్గం శాలిగౌరం మండలం అంబర్‌పేట్ గ్రామానికి చెందిన చెందిన తోట యాదగిరి అనే వృద్ధ రైతు శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు చేరుకుని రుణమాఫీ తనకు చేయలేదని ధర్నా చేపట్టారు.తనకు రుణమాఫీ చేసే వరకు ఇక్కడ్నుంచి కదిలేది లేదని ఆ రైతు తేల్చిచెప్పాడు. తనకు మూడు లక్షలకు పైగా పంట రుణాలు ఉన్నాయని రెండులక్షలు మాఫీచేస్తే నేను ఒక లక్షరూపాయలు కట్టుకొనేటోడినని అన్నారు. 55 క్వింటాళ్ల 80 కిలోల ధాన్యాన్ని విక్రయిం చాను. కానీ ఇప్పటి వరకు బోనస్ రాలేదని ఆవేదన చెందారు.రైతుభరోసా మాప్రభుత్వం రాగానే పెంచిన మొత్తం ఇస్తదని చెప్పి ఇప్పుడు ఇంకా వేయడంలేదని ఇటు పెన్షన్లు కూడా రావడంలేదని ఆయన గాంధీభవన్ మెట్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి 2 లక్షల రుణమాఫీ చేయాలి. ప్రభుత్వం దిగి వచ్చే వంకు నేను ఇక్కడ్నుంచి కదలను అంటూ భీష్మించుకొని కూర్చొన్నారు.. నేను అబద్ధ మాడితే జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమే అని రైతు తోట యాదగిరి తేల్చి చెప్పాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామిని నిల బెట్టుకొన్నప్పటికి కొంతమంది ప్రతిపక్షాల తప్పుడు ప్రచారంతో ప్రేరేపించబడి అదడదపడా రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హామిలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయనే తప్పుడు ప్రచారంకు ఆకర్షితులై చాలా మంది రైతులకు రుణమాఫీ కాకలేదని భావించుకొని రేవంత్ సర్కార్‌పై ఆగ్రహంతో ఉన్నారు. అవకాశం ఉన్నచోట ప్రతిపక్షాల బోధనలకు ప్రేరేపితులైన రైతులు నిరసన తెలుపుతున్నారు.




ఇండిగో విమాన సేవలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

## హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మదీనాకు ఇండిగో కొత్త విమానసేవలు ప్రారంభం

**హైదరాబాద్ (శంషాబాద్). ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** జీఎంఆర్ హైదరాబాదు అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఇండిగో ఎయిర్‌లైన్స్‌తో కలిసి హైదరాబాద్ మదీనాకు కొత్త విమాన సేవలను శుక్రవారం ప్రారంభించింది. తొలి విమానం ఆనందోత్సాహం మధ్య సీనియర్ అధికారుల సమక్షంలో శుక్రవారం బయలుదేరింది. ఈ సేవ ప్రతివారం మూడు రోజులుపాటు ఉం టాయని తెలిపారు. ఈ విమానసర్వీసులు సోమ, గురు, శనివారం అందుబాటులో ఉంటాయి. గమ్యస్థానం చేరడానికి 5 గంటలు 47 నిమిషాలు. పడుతుందని వివరించారు. ఈ కొత్త సేవతో అంతర్జాతీయ కనెక్టివిటీ మరింత మెరుగవుతుందని స్పష్టంచేశారు. హైదరాబాదు అంత ర్జాతీయ విమానాశ్రయం సీఈఓ ప్రదీప్‌పనికర్ మాట్లాడుతూ, 'మదీనాకు ఇండిగో తొలి విమానాన్ని స్వాగతించడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కొత్తమార్గం మా అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను విస్తరించడమే కాకుండా, హైదరాబాదును ప్రపంచంలోని అత్యంత ప్రముఖమైన ఆధ్యాత్మిక నగరాలలో ఒకటైన మదీనాతో అనుసంధానించే ప్రత్యేక ప్రయాణ అనుభవాన్ని ప్రయాణికులకు అందిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ కనెక్టివిటీని మెరుగుపరచడం, ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల విస్తరణకు మద్దతు ఇవ్వడం ప్రయాణికులకు సులభమైన సేవలు అందించ డానికి కట్టు బడి ఉంటామని అన్నారు. దక్షిణాసియా ఆగ్నేయాసియాలోని ప్రయా ణికులకు ఇప్పుడు హైదరాబాదులో అభివృద్ధి చెందుతున్న గ్లోబల్‌హబ్ ద్వారా మరిన్ని ప్రయాణ ఎంపికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



ప్రజావాణిలో దరఖాస్తులు అందజేస్తున్న దరఖాస్తుదారులు

## ప్రజావాణిలో అందిన దరఖాస్తులు 1,244

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1,244 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 76 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 61 దరఖా స్తులు, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 36 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 1,007 దరఖాస్తులు అందాయి. ఇతర శాఖలకు సంబంధించి 237 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించారు.

22-2pg10.qxd:22-2pg10.qxd 01/01/01 8:15 AM Page 1



# ఛాంపియన్స్ ట్రోఫీలో.. ఎవరి బలం ఎంత?




## వీటి మధ్యే హోరాహోరీ

**న్యూఢిల్లీ:** మినీ వరల్డ్ కప్‌గా భావించే ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ఎడిషన్‌కు సంబంధించిన సమరం నాలుగో రోజులోకి ప్రవేశించింది. ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొంటున్నాయి. వీటిలో ప్రధాన జట్ల మధ్యే హోరాహోరీ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఏజట్టు బలం ఎంతెంత అనేదానిపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. అయితే ఇది వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ 8 టీమ్స్ పాల్గొనే టోర్నీ, కాబట్టి ఏ జట్టునూ తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఇప్పటికే న్యూజిలాండ్ చేతిలో ఆతిథ్య పాకిస్తాన్, టీమిండియా చేతిలో బంగ్లాదేశ్ ఓటమి చవిచూసింది. ఇక ఎప్పటిలాగే టీమ్‌ఇండియా టైటిల్ ఫేవరెట్లలో ఒకటి అనడంలో ఎలాంటి సందేహం లేదు. స్వదేశంలో రీసెంట్‌గా ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన టీమ్‌ఇండియా ఊపు మీదుంది. ఈ సిరీస్ తోనే సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఫామ్ అందుకోవడంతో రెట్టించిన ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. గిల్, అయ్యర్, రాహుల్ నిలకడైన ప్రదర్శన కలిసొచ్చే అంశం. అయితే బుమ్రా లేడనే ఆందోళన తప్పా, టమిండియా అన్ని రంగాల్లో బలంగానే కనిపిస్తోంది. ఇక 2023లో వన్డే వరల్డ్ కప్ చేజారడంతో ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీనైనా దక్కించుకోవాలని రోహిత్ సేన ఉవ్విళ్లూరుతోంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌తో జరిగిన తన తొలి మ్యాచ్‌లో భారత్ విజయంతో బోణీ కొట్టింది.

ఇక ఉప ఖండేతర జట్లలో భారీ అంచనాలున్నది న్యూజిలాండ్ జట్టుపైనే. ఐసిసి టోర్నీల్లో కివీస్ ఎప్పుడూ నిలకడగా ఆడుతుంది. ఇటీవల ఆతిథ్య పాకిస్థాన్‌ను రెండుసార్లు ఓడించి ట్రై సిరీస్ గెలవడం ఆ జట్టు విశ్వాసాన్ని పెంచేదే. బ్యాటింగ్‌లో విలియమ్సన్, కాన్వే, ఫిలిప్స్, మిచెల్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో శాంట్నర్, బ్రాస్‌వెల్, హెన్రీ, ఒరూర్క్ నిలకడగా రాణిస్తున్నారు. ఇప్పుడున్నఊపులో ఫైనల్‌చేరగలదనే ధీమ కివీస్‌లో కన్పిస్తోంది. అలాగే ఆస్ట్రేలియా ఎల్లప్పుడూ ఐసిసి టోర్నీల్లో ఫేవరెట్ల లిస్ట్‌లో కచ్చితంగా ఉంటుంది. కానీ, ఈసారి మాత్రం కంగారూలపై పెద్దగా అంచనాలు లేవు. కెప్టెన్ కమిన్స్‌తో పాటు హేజిల్‌వుడ్, మిచెల్ మార్ష్, స్టార్క్, స్టాయినిస్ అందుబాటులో లేక ఆసీస్ బలహీన పడింది. తాత్కాలిక కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు తోడు లబుషేన్, మ్యాక్స్‌వెల్, షార్ట్, ఇంగ్లిస్, అబాట్, స్పెన్సర్ జాన్సన్, ఎలిస్ లాంటి ప్రతిభావంతులతో కూడిన కంగారూ జట్టు టోర్నీలో ఎక్కడిదాకా వెళ్తుందో చూడాలి. అలాగే ఫార్మాట్ ఏదైనా ఇంగ్లాండ్ ప్రస్తుతం ప్రపంచ మేటి జట్లలో ఒకటి. అయితే భారత పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లు కోల్పోవడం ఇంగ్లాండ్ ఆత్మవిశ్వాసాన్ని కొంత దెబ్బ తీసేదే. అయినా సరే, సాల్ట్, డకెట్, బట్లర్, బ్రూక్, రూట్, లివింగ్‌స్టన్‌తో ఇంగ్లాండ్ బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తుంది. రషీద్ రూపంలో మేటి స్పిన్నర్ అందుబాటులో ఉన్నా అతడికి సహకరించే స్పిన్నర్లు లేరు.

ఆర్చర్, సకిబ్ మహమూద్, వుడ్‌లతో కూడిన పేస్ విభాగం కూడా సరైన ఫామ్‌లో లేదు. ఇక దురదృష్టాన్ని వెంటబెట్టుకుని ఐసిసి టోర్నీలకు వస్తుందని పేరున్న సౌతాఫ్రికా ఈసారి కథ మార్చాలనుకుంటోంది. ఇటీవలే అరంగేట్రం చేసిన బ్రీట్జ్‌కే ఫామ్‌లో ఉన్నాడు. మార్‌క్రమ్, వాండర్ డసెన్, క్లాసెన్, మిల్లర్ లాంటి సీనియర్లు బ్యాటింగ్‌లో ఆ జట్టుకు పెద్ద అండ. పేస్‌లో రబాడ మీదే జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుంది. ఎంగిడి ఫామ్‌లో లేడు. స్పిన్నర్లు కేశవ్ మహరాజ్, షంసి రాణించడం ఎంతో కీలకం.




# పింక్ లేడీస్ కప్‌లో.. భారత్ మహిళల జట్టు శుభారంభం

## జోర్డాన్‌పై 2-0తో విజయం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక పింక్ లేడీస్ కప్-2025లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు శుభారంభం చేసింది. షార్జాలో జరిగిన తమ తొలి పోరులో స్వీటీ దేవీ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో జోర్డాన్స్‌పై విజయం సాధించింది. భారత్ తరఫున ప్రియాంక దేవి (23వ నిమిషంలో), మనీషా (54వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే భారత మహిళల జట్టు దూకుడు కనబర్చింది. తొలి అర్ధభాగంలో వచ్చిన అవకాశాన్ని ప్రియాంక దేవి సద్వినియోగ పర్చుకుంటూ జోర్డాన్ గోల్ కీపర్‌ను బోల్తా కొట్టించి భారత్ ఖాతా తెరిచింది. కాసేపటికే స్కోరు పెంచే అవకాశం వచ్చినా దాన్ని మనీషా సరిగ్గా వినియోగించుకోలేక పోయింది. ద్వితీయార్థంలో ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా మనీషా గోల్ కొట్టి జట్టుకు విజయం ఖాయం చేసింది. క్రిస్పిన్ ఛెత్రి భారత మహిళల కోచ్ ఎంపికైన అనంతరం భారత్ జట్టుకు ఇదే తొలివిజయం కావడంవిశేషం.

జోర్డాన్ పదేపదే ప్రతి దాడులకు ప్రయ త్నించినా, స్వీటీ దేవి, పుర్ణిమ కస్తూరితో కూడిన రక్షణ శ్రేణి వాటిని సమర్థవంతంగా అడ్డుకుంది. తెలం గాణ అమ్మాయి గుగులోతు సౌమ్య ఆకట్టుకుంది. ఈ మ్యాచ్ ద్వారా భారత యంగ్ ప్లేయర్ లిషమ్ బబీనాదేవి అంతర్జాతీయ అరంగేట్రంచేసింది. తదుపరిపోరులో ఈనెల 23న రష్యాతో భారత్ తలపడుతుంది.



# ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో.. సెమీస్‌కు భారత్ స్టార్ బాంబ్రీ జంట

**న్యూఢిల్లీ:** ఖతర్ ఓపెన్ ఎటిపి-500 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ స్టార్స్ యూకీ బాంబ్రీ, రోహన్ బోపన్నలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. దోహాలో జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీ ఏకంగా ప్రపంచ నంబర్‌వన్, టాప్‌సీడ్ జంటను బోల్తా కొట్టించి సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లగా, రోహన్ బోపన్న (భారత్)- నునో బోరెజెస్ (పోర్చుగల్) ద్వయం క్వార్టర్ ఫైనల్లో ఇంటిదారి పట్టింది. ప్రపంచ నంబర్వన్ జంట మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్)-మాట్ పావిక్ (క్రొయేషియా)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో యూకీ-డోడిగ్ 2-6, 6-3, 10-8తో విజయం సాధించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-డోడిగ్ ఆరు డబుల్ ఫాల్ట్లు చేసింది.అయితే సూపర్ టైబ్రేక్‌లో యూకీ-డోడిగ్ ద్వయం పైచేయి సాధించింది. జూలియన్ క్యాష్-లాయిడ్ గ్లాస్పూల్ (బ్రిటన్)లతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న-బోర్జెస్ 4-6, 7-6 (7/5), 7-10తో సూపర్ టైబ్రేక్స్‌లో ఓటమి పాలయ్యారు.

# రంజీ ట్రోఫీలో.. ప్రతీకారం తీర్చుకున్న విదర్భ

## ముంబైపై గెలిచి ఫైనల్లోకి ఎంట్రీ



**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ-2024-25 చివరి అంకానికి చేరింది. ఈ సీజన్లో తొలి ఫైనల్ బెర్త్ అధికారికంగా ఖరారైంది. రెండో సెమీ ఫైనల్లో ముంబైని ఓడించి విదర్భ వరుసగా రెండో సీజన్‌లో ఫైనల్‌కు చేరింది. గత సీజన్ ఫైనల్లో ముంబై చేతిలో ఎదురైన పరాభవానికి విదర్భ ఈ సీజన్ సెమీస్‌లో ప్రతీప్రకారం తీర్చుకుంది. నాగపూర్‌లోని క్రికెట్ మైదానంలో జరిగిన సెమీ ఫైనల్లో ముంబైపై విదర్భ 80 పరుగుల తేడాతో గెలుపొందింది. విదర్భ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై 325 పరుగులకు ఆలౌటైంది. హర్ష్ దూబే5, యశ్ ఠాకూర్, పార్థ్ రేఖడే తలో 2 వికెట్లు తీసి ముంబైని దెబ్బకొట్టారు. ముంబై ఇన్నింగ్స్‌లో ఎవ్వరూ భారీస్కోర్లు చేయలేదు. ముంబై ఓటమి ఖరారైన తర్వాత శార్దూల్ ఠాకూర్ (66) అర్ధ సెంచరీ సాధించాడు. షమ్స్ ములానీ (46)సాయంతో శార్దూల్ ముంబైని గట్టెక్కించే ప్రయత్నం చేశాడు. స్టార్ బ్యాటర్లు అజింక్య రహానే (12), శివమ్ దూబే (12), సూర్య కుమార్ యాదవ్ (23) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో ఆకాశ్ ఆనంద్ ఈ సారి 39 పరుగులకు ఔటయ్యాడు. యువ ఆటగాళ్లు ఆయుశ్ మాత్రే (18), సిద్దేశ్లాడ్ (2) నిరాశపరిచారు. ఆఖర్లో తనుశ్ కోటియన్ (26), మోహిత్ అవస్తి (26), రాయ్‌స్టన్ డయాస్ (23) కంటితడుపు చర్చగా బ్యాట్స్ ఝులిపించారు. అక్షయ్ వాద్కర్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అథర్వ తైడే 4, పార్థ్ రేఖడే 23, హర్ష్ దూబే 18, భూటే 11, యశ్ ఠాకూర్ 3 పరుగులు చేసిఔట్ కాగా, దర్శన్ నల్కండే 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. ముంబై బౌలర్లలో శివమ్ దూబే 5 వికెట్లతో రాణించగా, షమ్స్ ములానీ, రాయ్‌స్టన్ డయాస్ తలో 2, శార్దూల్ ఠాకూర్ ఓ వికెట్ తీశారు. అనంతరం బరిలోకి దిగిన ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగులకే ఆలౌటైంది. స్టార్ బ్యాటర్లు, టీమిండియా ప్లేయర్లు అజింక్య రహానే (18), సూర్యకుమార్ యాదవ్ (0), శివమ్ దూబే (0) దారుణంగా విఫలమయ్యారు. ఆకాశ్ ఆనంద్ (106) అద్భుతమైన పోరాటపటిమ కనబర్చి సూపర్ సెంచరీతో ముంబైపరువు కాపాడాడు.విదర్భ బౌలర్లలో పార్థ్ రేఖడే4, యశ్ ఠాకూర్, హర్ష్ దూబేతలో 2, దర్శన్ నల్కండే, భూటేచెరో వికెట్ పడగొట్టారు.

# అంగరంగ వైభవంగా ఫార్ములావన్

## మార్చి 16 నుండి మెల్‌బోర్న్‌లో కార్ల రేసింగ్



**న్యూఢిల్లీ:** ఫార్ములావన్ 75వ వార్షికోత్సవ సీజన్ ఆరంభ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. నలుపు రోడ్డుపై వాయువేగంతో కార్లు నడుపుతూ అభిమానులను అలరించే రేసర్లు ఈ ఈవెంట్లో రెడ్ కార్పెట్‌పై అభిమానులకు చేతులూపుతూ దర్శనమిచ్చారు. 24రేసులతో కూడిన 2025 ఫార్ములావన్ సీజన్ మార్చి 16న మెల్‌బోర్న్‌లో జరిగే ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో మొదలవుతుంది. ఈ సందర్భంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ ఆరంభ కార్యక్రమంలో 2025 సీజన్లో పోటీపడే 20 మంది డ్రైవర్లు తమ కార్లతో పాటు పాల్గొన్నారు. ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్ లూయిస్ హామిల్టన్ స్టేజి మీదకు వచ్చిన సమయంలో ప్రేక్షకుల హర్షధ్వానాలతో ఆడిటోరియం మార్మోగిపోయింది. సుదీర్ఘ ఎఫ్1 చరిత్రలో ఇలాంటి వేడుక జరగడం ఇదేతొలిసారి కాగా, ఇందులో భాగంగా బ్రిటన్ సింగర్ కేన్ బ్రౌన్ మ్యూజిక్ షో ఆహుతులను కట్టిపడేసింది. కనీవినీ ఎరగని రీతిలో కళ్లు మిరుమిట్లు గొలిపేలా సాగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ కళాకారులు పాల్గొన్నారు. ఫార్ములావన్ మరింత విస్తరించడంలో భాగంగానే హాలీవుడ్ సినిమా స్థాయిలో ఈ వేడుకు నిర్వహించారు. దీనిపై హామిల్టన్ స్పందిస్తూ 'చాలా ఉత్సాహంగా ఉంది. కొత్త సీజన్లో మరింత వేగంగా దూసుకెళ్లాలని చూస్తున్నా. అందుకు కావాల్సిన శక్తి ఉంది. కొత్త జట్టులో భాగం కావడం ఆనందంగా ఉంది. ఇదే ఉత్తేజంతో ముందుకు సాగుతా' అని అన్నాడు.

# వాణిజ్యం

# ఫోన్‌పే ఐపిఒకు సెబి గ్రీన్ సిగ్నల్

**ముంబై, ఫిబ్రవరి 21:** గడచిన కొన్ని రోజులుగా దేశీయంగా స్టాక్ మార్కెట్లలోకి వస్తున్న క్రేజీ ఐపీవోల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఈ క్రమంలో మార్కెట్లు ఒడిదొడుకుల్లో ఉండటం కూడా రిటైల్ పెట్టుబడిదారులను మార్కెట్లకు కొంత దూరంగా ఉండేలా చేస్తోంది. ఈ క్రమంలోనే కొత్త కంపెనీలు తమ ఐపీవో ఫ్లోటింగ్ ప్లాన్స్ రివీల్ చేస్తున్నాయి. అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ యాజమాన్యంలో పనిచేస్తున్న 'ఫోన్‌పే' సంస్థ చాలా కాలంగా తన ఐపీవోను తీసుకురావటం కోసం అవసరమైన సన్నాహాలను చేస్తున్న సంగతి తెలిసిందే. చివరిగా 2023లో ఇన్వెస్టర్ల నుంచి ఫండింగ్ అందుకున్న కంపెనీ విలువ అప్పట్లో 10 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. అయితే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు విస్తరించటంతో ఈ విలువ మరింతగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కంపెనీ మార్కెట్లో పేటీఎం, నావీ, గూగుల్ పే వంటి ఇతర పోటీదారులను కలిగి ఉంది. వాస్తవానికి సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ 2022 డిసెంబరులో తన బిజినెస్ ఆపరేషన్స్ ఇండియాకు మార్చేసింది. దీని కారణంగా కంపెనీ దాదాపు 8000 కోట్ల మేర భారీ పన్ను చెల్లింపులను చేపట్టాల్సి వచ్చింది. దీని కారణంగా నాన్ పేమెంట్ సేవలను కంపెనీ పూర్తిగా స్వాధీనంలోకి తెచ్చుకుంది. అయితే ప్రస్తుతం దేశీయ స్టాక్ మార్కెట్లో ఐపీవో ఫ్లోట్ చేయటానికి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో కంపెనీ తన ప్లాన్ ముందుకు తీసుకెళ్లాలని చూస్తోంది. కంపెనీ తన ।శివీకి సంబంధించి సన్నాహక చర్యలను ప్రారంభించినట్లు ఫోన్‌పే ఒక ప్రకటనలో తెలిపింది.




దీని ద్వారా కంపెనీ తన వ్యాపారాన్ని భారతీయ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయాలని యోచిస్తోంది. ఈ ఏడాది కంపెనీ తన వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించి 10వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ ఐపీవో ప్లాన్ మంచి మైలు రాయిగా నిలుస్తుందని తెలుస్తోంది. కంపెనీ తన డిజిటల్ సేవల ద్వారా ప్రస్తుతం దేశంలో కోట్ల మంది ప్రజలకు సేవలను అందిస్తూ దగ్గరైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆర్థిక ఫలితాలు ప్రస్తుతం కంపెనీ దేశీయ స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించటానికి అనుకూలంగా ఉన్నట్లు యాజమాన్యం భావిస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 73 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీంతో కంపెనీ మెత్తం ఆదాయం రూ.5064 కోట్లుగా నమోదైందని బెంగళూరు టెక్ కంపెనీ వెల్లడించింది. ఈ క్రమంలో కంపెనీ తన నికర ఆదాయం రూ.197 కోట్లుగా నమోదు చేసి నష్టాల నుంచి బయటకు వచ్చింది.

# చాట్‌జిపిటి యాక్టివ్ యూజర్లు 400 మిలియన్లు

**ముంబై, ఫిబ్రవరి 21:** ఓపెన్‌ఎఐకి చెందిన ఎఐ చాట్‌బాట్ చాట్‌జిపిటి వినియోగించే వారి సంఖ్య రోజురోజులూ పెరుగుతోంది. ఈ విభాగంలో పోటీ ఇచ్చేందుకు ఇప్పటికే పలు సంస్థలు ముందుకొస్తున్నా చాట్‌జిపిటికి ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. గతేడాది డిసెంబరుతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న యూజర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ విషయాన్ని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బ్రాడ్ లైట్‌క్యాప్ వెల్లడించారు. తమ సేవలు చాలా మందికి చేరువైనట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఓపెన్‌ఎఐ చాట్‌బాట్‌కు వారానికి 400 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారు. డిసెంబరులో ఈ సంఖ్య 300 మిలియన్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్యలో చాలా పెరుగుదల నమోదైంది. చాట్‌జిపిటిని కేవలం వ్యక్తులు మాత్రమే కాదు, కంపెనీలు కూడా వినియోగిస్తున్నాయి. వీటి సంఖ్య దాదాపు 2 మిలియన్ల వరకు ఉంది. సెప్టెంబరుతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపైంది. ఉబెర్, మోర్గాన్ స్టాన్లీ, టి-మొబైల్స్ వంటి పెద్ద పెద్ద కంపెనీలు ఓపెన్ ఎఐని వినియోగిస్తున్న సంస్థల జాబితాలో ఉన్నాయి. చాలా మంది దెవలపర్లు ఓపెన్‌ఎఐకి చెందిన ఎఐ మోడళ్లను వారి సొంత యాప్‌లలో వినియోగిస్తున్నారు. దీంతో ఈసేవల్ని వినియోగించే దెవలపర్ల సంఖ్య ఆరు నెలల్లో రెట్టింపైంది. అదే సమయంలో ఓపెన్‌ఎఐ అడ్వాన్స్‌డ్ రీజనింగ్ మోడల్ వినియోగం ఏకంగా ఐదు రెట్లు పెరిగిందని కంపెనీ తెలిపింది. ఇదిలా ఉండగా, కృత్రిమ మేధ విభాగంలో ఇప్పటికే పోటీ నెలకొంది. చైనాకు చెందిన ఎఐ కంపెనీ డీప్‌సీక్‌ను ఒక్కసారిగా మార్కెట్‌లోకి దూసుకొచ్చి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. మరోవైపు ఎలాన్ మస్క్‌కు చెందిన గ్రోక్ కూడా తన ఎఐ సేవల్ని మెరుగుపరుస్తూ వస్తోంది. అయినప్పటికీ, చాట్‌జిపిటికి మాత్రం తన యూజర్ల సంఖ్యను ఏ మాత్రం కోల్పోకుండా పెంచుకుంటుండడం విశేషం.




# కియా '1380 ఇవి6' కార్లు రీకాల్

**ముంబై, ఫిబ్రవరి 21:** ప్రముఖ వాహన తయారీ సంస్థ కియా మోటార్స్ తన 'ఇవి6' కోసం స్వచ్ఛందంగా రీకాల్ ప్రకటించింది. 2022 మార్చి 3 నుంచి 2023 ఏప్రిల్ 24 మధ్య తయారైన మొత్తం 1,380 యూనిట్లలో సమస్య ఉన్నట్లు గుర్తించి ఈ రీకాల్ ప్రకటించడం జరిగింది. కియా 'ఇవి6' ఎలక్ట్రిక్ కార్లలో ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లో 12వి బ్యాటరీ పనితీరును ప్రభావితం చేసే లోపం కారణంగా రీకాల్ ప్రకటించింది. ఈ సమస్య కారణంగా 2024లో కూడా కంపెనీ 1138 యూనిట్లకు రీకాల్ ప్రకటించింది. ఇప్పుడు మరోమారు రీకాల్ జారీచేసింది. ఇంటిగ్రేటెడ్ ఛార్జింగ్ కంట్రోల్ యూనిట్‌లోని సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ 12వి బ్యాటరీ ఛార్జింగ్, పనితీరును మెరుగుపరుస్తుంది. ఇది కారులోని లైట్స్, వైపర్లు, మ్యూజిక్ సిస్టమ్ వంటి వాటికి శక్తిని ఇస్తుంది. కార్లలో ఈ లోపాన్ని కంపెనీ ఉచితంగానే పరిష్కరిస్తుంది. అయితే సంబంధిత వాహనాల యజమానులను నేరుగాసంప్రదించి వాటిని అప్‌డేట్ చేస్తామని కంపెనీ పేర్కొంది. ప్రభావిత వాహనాల కస్టమర్లు అపాయింట్‌మెంట్ షెడ్యూల్ చేసుకోవడానికి, సంబంధిత కియా డీలర్‌షిప్‌లను సంప్రదించవచ్చు. ఇతర వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్‌కి కాల్ చేయవచ్చు.



# ట్రంప్‌తో ఆపిల్ సిఇఒ భేటీ

**వాషింగ్టన్, ఫిబ్రవరి 21:** అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆపిల్ సిఇఒ టిమ్‌కుక్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌజ్‌లో సమావేశమయ్యాయి. చైనాలో ఆపిల్ తన తయారీ ప్లాంట్ నుంచి భారీగానే వివిధ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. అందులో కొంతభాగం అమెరికాకూ ఎగుమతి అవుతోంది. అయితే ఇటీవల అమెరికా-చైనాల మధ్య సుంకాల విషయంలో తీవ్ర చర్చ సాగుతున్న నేపథ్యంలో టిమ్ కుక్ ట్రంప్‌తో భేటీ అవ్వడం చర్చనీయాంశం అయింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్ని చైనా దిగుమతులపై 10శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇది చైనాలో ఉత్పత్తి అవుతూ అమెరికాలోకి వస్తున్న ఆపిల్ ఉత్పత్తులను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఇది కంపెనీ ఉత్పత్తుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఈ సుంకాల నుంచి ఆపిల్ ఉత్పత్తులను రక్షించడం తన ప్రాథమిక లక్ష్యంగా కుక్ భావించారు. దాంతో ట్రంప్‌ను ప్రత్యక్షంగా కలిసి టారిఫ్ మినహాయిం పులు కోరినట్లు తెలిసింది. అయితే గతంలో మాదిరి కాకుండా ఈ సారి ఆపిల్‌కు ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. వాణిజ్య సమస్యలతో పాటు ఆపిల్ గోప్యతా విధానాలపై ట్రంప్, టిమ్‌కుక్‌ల మధ్య చర్చ జరిగింది. సమర్థంగా చట్టాలను అమలు చేసేందుకు న్యాయ బద్ధమైన సంస్థల కోసం కొన్ని ఐఫోన్లను అన్‌లాక్ చేయాలని ప్రభుత్వం ఎప్పటి నుంచో వాదిస్తోంది. ట్రంప్ ఈ అంశాన్ని లేవనెత్తడంతో కుక్ వినియోగదారుల గోప్యతకు కట్టుబడి కన్నట్లు తెలియ చేశారని తెలిసింది.



# సెన్సెక్స్, నిఫ్టీలకు నాలుగో రోజూ నష్టాలే..

**ముంబై, ఫిబ్రవరి 21:** దేశీయ స్టాక్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ముఖ్యంగా ఆటో స్టాక్స్‌లో విక్రయాల కారణంగా సూచీలపై ఒత్తిడి పెరిగింది. మహీంద్రాఅండ్ మహీంద్రా 6శాతం టాటా మోటార్స్ షేర్లు 2.46 శాతం చొప్పున నష్ట పోయాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్ బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 75,612.61 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 75,112.41 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరిన సూచి, చివరికి 424.90 పాయింట్ల నష్టంతో 75,311.06 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 117.25 పాయింట్ల నష్టంతో 22,795.90 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలోరూపాయి విలువ 7 పైసలు నష్టపోయి రూ.86.71 వద్ద నిలిచింది.మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్ కార్పొరే షన్ వంటి షేర్లు నష్టపోయాయి. టాటా స్టీల్, లార్సెన్ అండ్ టూబ్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఏసియన్ పెయింట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వంటి షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 75.90 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 2944 డాలర్ల వద్ద ట్రేడయింది.



# కొత్త 'ఇవి' పాలసీ వదంతులు ..టాటా, మహీంద్రా షేర్లు డౌన్

**ముంబై, ఫిబ్రవరి 21:** ప్రముఖ కార్ల తయారీ సంస్థలైన టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు ఆహ్వానం పలికేందుకు కేంద్రం కొత్త 'ఇవి' పాలసీని తీసుకురాబోతోందన్న వార్తల నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయా కంపెనీల షేర్లు ఆరు శాతం వరకు నష్టపోయాయి. దేశంలోకి అమెరికా కార్ల తయారీ సంస్థ టెస్లా ఎంట్రీ దాదాపు ఖరారైంది. అయితే సుంకాలు మరింత తగ్గించాలని ఆ కంపెనీ కోరుతోంది. ఈ నేపథ్యంలో టెస్లా కోసం ప్రభుత్వం కొత్త 'ఇవి' పాలసీని మరింత సులభతరం చేస్తూ తీసుకురాబోతోందంటూ వార్తలు వస్తున్నాయి. దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే విదేశీ కార్లు దేశీయ మార్కెట్లో ప్రవేశించేందుకు వీలు పడుతుంది. అప్పుడు దేశీయ కార్ల తయారీ కంపెనీలకు గట్టి పోటీ ఏర్పడుతుంది. ఈ భయాల నేపథ్యంలో ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో నిఫ్టీ ఆటో సూచి 2శాతం మేర నష్టపోయింది. మహీంద్రా అండ్ మహీంద్రా 6శాతం, టాటా మోటార్స్ 2 శాతానికిపైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ప్రస్తుతం 'ఇవి' కార్ల మార్కెట్లో ఈ రెండూ మెజారిటీ వాటా కలిగి ఉన్నాయి.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps